మంగళవారం
05-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 44
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రధాని రాకలో తప్పేముంది? సీజేఐ

న్యూఢిల్లీ: గణపతి పూజ సందర్భంగా తమ ఇంటికి ప్రధాని మోదీ రావడంలో తప్పులేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. అది బహిరంగ భేటీయేనని, వ్యక్తిగత సమావేశం కాదన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... అధికార విభజన అంటే న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల సమావేశం కావద్దని, చర్చించవద్దని అర్థం కాదన్నారు. అయోధ్య తీర్పునకు ముందు దేవుడిని ప్రార్థించడంపై స్పందిస్తూ.. తాను అన్ని మతాలపై గౌరవం, విశ్వాసం ఉన్న వ్యక్తినని చెప్పారు. రాజకీయాల్లో పరిణితి అవసరమని.. న్యాయమూర్తులపై దుష్ప్రచారం చేయడమంటే వ్యవస్థను కించపరచడమేనన్నారు.

మహారాష్ట్ర డీజీపీపై ఈసీ బదిలీ వేటు

పవార్, ఉద్ధవ్, పటోలే హర్షం

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. డీజీపీపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. గత ప్రభుత్వ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ చేసి... సమాచారాన్ని బీజేపీకి అందజేశారని ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేయడంతో ఆమెపై ఈసీ చర్యలు తీసుకుంది. ఈ మేరకు సంబంధిత వర్గాలు సోమవారం సమాచారం వెల్లడించాయి. మహాయుతి

- మిగతా 2 లో

సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశం

విశాలాంధ్ర–హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమించిందన్నారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. కొనుగోళ్ల తీరు పరిశీలించి, సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని అన్నారు. ప్రత్యేకాధికారులుగా ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్యను నియమించారు. అలాగే కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్‌వీ కర్ణన్‌ను, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డాక్టర్ ఏ శరత్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు డి.దివ్య, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి, వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి.వినయ కృష్ణ రెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె.సురేంద్ర మోహన్‌ను నియమించారు.



సీపీఐ శతాబ్ది సంవత్సరం సందర్భంగా పార్టీ కార్యదర్శివర్గం ఆమోదించిన లోగో

జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో రసాభాస

శ్రీనగర్: ఆరేళ్ల తర్వాత ప్రారంభమైన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ సమావేశాల్లో రసాభాస చోటుచేసుకుంది. సోమవారం జరిగిన తొలి అసెంబ్లీ సమావేశంలో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ) ఎమ్మెల్యే వహీద్ పర్రా ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానంపై అభ్యంతరం చెబుతూ బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. కాగా అధికారిక నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి చెందిన స్పీకర్ రహీమ్ రాథర్ మాట్లాడుతూ అటువంటి తీర్మానాన్ని తాను ఇంకా అంగీకరించలేదని చెప్పారు. దీంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. 2019లో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని

- మిగతా 2 లో

ఆదాయ మార్గాలపై దృష్టి

- జాయింట్ వెంచర్స్ వివాదాలు పరిష్కరించండి
- రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో భట్టి

విశాలాంధ్ర–హైదరాబాద్: ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సోమవారం రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... జాయింట్ వెంచర్స్‌లో విలువైన ఆస్తులు ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులు కోర్టుకు వెళ్లి వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ అంశంపై నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించి ఆదాయం సమకూర్చాలని ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, లా సెక్రటరీలతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. వారంలోగా సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. కాలుష్య కారక పరిశ్రమల నిర్వాహకులు... తాము నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని సబ్ కమిటీకి విజ్ఞప్తి చేశారు. వారి వినతులు పరిశీలించి ఓఆర్ఆర్ బయట పరిశ్రమలు స్థాపించేలా సహకరించాలని నగరంలో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను సబ్ కమిటీ సభ్యులు ఆదేశించారు. ప్లాట్ల బహిరంగ వేలం ప్రక్రియ పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. కొంత బాగాన్ని వేలం వేసి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చాలని గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. రాజీవ్ స్వగృహ ప్లాట్ల స్థితిగతులను సబ్ కమిటీ సమీక్షించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు ఆర్థిక చేయూత

- మిగతా 2 లో

నేనే హోంమంత్రినైతే...

- అత్యాచార ఘటనలకు అనిత బాధ్యత వహించాలి
- నేరస్తుడికి కులం, మతం ఉండదు: పవన్ కళ్యాణ్

8లో

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

36 మంది దుర్మరణం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పౌరీ జిల్లాలోని నైనిదండా నుంచి నైనితాల్‌లోని రాంనగర్‌కు వెళుతున్న ఓ బస్సు అల్మోరా వద్ద అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో 36 మంది ప్రయాణికులు మృతి చెందగా, మిగిలినవారు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, క్షతగాత్రులను ఆసుపత్రికి

- మిగతా 2 లో

రెచ్చిపోయిన ఖలిస్థానీలు

కెనడాలో హిందూ ఆలయంపై దాడి

భక్తులను చితకబాదిన వైనం

అట్టావా: కెనడాలోని ఖలిస్థానీలు రెచ్చిపోయారు. బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయం లక్ష్యంగా భక్తులపై దాడులకు తెగబడ్డారు. కర్రలతో వెంటబడి కొట్టారు. ఈ దాడుల్లో చాలామంది భక్తులు గాయపడ్డారు. ఖలిస్థానీ వేర్పాటువాదుల దాడులను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్రంగా పరిగణించారు. ఇక్కడ ప్రజలు అన్ని మతాలు పాటించే హక్కును కాపాడతామని పేర్కొన్నారు. ఈ దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. అదేసమయంలో బ్రాంప్టన్‌లోని ఆలయం వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. ఈ ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తచేసింది. ఆలయ కాంప్లెక్స్‌లో కొందరు ఖలిస్థానీలు భక్తులపై దాడులు చేస్తున్న వీడియో వైరల్‌గా మారింది. దీనిపై పీల్ రీజనల్ పోలీస్ విభాగం ప్రతినిధి మాట్లాడుతూ తాము ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. ఘర్షణలకు కారణాలు చెప్పలేకపోయారు. ఈ దాడులపై కెనడా ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ నేత పియర్రె పొయిలీవ్రే స్పందిస్తూ... ప్రతిఒక్కరికి తమ మతవిశ్వాసాలు పాటించే స్వేచ్ఛ ఉందన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గందరగోళ పరిస్థితులకు ముగింపు పలుకుతానని హామీ ఇచ్చారు. మరోవైపు కెనడా ఎంపీ చంద్ర ఆర్య స్పందిస్తూ కెనడాలో ఎంత తీవ్రస్థాయిలో

- మిగతా 2 లో

పెండింగ్ బిల్లులు చెల్లించండి

మాజీ సర్పంచ్‌ల పోరుబాట

బీఆర్ఎస్ మద్దతు... రాష్ట్రవ్యాప్తంగా అరెస్టులు

విశాలాంధ్ర–హైదరాబాద్: గత కొన్ని రోజులుగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు ఆందోళన చేస్తున్నా... ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో పోరుబాటపట్టారు. సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేసి బొల్లారం పీఎస్‌కు తరలించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. తిరుమలగిరి రోడ్డుపై నిరసనకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు, మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్‌తో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు.

అడ్డుకోవడం అప్రజాస్వామికం

హరీశ్‌రావు మాట్లాడుతూ... సీఎంను కలిసేందుకు

- మిగతా 2 లో

క్రీడా కోటా పెంపు

- విజేతలకు భారీగా ప్రోత్సాహకాలు
- ఒలింపిక్స్‌లో పసిడి సాధిస్తే... రూ.7 కోట్ల నజరానా
- దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ నూతన క్రీడా విధానం
- సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2శాతం నుంచి మూడుశాతానికి పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న క్రీడా విధానం (స్పోర్ట్స్ పాలసీ)పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా యూనిఫాం సర్వీసెస్ లో 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పాలసీలో ప్రతిపాదించారు. శాప్ లో గ్రేడ్ 3 కోచ్ ల నియామకం కోసం అంతర్జాతీయ పతకాలు సాధించిన వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. అలాగే ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, వరల్డ్ చాంపియన్స్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో పతకాలు పొందిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రోత్సాహకాల్లో హర్యానా రాష్ట్రం ముందుండగా, ఇకపై అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ప్రోత్సాహలందించే విధంగా ఏపీ స్పోర్ట్స్ నూతన పాలసీ ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు నాలుగు మిషన్ ఆబ్జెక్ట్స్ తో పాలసీని సిద్ధం చేశారు. స్పోర్ట్స్ ఫర్ ఆల్, నర్చర్ టాలెంట్, స్పోర్ట్స్ ఎకో సిస్టం, గ్లోబల్ విజిబిలిటీ అనే అంశాల ప్రాతిపదికగా పాలసీని రూపొందించారు. ఈ నాలుగు మిషన్ ఆబ్జెక్ట్స్ లో అందరికీ ఆటలు, టాలెంట్ గుర్తింపు, ప్రపంచ స్థాయి శిక్షణ, ప్రోత్సాహకాలు, క్రీడాకారులకు మద్దతు, ఉద్యోగ భద్రత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు, క్రీడా సంఘాలతో సమన్వయం, టెక్నాలజీ వాడకం, ప్రైవేటు రంగంతో కలిసి పనిచేయడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్స్ నిర్వహణ, స్పోర్ట్స్ టూరిజం వంటి అంశాలకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



బండి తాళాలా? సంక్రాంతి తర్వాత ఇస్తా! అందాక నడిచి వెళ్ళండి!

సర్కారు సర్దు పోటు

విద్యుత్ వినియోగదారులపై మరింత భారం

- ఇంధన కొనుగోలు చార్జీలపై ఏపీఈఆర్‌సీ ప్రకటన జారీ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఇంధన కొనుగోలు, సర్దుబాటు చార్జీ(ఎఫ్‌పీపీసీఏ)లపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సోమవారం ప్రకటన జారీ చేసింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు కొనుగోలు చేసిన విద్యుత్‌కు సర్దుబాటు చార్జీలు విధించాలని డిస్కంలు ప్రతిపాదించాయి. విద్యుత్ ఎక్స్ఛేంజిలో 2023-24లో అధిక ధరలకు కొనుగోలు చేసిన ఇంధనానికి, ఇప్పుడు ట్రూ అప్ చార్జీల విధింపును కోరుతూ ఏపీఈఆర్సీకి నివేదించాయి. బహిరంగ మార్కెట్‌లో యూనిట్ విద్యుత్‌కు రూ.6.50 పైసల వరకు ఖర్చవుతుందని డిస్కంలు పేర్కొన్నాయి. ఆ ప్రతిపాదనల మేరకు ఒక్కో యూనిట్‌కు ప్రతి నెలా విద్యుత్ కొనుగోలు సర్దుబాటు చార్జీలుగా రూ.0.40 పైసల చొప్పున వినియోగదారులపై అదనపు భారం మోపాలని ఏపీఈఆర్సీ నిర్ణయించింది. కాగా ట్రూ అప్ చార్జీలపై అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలు ఈ నెల 19లోగా తెలియజేయాలని పేర్కొంది. ఈ మేరకు ఏపీఈఆర్సీ బహిరంగ ప్రకటన విడుదల చేసింది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ ప్రకటించిన కూటమి పక్షాలు... ఇప్పటికే ట్రూఅప్ చార్జీల పేరుతో (2022-23) 6,072 కోట్ల రూపాయల అదనపు భారాన్ని మోపగా, తాజాగా 2023-24 సంవత్సరానికి కూడా వసూలు చేయాలని ఏపీఈఆర్‌సీ ప్రతిపాదించడంపై

- మిగతా 2 లో

అమెరికా అధ్యక్ష ఎన్నికల

పోలింగు నేడే!

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఉత్కంఠ రేకెత్తిస్తున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు మంగళవారం జరగనున్నాయి. సుమారు పాతిక కోట్ల మంది అమెరికా ఓటర్లు తమ నలబై ఏడవ అధ్యక్షుడిని ఎన్నుకోవడం కోసం సిద్ధమవుతున్నారు. భారతీయ కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి పోలింగ్ ప్రారంభం కానున్నది.

2 లో

గాజా యుద్ధం ఆపుతా

కమలాహారిస్ హామీ

వాషింగ్టన్: తనను వ్యతిరేకించేవారిని శత్రువుగా చూడనని అమెరికా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ అన్నారు. ఆదివారం ఆమె మిషిగాన్‌లోని ఈస్ట్‌లాన్సింగ్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. 'తోటి అమెరికన్లను శత్రువులుగా చూడనటు వంటి నూతన స్థితి ప్రారంభానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఎవరిని పడదోయాలో తెలిసిన వ్యక్తిగా కాకుండా... ఎవరిని పైకి తీసుకురావాలో తెలిసిన వ్యక్తిని అధ్యక్షుడిగా చేసుకొనేందుకు సిద్ధంగా ఉన్నాం. పదేళ్లుగా విచ్ఛిన్న రాజకీయాల పేజీని తిప్పేయండి. నన్ను విభేదించేవారిని శత్రువుగా చూడను. వాస్తవానికి... నేను వారికి కచ్చితంగా సముచిత స్థానం కల్పిస్తాను. బలమైన నాయకులు అదే చేస్తారు. కొన్ని గంటల్లో మన జీవితంలో ఎంతో కీలకమైన ఎన్నికలు జరుగుతున్నాయి' అని హారిస్ పేర్కొన్నారు. తాను అధ్యక్షురాలు అయితే గాజాలో యుద్ధాన్ని ముగించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హారిస్ ప్రకటించారు. అదే సమయంలో ఇజ్రాయిల్, పలస్తీనా ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. గతంలో డెమోక్రటిక్ పార్టీ ప్రచార సమయంలో పలస్తీనా మద్దతుదారుల నుంచి ఇక్కడ తీవ్ర వ్యతిరేకత వచ్చింది. 'గాజాలో ఈ ఏడాది అత్యంత కఠిన పరిస్థితులు నెలకొన్నాయి. నేను అధ్యక్షురాలిని అయితే యుద్ధాన్ని ముగించడానికి అవసరమైన ప్రతీది చేస్తాను. అదే సమయంలో బందీలను క్షేమంగా ఇళ్లకు చేరుస్తాను. ఇజ్రాయిల్-లెబనాన్ మధ్య దౌత్య పరిష్కారం కోసం పనిచేస్తాను' అని పేర్కొన్నారు. స్వింగ్ స్టేట్‌గా పేరున్న మిషిగాన్‌ను తన చివరి ప్రచారాల్లో ఓ వేదికగా హారిస్ ఎన్నుకొన్నారు. అక్కడి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆమె కార్యక్రమానికి భారీగా ప్రజలు హాజరయ్యారు. ఈ రాష్ట్రాన్ని దక్కించుకొంటే హారిస్ ఎన్నిక సులువు అవుతుందని డెమోక్రాట్లు భావిస్తున్నారు.

గాజా కీలక దస్త్రాల లీక్...

చిక్కుల్లో నెతన్యాహూ

టెల్అవీవ్: హమాస్, హెజ్బుల్లా గ్రూప్‌ల అంతమే లక్ష్యంగా పెట్టుకున్న బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వాన్ని గాజా కీలక దస్త్రాల లీకేజీ వ్యవహారం కుదిపేస్తోంది. ప్రధాని సన్నిహితులే ఈ రహస్య సమాచారం లీక్ చేశారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దేశ భద్రతాపరమైన అత్యంత రహస్య సమాచారాన్ని పీఎంఓలో పనిచేస్తోన్న అధికారిక ప్రతినిధి ఎలిఫెల్డ్ స్టెయిన్ చేరవేశారని పేర్కొన్నాయి. భద్రతా సంస్థల్లో పనిచేస్తోన్న మరో ముగ్గురికి కూడా దీనితో సంబంధం ఉందని అనుమానిస్తున్నారు. అయితే వారి పేర్లు వెల్లడించలేదు. బందీలను విడిపించే ప్రక్రియకు దీనివల్ల తీవ్ర ఆటంకం కలిగి ఉండొచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. దాంతో బందీల కుటుంబాలు నెతన్యాహు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. నెతన్యాహు మాత్రం తమ కార్యాలయంలో ఎలాంటి తప్పు జరగలేదని అంటున్నారు. మీడియాలో వచ్చిన వార్తల వల్లే ఈ లీకేజీ గురించి తనకు తెలిసిందని వెల్లడించారు. సెప్టెంబర్‌లో హమాస్ చెరలోని ఆరుగురు బందీల మృతదేహాలను దక్షిణ గాజాలోని రఫాలో గుర్తించిన విషయం తెలిసిందే. బందీల మృతి వార్త... ఇజ్రాయిల్‌లో అలజడి రేపింది. ప్రధాని నెతన్యాహుపై విపక్షాలు, బందీల కుటుంబాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. కాల్పుల విరమణ ఒప్పందం కుదరకపోవడానికి నెతన్యాహుయే కారణమని ఆరోపించాయి. ఆ తర్వాత కొద్దిరోజులకే ఆ కీలకపత్రాల సమాచారం యూరోపియన్ మీడియా సంస్థలో ప్రచురితమైంది. అందులో హమాస్ చర్చల వ్యూహాన్ని వెల్లడించారు. ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ, బందీల విడుదల కోసం మధ్యవర్తులు అమెరికా, ఖతార్, ఈజిప్టు చర్చల్లో తలమునకలై ఉన్న సమయంలో అది వెలుగులోకి వచ్చింది. గత ఏడాది అక్టోబర్ ఏడున ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి చేయడంతో సుమారు 1200 మంది ప్రాణాలు కోల్పోయారు.. 251 మందిని మిలిటెంట్ సంస్థ బందీలుగా తీసుకెళ్లింది. దాంతో ఇజ్రాయిల్ మొదలుపెట్టిన ప్రతిదాడుల్లో గాజాలో 43 వేల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మధ్యలో తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో కొందరు బందీలు విడుదల కాగా... ఇంకా 101 మంది హమాస్ చెరలోనే ఉన్నారు. అయితే అనేక ఘటనల్లో కొందరు బందీలు మృతి చెందారు. ప్రస్తుతం 51 మంది మాత్రమే సజీవంగా ఉన్నారని ఇజ్రాయిల్ మీడియా సంస్థ ఒకటి వెల్లడించింది. నెతన్యాహు బందీల జీవితాలతో జూదమాడుతున్నారని మరో మీడియా సంస్థ తీవ్ర ఆరోపణలు చేసింది.

భర్తకు భార్య ట్విస్ట్

కమలాహారిస్ బృందం యాడ్ వైరల్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చొనేది ఎవరో నవంబర్ 5తో తేలిపోతుంది. ఈ కొద్ది సమయంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడం లేదు. ముఖ్యంగా మహిళా ఓటర్లు లక్ష్యంగా డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ బృందం రూపొందించిన యాడ్ వైరల్ అవుతోంది. తన భార్య ట్రంప్‌నకు ఓటేస్తుందని భర్త భావిస్తుంటాడు. అయితే... ఆమె మాత్రం చివరికి కమలాహారిస్‌కు ఓటేస్తున్నట్లుగా ఆ వీడియోను రూపొందించారు. దీనిపై ట్రంప్ మద్దతుదారులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆ వీడియోలో అమెరికా జెండా ముద్రించి ఉన్న టోపీలు ధరించి ఓ జంట పోలింగ్ బూత్‌లోకి వచ్చింది. వాటిని ఎక్కువగా ట్రంప్ మద్దతుదారులు ధరిస్తుంటారు. తన భార్య ట్రంప్‌నకే ఓటేస్తుందని భర్త భావిస్తుంటారు. కానీ... ఓటు వేసేముందు ఆమె, మరో మహిళ ఒకరినొకరు చూసుకొని.. హారిస్‌కు ఓటువేయడం అందులో కనిపించింది. 'మీకు కావాల్సినవారికి మీరు ఓటు వేయొచ్చు. ఆ ఓటు గురించి ఎవరికీ తెలియదు. బూత్‌లో ఏం జరిగిందో... అది బూత్‌కే పరిమితమవుతుంది' అంటూ ఆ వీడియోకు నటి జూలియా రాబర్ట్స్ గళం అందించారు. అలాంటిదే మరో యాడ్‌లో తమ భార్యలు ట్రంప్‌నకే ఓటేస్తారని భర్తలు మాట్లాడుకుంటుంటారు. కానీ వారు మాత్రం కమలకు ఓటేస్తారు. ఈ వీడియోలపై ట్రంప్ మద్దతుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదంతా మూర్ఖత్వమని విమర్శించారు. భార్య తాను ఎవరికి ఓటు వేసిందో భర్తకు చెప్పకుండా ఉంటుందని మనం అనుకోగలమా అని ప్రశ్నించారు. అమెరికా సమాజంలో... పాతుకుపోయిన జాతి, లింగవివక్ష కారణంగానే మహిళలను అధ్యక్ష పీఠానికి దూరంగా ఉంచుతున్నారనే అభిప్రాయం ఉంది. ప్రస్తుత సర్వేల ప్రకారం... 93 శాతం మంది అమెరికన్లు అధ్యక్ష పదవికి మహిళ యోగ్యమేనని అంటున్నారు. కానీ ఓట్ల వద్దకు వచ్చేసరికి మాత్రం వివక్షలు రాజ్యమేలుతున్నాయి. ఈసారి కూడా శ్వేతజాతీయుల్లో మెజారిటీ ప్రజలు... మహిళలు కూడా హారిస్ కంటే ట్రంప్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి.

ఏపీ టెట్‌లో 50 శాతం ఉత్తీర్ణత

త్వరలో డీఎస్సీ ప్రకటన: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జులై-2024 ఫలితాలు విడుదలచేసినట్టు సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్‌కు 4,27,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. 3,68,661 మంది పరీక్షలు రాయగా, 1,87,256 మంది అనగా 50.79 శాతం మంది అర్హత సాధించారు. గతనెల మూడోతేదీ నుంచి 21 వరకు టెట్ పరీక్ష నిర్వహించారు. ప్రాథమిక కీ, రెస్పాన్స్‌షీట్‌లు విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం 29న తుది కీ విడుదల చేశారు. పేపర్-1(ఏ) ఎస్జీటీ తెలుగు, మైనర్ మీడియం పరీక్షలకు మొత్తం 1,69,017 మంది హాజరుకాగా వారిలో 1,04,785 మంది (65.48 శాతం) అర్హత సాధించారు. పేపర్-1(బీ) ఎస్జీటీ స్పెషల్ స్కూల్స్‌కు 2,173 మందికి 767 మంది (35.3శాతం) అర్హులయ్యారు. పేర్-2(ఏ) ఎస్ఏ లాంగ్వేజెస్ పరీక్షలకు 55,781 మంది హాజరుకాగా, వారిలో 22,080 మంది (39.58), పేపర్-2 (ఏ) స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్ అండ్ సైన్స్) ఆల్ మీడియా పరీక్షలకుగాను 88,290 హాజరుకాగా, 33,525 (37.97 శాతం) అర్హత సాధించారు. పేపర్-2(బీ) ఎస్ఏ స్పెషల్ స్కూళ్ల పరీక్షలకు 1,958 మంది హాజరు కాగా, వారిలో 1,627 మంది (83.09) అర్హత సాధించారు. పరీక్షా ఫలితా లను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. విద్యాహక్కు చట్టం, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనల ప్రకారం, ప్రకారం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించాలంటే తప్పనిసరిగా టెట్‌లో అర్హత సాధించాలి. ఉపాధ్యాయ అర్హత కాలపరిమితి జీవితకాలం ఉంటుంది. పేపర్-1లో ఉత్తీర్ణులైన వారు ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించే ఎస్జీటీ పోస్టులకు, పేపర్-2కు అర్హత సాధించిన అభ్యర్థులు ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు అర్హులు. టెట్‌కు డీఎస్సీలో 20 శాతం వెయిటేజీ కల్పించారు. దీంతో టెట్ మార్కులకు ప్రాధాన్యత ఏర్పడింది. నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి లోకేశ్ వెల్లడించారు. త్వరలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటన విడుదల చేస్తామని ఎక్స్‌వేదికగా లోకేశ్ ట్వీట్ చేశారు.

మహారాష్ట్ర డీజీపీపై ఈసీ బదిలీ వేటు

(మొదటిపేజీ తరువాయి)

కూటమి, మహా వికాస్ అఘాడీపై డీజీపీ రష్మీ శుక్లా పక్షపాతం వహిస్తున్నారని ప్రతిపక్షాలు తీవ్ర వ్యాఖ్యలు చేశాయి. గత ప్రభుత్వ హయాంలో నేతల ఫోన్లు ట్యాప్ చేశారని... నేతలు ఏం చేయబోతున్నారనేది తెలుసుకొని ఆ సమాచారాన్ని ప్రస్తుత డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు చేరవేశారని శివసేన (యూబీటీ) నేత సంజయ్‌రౌత్ తీవ్ర విమర్శలు చేశారు. ఆమెను 'బీజేపీ డీజీపీ'గా రౌత్ అభివర్ణించారు. ఆమె కాషాయ పార్టీతో కలిసి పనిచేస్తున్నారని, ఇలాంటి పోలీసులు ఉంటే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించలేమని ఆరోపించారు. ఈ విషయంపై ఎంవీఏలోని పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ప్రతిపక్షాలపై రాజకీయ హింస పెరిగిందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించాయి. ఆమెను తొలగించాలని లేఖలో కోరాయి. దీనిపై ఈసీ స్పందించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించాలని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సూచించారు. తమ విధులు నిర్వహించడంలో పార్టీలకతీతంగా భావించేలా చూడాలన్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి ఫిర్యాదుల మేరకు డీజీపీని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆమె తదుపరి అర్హత కలిగిన ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లు పంపించాలని సీఎస్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో నవంబరు 20న ఓటింగ్ జరగనుంది. 23న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో డీజీపై ఈసీ బదిలీ వేటువేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాగా, డీజీపీని బదిలీ చేస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు పటోలే, శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఇతర ఎంవీఏ నేతలు స్వాగతించారు. ఎన్నికల కమిషన్ సరైన సమయంలో... సరైన నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. బీజేపీ ఏజెంట్లుగా పనిచేస్తున్న ఇలాంటి అధికారులు కొనసాగడం ఎంతమాత్రం మంచిది కాదని వ్యాఖ్యానించారు.

జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో రసాభాస

(మొదటిపేజీ తరువాయి)

కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయ డంతో 2019లో ప్రత్యేక ప్రతిపత్తి హోదాను కోల్పోయింది. దీంతోపాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలని ఫరూఖ్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేస్తోంది. ఒమర్ అబ్దుల్లా కూడా గత అయిదేళ్లుగా అందుకోసమే తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధిం చింది. 90 స్థానాల శాసనసభలో ఎన్సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం తీర్మానం చేసింది. దానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం తెలిపారు. ఈ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని, ఈ మేరకు హామీ లభించిందని మీడియా కథనాలు వెలువడ్డాయి.

సర్కారు సర్దు 'పోటు'

(మొదటిపేజీ తరువాయి)

వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2022-23 సంవత్సరానికి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఏ) వసూళ్ల(ట్రూఅప్ చార్జీలు)కు ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సీ) అనుమతించింది. అయితే డిస్కంలు రూ.8,114 కోట్లు ప్రతిపాదిస్తే అందులో రూ.2,042 కోట్లు తగ్గించి ఉపశమనం కల్గించినట్లు ఏపీఈఆర్సీ చెబుతోంది. 2023-24సంవత్సరానికి సంబంధించి వినియోగించిన విద్యుత్‌పై ఈ ఏడాది నవంబరు నుండి విధించే ఎఫ్‌పీపీసీఏలో నెల వారీగా యూనిట్‌కు ఎంత వసూలు చేయాలనేది కూడా సూచించింది. ఈ మొత్తాన్ని డిసెంబర్ నుండి వినియోగదారుల నుండి వసూలు చేయనున్నారు.2022 ఏప్రిల్‌లో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ అప్ చార్జీలను ఈ ఏడాది నవంబరు, డిసెంబరులో వసూలు చేయనున్నారు. అలాగే 2022 మేనెల ఖర్చును 2025 జనవరి, ఫిబ్రవరి నెలలో వసూలు చేస్తారు. 2022 జూన్ వినియోగాన్ని 2025 మార్చి, ఏప్రిల్‌లోనూ, జులై నెల వినియోగాన్ని 2025 ఫిబ్రవరి, 2022 ఆగస్టు వినియోగాన్ని 2025 మార్చిలో వసూలు చేయను న్నారు. సెప్టెంబరు వినియోగాన్ని ఏప్రిల్‌లోనూ, అక్టోబరు వినియోగాన్ని మేనెలలోనూ, నవంబరు వినియోగాన్ని జూన్‌లోనూ, డిసెంబరు వినియోగాన్ని జులైలోనూ వసూలు చేస్తారు. 2023 జనవరిలో వినియోగించిన మొత్తాన్ని 2025 ఆగస్టు, సెప్టెంబరులోనూ, ఫిబ్రవరి వినియోగాన్ని 2025 అక్టోబరు, నవంబరులోనూ, మార్చి వినియోగాన్ని 2025 డిసెంబరు, 2026 జనవరిలోనూ వసూలు చేసుకునేందుకు అనుమతిచ్చింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగు నేడే!

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఉత్కంఠ రేకెత్తిస్తున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు మంగళవారం జరగను న్నాయి. సుమారు పాతిక కోట్ల మంది అమెరికా ఓటర్లు తమ నలభై ఏడవ అధ్యక్షుడిని ఎన్నుకోవడం కోసం సిద్ధమవు తున్నారు. భారతీయ కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి పోలింగ్ ప్రారంభం కానున్నది. అధ్యక్ష ఎన్నికలలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ జే ట్రంప్ మధ్య తీవ్రపోటీ నెలకొన్నది. వారిద్దరితో పాటు గ్రీన్ పార్టీ అభ్యర్థిని జిల్ స్టెయిన్, లిబర్టేరియన్ పార్టీ అభ్యర్థి చేజ్ ఒలివర్, పార్టీ ఆఫ్ సోషలిజం అండ్ లిబరేషన్ పార్టీ అభ్యర్థిని క్లాడియా డిలా క్రూజ్, కానిస్టిట్యూషన్ పార్టీ అభ్యర్థి రెండాల్ టెరీ, స్వతంత్ర అభ్యర్థి కార్నెల్ వెస్ట్ వంటివారు కూడా పోటీలో ఉన్నారు. జాన్ ఎఫ్ కెన్నెడీ మనుమడు జూనియర్ కెన్నెడీ పోటీ చేసినా ఆఖరు నిముషంలో తన అభ్యర్థి త్వాన్ని ఉపసంహరించుకుని డోనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు. అమెరికాలో అమల్లో ఉన్న ఎన్నికల విధానం ప్రకారం ఓటర్లు పోలింగు తేదీ వరకూ ఆగాల్సిన అవసరం లేకుండా నాలుగు వారాల ముందునుండే తమకు అనువైన రోజున 'ముందస్తు పోలింగు' లో పాల్గొనవచ్చు. స్వయంగా గానీ, మెయిలు ద్వారా గానీ, పోస్టు ద్వారా గానీ ఓటు వేయవచ్చు.

ఇప్పటికే ఎనిమిది కోట్లమంది ఓటర్లు ముందస్తు పోలింగులో ఓటుహక్కు వినియోగించుకున్నారని ముందస్తు ఓటింగును అధ్యయనం చేసే ఫ్లోరిడా విశ్వవిద్యాలయానికి చెందిన 'ఎలక్షన్ ల్యాబ్' సంస్థ వెల్లడించింది. మొత్తం ఓటర్లలో ఇది సుమారు నలభై శాతం ఉంటుందని అంచనా. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ముందస్తు ఓటింగులో 47 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో మెయిల్ ద్వారా ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకున్న మొత్తం ఆరు కోట్ల డెబ్బై ఐదు లక్షలమంది ఓటర్లలో మూడోతేదీ సాయంత్రానికి మూడు కోట్ల యాభై మూడు లక్షలమంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన మూడు కోట్ల ఇరవై రెండు లక్షల మంది కూడా ఓటు హక్కు వినియోగించుకుంటే ముందస్తు ఓటింగు యాభైశాతం వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. దేశ ఆర్థిక పరిస్థితి, ద్రవ్యోల్బణం, పెరిగిన ధరలు, నిరుద్యోగం, అక్రమ వలసలు, తుపాకీ సంస్కృతి, గర్భస్రావపు హక్కులు, లైంగిక హక్కులు, ఆరోగ్య సంరక్షణ, పిల్లల సంరక్షణ, గృహ నిర్మాణం, మధ్యప్రాచ్యం, ఉక్రెయిన్ యుద్ధాలు ప్రధాన అంశాలుగా ఎన్నికల ప్రచారంలో ముందుకు వచ్చాయి. జో బైడెన్ పోటీ నుండి వైదొలగడం వల్ల కేవలం మూడు నెలల ముందు మాత్రమే రంగంలోకి వచ్చిన కమలా హారిస్‌కు ఆ మేరకు ప్రచారంలో అననుకూలత వెంటాడింది. కమలా హారిస్‌కు మద్దతుగా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, బరాక్ ఒబామా, పూర్వపు ప్రథమ మహిళలు హిల్లరీ క్లింటన్, మిషెల్లి ఒబామా, ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్స్ వంటివారు పాల్గొన్నారు. తన సభల్లో కమలా హారిస్ వ్యక్తిత్వాన్ని కించపరిచే నినాదాలను ప్రోత్సహిస్తూ చప్పట్లు కొట్టడం డోనాల్డ్ ట్రంప్ ప్రచార ధోరణికి అద్దం పట్టింది. డోనాల్డ్ ట్రంప్‌ను 'ఫాసిస్టు' అంటూ డెమోక్రటిక్ పార్టీ ప్రచారం చేయగా, కమలా హారిస్‌ను కమ్యూనిస్టుగా, మార్క్సిస్టుగా, రాడికల్ లెఫ్ట్‌గా పేర్కొంటూ రిపబ్లికన్ పార్టీ ప్రచారం చేయడం విశేషం. తాజా పోల్ సర్వేల్లో ఇద్దరిమధ్య వ్యత్యాసం 0.9 శాతం మాత్రమే ఉందని ప్రాజెక్ట్ 538 డాట్ కామ్ సంస్థ ఆదివారం ప్రకటించింది.

'గెలుపు ఎవరిదన్న అంచనా వేయడం అసాధ్యంగా మారిందని' ఆ సంస్థ పేర్కొన్నది. అయినప్పటికీ డోనాల్డ్ ట్రంప్ విజయం సాధించే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు తనకు గట్టిగా అనిపిస్తున్నదని 538 సంస్థ వ్యవస్థాపకుడు సుప్రసిద్ధ సెఫాలజిస్టు నేట్ సిల్వర్ చెప్పారు. గత అరవయ్యేళ్లుగా ఎన్నికల ఫలితాలు చెప్పడంలో దిట్టగా పేరుపొందిన ఇలాన్ లిఫ్ట్ మన్ మాత్రం కమలా హారిస్‌దే విజయం అని చెబుతున్నారు. ఆయన గత పది అధ్యక్ష ఎన్నికల్లో తొమ్మిదిసార్లు విజేతను సరిగ్గా అంచనా వేయగలిగినట్లు పేరు పొందారు. ఓటు వేయడానికి ఆఖరు నిముషంలో నిర్ణయించుకున్న వారిలో సుమారు16 శాతం ఓటర్ల మనోగతాన్ని అంచనా వేయడానికి 'న్యూయార్క్ టైమ్స్ - సియేనా కాలేజి' చేసిన సర్వేలో 55 శాతం మంది ఓటర్లు కమలా హారిస్ వైపు, 36 శాతం డోనాల్డ్ ట్రంప్ వైపు మొగ్గు చూపారని సర్వే నిర్వాహకులు వెల్లడించారు. ఎన్నికల్లో మొదటి నుండి అనిశ్చిత ఫలితాలకు పేరుపడ్డ పెన్సిల్వేనియా, జార్జియా, అరిజోనా, నెవాడా, మిషిగాన్, నార్త్ కరోలినా, విస్కాన్సిన్ రాష్ట్రాలలో జరిగిన సర్వేల్లో ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య వ్యత్యాసం చాలా తక్కువగా ఉండటంతో విజేతను అంచనా వేయడం సాధ్యం కావడం లేదని సర్వేసంస్థలు అంటున్నాయి.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు... సర్పంచులకు చెల్లించం అని నిలదీశారు. వెంటనే బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేసిన మాజీ సర్పంచులను విడుదల చేసేదాకా పోలీస్ స్టేషన్ నుంచి బయటికి వెళ్లేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మాజీ సర్పంచ్‌లపై కర్కషంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతో కృషి చేశారని తెలిపారు. రాష్ట్రం ప్రధాని అవార్డులు, పంచాయతీ అవార్డులు సాధించిందంటే సర్పంచ్‌ల పాత్ర కీలకమని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటిందని, పది లక్షల బిల్లులు కూడా వారికి చెల్లించలేదన్నారు.

ఆదాయ మార్గాలపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

లభిస్తుందని అధికారులకు వివరించారు. సబ్ కమిటీ చర్చించిన అంశాలు మినిట్స్ రూపంలో నమోదు చేయాలని, కొద్ది రోజుల్లో జరిగే సమావేశానికి అధికారులు యాక్షన్ టేకెన్ రిపోర్టుతో హాజరు కావాల్సి ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హౌసింగ్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి హాజరయ్యారు.

క్రీడా కోటా పెంపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యతనిచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పాలసీల కంటే మెరుగైన అంశాలను చేర్చారు. గ్రామ స్థాయి నుంచి క్రీడల ప్రోత్సాహకానికి అవసరమైన ప్రణాళి కను పొందుపరిచారు. ఇందులో భాగంగా కొన్ని ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు.

క్రీడా విజేతలకు భారీ ప్రోత్సాహకాలు

జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధించే వారికి మంచి ప్రోత్సాహకాలు అందిస్తే క్రీడల పట్ల అందరికీ ఆసక్తి పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. క్రీడాకారులకు గుర్తింపు, గౌరవం ఇవ్వాలని సీఎం అన్నారు. ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ.75 లక్షలు ఇస్తుండగా, ఇకపై రూ.7 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే రజత పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు ఇస్తుండగా, ఇకపై రూ.5 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ. 30 లక్షలు ఇస్తుండగా ఇకపై రూ.3 కోట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ఒలింపిక్స్ లో పాల్గొన్న వారికి రూ.50 లక్షల చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని సీఎం సూచించారు. అదే విధంగా ఏషియన్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.4 కోట్లు, రజత పతకం సాధించిన వారికి రూ.2 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.1 కోటి చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఆసియా క్రీడల్లో పాల్గొన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని సూచించారు. వరల్డ్ చాంపియన్ షిప్, వరల్డ్ కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.35 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. జాతీయ క్రీడల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ.10 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.5 లక్షలు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.3 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు. ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో విజేతలకూ ప్రోత్సాహకాలను పెంపు చేశారు. స్పోర్ట్స్ సిటీగా అమరావతిని రూపొందించడంతో పాటు తిరుపతి, వైజాగ్, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయాలని... కడప, విజయవాడ, విజయనగరంలో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందులో విజయనగరం క్రీడా పాఠశాల గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మండల, నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీకి వరంగా సముద్ర తీరం, కొండలు, అడవులు ఉన్నాయని...మౌంటెయిన్ బైకింగ్, వాటర్ స్పోర్ట్స్, నేచర్ ఫోటో గ్రఫీ, ట్రెక్కింగ్ వంటి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఆటలు అంటే క్రికెట్ ఒక్కటే కాదని...అన్ని ఆటలను ప్రోత్సహించాలని సీఎం స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన ఖలిస్థానీలు

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రవాదం పెరిగిపోయిందో ఈ ఘటన చెబుతోందన్నారు. కెనడా హిందువులు ముందుకొచ్చి తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. కెనడాలో తీవ్రవాద శక్తులు రాజకీయాల్లోకి, లా ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగాల్లోకి చొరబడ్డాయని ఆయన ఆరోపించారు. ఎంపీ కెవిన్ వూంగ్ స్పందిస్తూ తీవ్రవాదులకు కెనడా సురక్షిత ప్రదేశంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'హిందువులు, క్రిస్టియన్లు, యూదులను రక్షించడంలో మన నాయకులు విఫలమయ్యారు' అని పేర్కొన్నారు. ఈ దాడులకు తెగబడిన వారిపై తీవ్రస్థాయిలో చర్యలు తీసుకొంటామని బ్రాంప్టన్ మేయర్ పాట్రిక్ బ్రౌన్ హామీ ఇచ్చారు. మత స్వేచ్ఛ అనేది కెనడా మౌలిక విలువలకు చిహ్నమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి ప్రార్థనా మందిరాల వద్ద సురక్షితంగా ఉండాలన్నారు. ఒంటారియో సిఖ్స్ అండ్ గురుద్వారా కౌన్సిల్ కూడా ఈ హింసను ఖండిస్తూ ప్రకటన జారీ చేసింది. హింసకు తమ మతంలో స్థానంలో లేదని పేర్కొంది. ఈ ఘటనపై స్థానిక అధికారులు దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరింది. కొన్ని నెలలుగా కెనడాలోని ఆలయాలపై వరుసగా దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. గతేడాది విండ్‌సోర్‌లోని ఆలయ గోడలపై భారత వ్యతిరేక నినాదాలు రాశారు.

ఆందోళన వ్యక్తం చేసిన హై కమిషన్

బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయం వెలుపల నిర్వహిస్తోన్న కాన్సులర్ క్యాంప్‌పై ఖలిస్థానీ మద్దతు దారులు దాడి చేయడం ఆందోళన కలిగించిందని ఒట్టావాలోని భారత హై కమిషన్ వ్యాఖ్యానించింది. దీనివెనక భారత వ్యతిరేక శక్తులు ఉన్నాయని ఆరోపించింది. 'గతంలో మాదిరిగానే ఒట్టావాలోని హై కమిషన్, వాంకోవర్, టొరంటోలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా సాధారణ కార్యకలాపాల నిమిత్తం క్యాంప్‌లు నిర్వహిస్తోంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భద్రత అందించాలని మేం ముందుగానే కెనడా అధికారులను అభ్యర్థించాం. భారత వ్యతిరేక శక్తుల దాడితో మా క్యాంపు కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఇలాంటి చర్యలు తీవ్ర నిరాశకు గురిచేశాయి. భారత పౌరుల భద్రత పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నాం. వాంకోవర్‌లో కూడా నవంబర్ 2-3 తేదీల్లో ఇదే తరహా యత్నాలు జరిగినప్పటికీ... మా కార్యకలాపాలు కొనసాగించగలిగాం' అని హై కమిషన్ ఎక్స్ వేదికగా స్పందించింది. ఈ తరహా ఘటనలతో పాటు భారత దౌత్యవేత్తలకు బెదిరింపులు వస్తోన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల ఆధారంగా ఈ క్యాంపుల నిర్వహణ ఉంటుందని తెలిపింది.

భారతీయుల భద్రతపై ఆందోళన చెందుతున్నాం: కేంద్రం

న్యూఢిల్లీ: కెనడాలో భారతీయుల భద్రతపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. 'ఉగ్రవాదులు, వేర్పాటువాదుల హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ తరహా దాడుల నుంచి అన్ని ప్రార్థనాస్థలాలను సంరక్షించాలని మేం కెనడా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. హింసకు కారకులైన వారిని శిక్షిస్తారని మేం ఆశిస్తున్నాం. కెనడాలో మా దేశీయుల భద్రత గురించి భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. భారతీయులకు కాన్సులర్ సేవలు అందించే దౌత్యవేత్తలు ఈ తరహా బెదిరింపులకు తలొగ్గరు' అని జైస్వాల్ అన్నారు.

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

తరలిస్తున్నామని పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ... మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రధానమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను విమానాల్లో ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలోని సహాయ ప్రాంతీయ రవాణా అధికారి (ఎన్‌ఫోర్స్‌మెంట్)ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

1186 కేజీల గంజాయి దహనం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకున్న రూ. 3 కోట్లు విలువ చేసే గంజాయిని సోమవారం ఎక్సైజ్ అధికారులు ధగ్ధం చేశారు. భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 1186 కేజీల నిల్వ ఉన్న ఈ గంజాయిని ఇక్కడి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు కేసుల్లో పట్టుబడినట్లు అధికారులు వెల్లడించారు. తల్లాడ మండలంలోని దహన కేంద్రంలో ఈ గంజాయిని దగ్ధం చేయించినట్లు ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. డిసితోపాటు అసిస్టెంట్ కమిషనర్ గణేష్, భద్రాది కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెంట్ జనాయ్య, భద్రాచలం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ రహీమ్ ఉన్నీషా బేగం, సమక్షంలో గంజాయిని దగ్గరుండి దగ్ధం చేయించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దహనం చేసినందుకు ఖమ్మం జిల్లా ఎక్సైజ్ పోలీసులను ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

సమగ్ర ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలి : తహసీల్దార్

ఇల్లందు - విశాలాంధ్ర : సమగ్ర ఇంటింటి సర్వే ప్రభుత్వ దిశా నిర్దేశం ప్రకారం పక్కాగా చేపట్టాలని తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో ధన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌లు అన్నారు. ఎన్యూమరేటర్లకు వారు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సోమవారం పట్టణంలోని స్థానిక సింగరేణి వైసిఓఏ క్లబ్‌లో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఇల్లందు మున్సిపాలిటీ నుండి 81మంది, మండలం నుంచి 139 మంది ఎన్యూమరేటర్లకు, 22 మంది సర్వేసర్లకు శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన ప్రశ్నావళికి సంబంధించిన వివరాలను ఇంటింటికి వెళ్లి సేకరించాలన్నారు. శిక్షణ తీసుకున్న ఎన్యూమరేటర్లు నవంబర్ 6 నుంచి ఈ సర్వే నిర్వహించాలన్నారు. డిఈ మురళి, ఎంపీఓ చిరంజీవి, ఎంఈఓ విఆర్ స్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.

5న ఛలో హైదరాబాద్ ఉద్యమానికి తరలి రావాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఎన్నికల సమయంలో, ఆ తర్వాత ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య ఆరోపించారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 5న హైద్రాబాదులో మహా ధర్నా చేపడుతున్నామన్నారు. ఆటో కార్మికులు సంఘాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. ఆటో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం పథకం వాళ్ళ మరింత కష్టాల ఊబిలోకి నెట్టివేసినట్లు చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫ్రీ బస్సు పథకంతో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 15వేల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్ళు నిండిన కార్మికులకు పెన్షన్, ప్రమాద భీమా రూ.10లక్షలకు పెంచలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 2019 మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలనీ థర్డ్ పార్టీ ఇన్సురెన్స్ ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బత్తుల సత్యనారాయణ, అబ్బులు, ఎస్ డి పాషా, ఆరేల్లి కృష్ణ, దేశి, చింటూ, గోవర్ధన్, కన్ను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కారేపల్లి : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించడం జరుగుతుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ అన్నారు. సోమవారం సింగరేణి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 35 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, ఏడుగురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన కొద్ది రోజులకే చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాష్, మేదరి టోనీ,అడ్డగోడ ఐలయ్య, ధారావత్ వినోద్, ఎండి హనీఫ్, గుగులోతు బీముడు, గోపాల్ నాయక్, ఎండి యాకూబ్ అలీ, షేక్ షఫీ, తాజుద్దీన్, తాసిల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీవో జి సురేందర్, ఆర్ఐ నరసింహారావు పాల్గొన్నారు.

పిల్లలకు చదువుతోపాటు సంస్కారం నేర్పాలి

మంత్రి దామోదర్ రాజనర్సింహ్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : సమాజ చైతన్యానికి గ్రంథాలయాలు తోడ్పాటునందిస్తాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించకపోతే నియంతృత్వం రాజ్య మేలుతుందన్నారు. సోమవారం మెదక్ లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ గా చిలుముల సుహాసినిరెడ్డిగా రాష్ట్ర అధ్యక్షులు డా. రియాజ్ ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిధిగా మంత్రి హాజరుకాగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. చరిత్ర తెలియాలంటే పుస్తకాలు చదవడం చాలా ముఖ్యమన్నారు. గ్రంథాలయ ఉద్యమం చాలా పెద్దదన్నారు. నిజాం నియంతృత్వాన్ని సైతం ఎదిరించడానికి 5 శాతం అక్షరాస్యులు, జర్నలిస్టులే కారణమన్నారు. ఆనాడు జర్నలిస్టులు అంటే అపార గౌరవం ఉండేదన్నారు. ధర్మం, న్యాయంతోపాటు తిరుగుబాటు శక్తి ఉండేదన్నారు. ప్రజల గొంతు నొక్కితే, హక్కులు హరిస్తే తిరుగుబాటు చేయడంలో గ్రంథాలయాలు, జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. నేటి పిల్లలకు చదువుతోపాటు సంస్కారం, చరిత్ర తెలిపాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి సపోర్ట్ చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డా. రియాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాల నిర్వాహణకు సెస్ ఇప్పించాలని మంత్రిని కోరారు. పూర్వ వైభవానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృషి చేసి జ్ఞాన సమాజన్ని నిర్మిస్తామన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయను: చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి

19వ శతాబ్దంలోనే ఏర్పాటు చేసిన గ్రంథాలయాలకు ఎంతో చరిత్ర ఉందని చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సమాజంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత చాలా ముఖ్యమన్నారు. ఆధునిక పోకడలకు అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ నగేష్, గ్రంథాలయ కార్యదర్శి వంశీ కృష్ణ, ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నర్సాపూర్ ఇంచార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సుప్రభాత్ రావు, సుజాత, శేష సాయి రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్‌గా చిలుముల సుహాసిని రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా మంత్రి దామోదర్ రాజనర్సింహాతోపాటు రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షులు డా. రియాజ్ హాజరయ్యారు. సుహాసిని రెడ్డిని దగ్గరుండి బాధ్యతల స్వీకరణ, ప్రమాణ స్వీకరణ చేయించారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేయగా పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ప్రారంభించారు. త్వరలో ఐసీయూ, ఎన్ డి సి, ట్రామా కేంద్రాల ఏర్పాటు చేస్తామన్నారు. నంతరం కౌడిపల్లి మండలం మహమ్మద్ నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనం, కౌడిపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతులు ప్రారంభించి విద్యార్థులతో మంత్రి మాట్లాడారు.

శ్రీనిధి రుణాలకు భీమ కల్పించి భరోసా ఇవ్వాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన శ్రీనిధి రుణాలకు భీమ తోపాటు ప్రమాద భీమా కల్పించడం ద్వారా మహిళలకు భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని సీసీలు, ఏపీఎంలు, డీపీఎం లకు శ్రీనిధి రుణాల పై ప్రభుత్వం కల్పిస్తున్న జీవిత బీమా, ప్రమాద బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీనిధి జోనల్ మేనేజర్ పి. శ్రీనివాసరావు శ్రీనిధి రుణాలపై బీమా నమోదు చేసుకోవాలన్నారు. భీమా నమోదుకు కావలసిన పత్రాలు, అనుమతుల వివరాలను సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ శ్రీనిధి మహిళా సంఘాలకు ఇచ్చే రుణాల పై బీమా సౌకర్యాన్ని కల్పించడం ఉపయోగకరమన్నారు. రుణాలు తీసుకున్న మహిళలకు ఏదైనా కారణాలతో చనిపోయినట్లయితే వారు తీసుకున్న రుణాలను బ్యాంకర్లు వారి కుటుంబ సభ్యుల నుండి వసూలు చేసేవారన్నారు. దింతో కుటుంబ సభ్యుల మీద ఆర్థిక భారం పడేదని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భీమా పథకం వల్ల ఆ రుణం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దీనిపై అన్ని మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు భీమాను తీసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించాలని కలెక్టర్ వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలొ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఏ డి ఆర్ డి ఓ బి నీలయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా వీధి కుక్కలే...

ఇల్లందు - విశాలాంధ్ర: పట్టణంలో వీధి కుక్కల గుంపుల స్వరవిహారం ప్రజలను ప్రాంతీలకు గురిచేస్తుంది. ఈ కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువవుతున్నా వీటిని నివారించే నాథుడు కనిపించడం లేదు. దీంతో మహిళలు, చిన్నపిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా శునకాలు ఉండేవి. ప్రస్తుతం ప్రధాన పట్టణంలో విపరీతంగా తిరగడుతున్నాయి. పగటి సమయంలో ప్రజలు ఎక్కువగా తిరుగుతుంటారు కాబట్టి కొంత రక్షణ అనిపిస్తుంది. కాని చీకటి పడితే వీధుల్లో నడవటం ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే ఉంటుంది. ఒంటరిగా వెళ్లే వారితో పాటు స్కూల్‌కి వెళ్లే పిల్లలను, బైక్‌పై వెళ్లే వారిని అవి టార్గెట్ చేస్తూ వెంటపడి కరుసస్తూన్నాయి. ఇటీవలే కుక్కల కాటు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఒక్కో గుంపులో కనీసం పదికిపైగాఉండటం ఇక్కడి ప్రాణాలకు తీవ్ర అభద్రతగా ఉంది. గతంలో మున్సిపల్ అధికారులు కుక్కల ఉత్పత్తి పెరగకుండా పునరుత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు చేయించేవాళ్లు. ప్రస్తుత పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టిసారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని నెలలుగా వీటి బెడద ఎక్కువైంది.

పట్టణంలో ఎటు చూసినా కుక్కల బెడద అధికమైందని అధికారులు వెంటనే వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు ఎండి నజీర్ అహ్మద్ కోరారు. వీటి నివారణకు అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లడం జరిగిందన్నారు. కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్‌ను విశాలాంధ్ర వివరణ కోరడం జరిగింది. త్వరలోనే పాలకవర్గంతో చర్చించి హక్కుల నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దాంతోపాటు పట్ల కుక్క కాటుకు ప్రజలను గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. చిన్న పిల్లల తల్లి తండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అతిత్వరలో స్టెరిలైజేషన్ తో పాటు వ్యాక్సినేషన్ చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ బయ్యారంలో ఆర్టీసీ కార్గో పాయింట్ ప్రారంభం

విశాలాంధ్ర- పినపాక : పినపాక మండలం, ఈ బయ్యారం క్రాస్ రోడ్డులో ఆర్టీసీ కార్గో పాయింట్‌ను సోమవారం మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి ఆర్టిసి కార్గో సర్వీస్‌లు గ్రామ గ్రామానికి విస్తరించి డోర్ డెలివరీ చేసేందుకు ముందున్నాయని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలను సోమవారం దర్శించుకొని తిరిగి మణుగూరు చేరుకుంటుందన్నారు. మణుగూరు సురక్ష బస్టాండ్ నుండి ప్రతి ఆదివారం ఈనెల 3, 10, 17, 24. తేదీలలో రాత్రి 8 గంటలకు 9 గంటలకు బస్సులు బయలు దేరుతాయన్నారు. భక్తుల సౌకర్యార్థం సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పెద్దలకు రూ.1860 పిల్లలకు రూ.960 రాను పోను ప్రయాణానికి టికెట్ ధర నిర్ణయించిన్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9959225963 అనే ఫోన్ నెంబర్‌ను అని సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ పీవీ రెడ్డి, కార్గో టీం లీడర్ హరి వర్మ, రవి, ఏజెంట్ జీవిఎస్.మూర్తి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిన డియంహెచ్‌ఓ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : వైద్య సిబ్బంది సమయం పాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి, అంకిత భావంతో సేవలు అందించాలని, ములుగు డియంహెచ్ ఓ డాక్టర్ గోపాల్ రావు అన్నారు. సోమవారం వెంకటాపురం(రామప్ప) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటు తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన, మాతా శిశు ఆరోగ్యంలో గర్భిణీ స్త్రీల నమోదు వంద శాతం చేయాలని ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలను అయ్యేటట్టు చూడాలని, అలాగే సెక్షన్ రేటును తగ్గించాలని తెలిపారు. వెంకటాపురం(రామప్ప) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసిస్టు, ఆరోగ్య కార్యకర్తలు, ఎన్సిడి స్టాప్ నర్సు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీ వేగవంతానికి హాలా మొబిలిటీ నిధులు సేకరణ

హైదరాబాద్: భారతదేశంలో వేగంగా పెరుగుతున్న ఈవీ యాజ్ ఏ సర్వీస్ ప్లాట్‌ఫారమ్ అయిన హాలా మొబిలిటీ, తన ప్రీ-సిరీస్ 'ఏ' ఫండింగ్ రౌండ్‌లో రూ. 51 కోట్లు సేకరించింది. ఇది రుణం ఈక్విటీ కలయికతో సమకూరింది. ఈ రౌండ్‌లో వ్యవస్థాపకులు శ్రీకాంత్ రెడ్డి, స్నేహిత్‌రెడ్డి, ఫణి రమినేని (ప్రివియా హెల్త్ వ్యవస్థాపకుడు)తో పాటు రోహన్ బజాజ్ సిండికేట్, ఇన్వెస్ట్, సార్థి యాంజెల్స్, బెస్ట్‌వాంటేజ్ హెచ్ఎన్ఐలు, ఫ్యామిలీ ఆఫీసుల నెట్‌వర్క్ పాల్గొన్నాయి. ఈ కొత్త మూలధనం హాలా మొబిలిటీ యొక్క ఈవీ ఫ్లీట్‌ను విస్తరించడానికి, భారతదేశంలోని ఆరు అదనపు నగరాల్లో తన సేవలను విస్తరించడానికి కీలకంగా ఉంటుంది. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి కంపెనీ 10,000 కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది, దీనివల్ల పర్యావరణహిత, శుద్ధమైన పద్ధతులతో నగర రవాణాలో విప్లవాత్మక మార్పు తీసుకురావాలని చూస్తున్నట్లు హాలా మొబిలిటీ సహ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు.

విశాఖ అపోలో హాస్పిటల్స్‌లో 'సీఏఆర్-టీ' సెల్ థెరపీ

విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ లో ప్రప్రథమంగా అపోలో క్యాన్సర్ సెంటర్స్ (విశాఖపట్నం) క్యాన్సర్ చికిత్స కోసం సీఏఆర్-టీ సెల్ థెరపీని అందుబాటులోకి తెచ్చింది. ఈ థెరపీని సంప్రదాయ చికిత్సలు విఫలమైనప్పుడు ఉపయోగిస్తారు. కఠినమైన రక్త కాన్సర్ కు విప్లవాత్మక చికిత్సగా దీనిని పరిగణించవచ్చు. ఆధునిక సెల్యులార్ థెరపీని ఇమ్యునో యాక్ట్ భాగస్వామ్యంతో అపోలో హాస్పిటల్స్ అందుబాటులో ఉంచింది. ఈ సందర్భంగా అపోలో క్యాన్సర్ సెంటర్స్ (విశాఖపట్నం) సీనియర్ కన్సల్టెంట్ - మెడికల్ ఆంకాలజీ డాక్టర్ రాకేష్ రెడ్డి బోయా మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ఇది ఒక విప్లవాత్మక చర్యని తెలిపారు. సీఏఆర్-టీ సెల్ థెరపీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం గల అపోలో క్యాన్సర్ సెంటర్స్‌లో అందుబాటులో ఉందన్నారు. భారతదేశంలో ఈ చికిత్సను ప్రారంభంలోనే అందించిన కేంద్రాల్లో అపోలో క్యాన్సర్ సెంటర్స్ విశాఖపట్నం ఒకటన్నారు.

సర్వోటెక్ పవర్ సిస్టమ్స్, ఇన్నోవేటివ్ సోలార్ సొల్యూషన్స్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: సర్వోటెక్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్, సోలార్ మైక్రో ఇన్వర్టర్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లు హైటెక్ శ్రేణి కొత్త సిరీస్‌ను విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోలార్ పంప్ కంట్రోలర్‌లు కేంద్ర ప్రభుత్వ పథకాలైన సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, నివాస సౌరశక్తిని వినియోగించుకోవడానికి స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి రైతులను శక్తివంతం చేస్తాయన్నారు. లాంచ్‌లో ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ రామన్ భాటియా మాట్లాడుతూ మా సోలార్ సొల్యూషన్‌లను మార్కెట్‌కు పరిచయం చేయడం పట్ల మేము సంతోషిస్తున్నామన్నారు. ఈ పరిష్కారాలు వ్యక్తులు వ్యాపారాలు తమ కార్బన్ పాదముద్రను తగ్గించడమే కాకుండా స్థిరమైన వృద్ధిని సాధించడంలో సహాయపడతాయన్నారు. గ్లోబల్ లీడర్‌గా పునరుత్పాదక ఇంధన రంగం, మేము మరింత ఉత్పాదక స్థిరమైన భవిష్యత్తును వేగవంతం చేయడంలో ముందంజలో ఉన్నామన్నారు.

మండల అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి : మంత్రి

విశాలాంధ్ర - కూసుమంచి : మండలంలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి కూసుమంచిలోని తన క్యాంప్ కార్యాలయంలో తిరుమలాయపాలెం మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ఈసందర్భంగా గ్రామాల వారీగా ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొని వచ్చారు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. డబుల్ రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా ఎక్కడైనా ఇళ్లు పోతుంటే ఇందిరమ్మ ఇళ్ల క్రింద మంజూరు చేస్తామని, అవసరమైతే ఇంటి పట్టాలు కూడా మరోచోట అందిస్తామని, రోడ్డు నిర్మాణ పనులకు ప్రజలు సహకరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాలేరు అసెంబ్లీలోని నీటి వనరులలో పూర్తి స్థాయిలో చేప పిల్లలను విడుదల కార్యక్రమం వారాంతం నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. వెటర్నరి డాక్టర్లు తమ పరిధిలోని గ్రామాలను ప్రతి వారం కనీసం 3 సార్లు పర్యటించాలని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి రైతు రుణమాఫీ పెండింగ్ నిధులు విడుదల చేయడం జరుగుతుందని, జనవరి నెల నుంచి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను పేదలకు మాత్రమే పంపిణీ చేయాలని, గ్రామసభల ద్వారా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ఉంటుందని అన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు ప్రతివారం కనీసం రెండు సార్లు ప్రతి గ్రామానికి వెళ్ళాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర - గజ్వేల్ : మర్కూక్ మండలంలోని చేబర్తి, వరదరాజ్ పూర్ గ్రామాలలో సోమవారం వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి సంబంధిత అధికారుల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు, పాల్గొనడం జరిగింది. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ రైతులు వడ్ల కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పంట చేతికి రాకముందే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేశామని అదేవిధంగా ఈ ప్రభుత్వం కూడా రైతులను ఇబ్బంది పెట్టకుండా రైతుల ఖాతాలో కొనుగోలు చేసిన వారం పది రోజులలో రైతుల ఖాతాలో డబ్బులు వేయాలన్నారు. తాజా మాజీ జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం, తాజా మాజీ వైస్ ఎంపీపీ మంద బాలారెడ్డి, కార్యదర్శి సిద్దేశ్వర్, ఏఈవో విష్ణువర్ధన్, పాక్స్ డైరెక్టర్ సంజీవ్, తాజా మాజీ సర్పంచ్ అశోక్, నరసన్నపేట తాజా మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, తాజా మాజీ ఉపసర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

గార్డెన్ సిటీ యూనివర్శిటీ సహకారంతో శామ్‌సంగ్ ఇన్‌స్టిట్యూట్ సీడ్ ల్యాబ్

బెంగళూరు: శామ్‌సంగ్ ఆర్ అండ్ డి ఇన్‌స్టిట్యూట్ ఇండియా-బెంగుళూరు (ఎస్ఆర్ఐ-బీ) బెంగుళూరులోని గార్డెన్ సిటీ యూనివర్శిటీ (జీసీయూ)తో కలిసి 'శామ్‌సంగ్ స్టూడెంట్ ఎకోసిస్టమ్ ఫర్ ఇంజినీర్డ్ డేటా (సీడ్) ల్యాబ్'ని ఏర్పాటు చేసి, విద్యార్థులు, అధ్యాపకులకు ఏఐ/ఎంఎల్, డేటా ఇంజినీరింగ్ ప్రపంచంలోకి ప్రవేశించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. ల్యాబ్‌లో, జీసీయూలోని విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు ఎస్ఆర్ఐ-బీలోని సీనియర్ ఇంజనీర్‌లతో సహజ భాషా అవగాహన, స్పీచ్, టెక్స్ట్ రికగ్నిషన్, మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక సాంకేతిక రంగాలపై ఉమ్మడి ప్రాజెక్ట్‌ల ద్వారా అనుభవాన్ని పొందుతారు. శామ్‌సంగ్ ఇప్పటికే నాలుగు సీడ్ ల్యాబ్‌లను-రెండు ల్యాబ్‌లు కర్ణాటకలో, రెండు ల్యాబ్‌లు తమిళనాడులో (విట్- వెల్లూరు, విట్- చెన్నై) ప్రారంభించి, ఏఐ, డేటా సంబంధిత ప్రాజెక్టులలో 400 కంటే ఎక్కువ మంది విద్యార్థులను నిమగ్నం చేసింది.

ఆల్-న్యూ డిజైర్ సెడాన్ ప్రీ-బుకింగ్‌లు ప్రారంభం

న్యూఢిల్లీ: భారతదేశపు ప్రముఖ ప్యాసింజర్ వాహన తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) సోమవారంనాడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 4వ తరం డిజైర్ కోసం బుకింగ్‌లను ప్రారంభించింది. భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కాంపాక్ట్ సెడాన్, ఆల్-న్యూ డిజైర్ దాని ప్రగతిశీల డిజైన్, సెగ్మెంట్-ఫస్ట్ ఫీచర్లు, అసమానమైన విలువ ప్రతిపాదనతో సెగ్మెంట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ఆల్-న్యూ డిజైర్‌ను రూ.11 000 ప్రారంభ చెల్లింపుతో బుక్ చేసుకోవచ్చు. మారుతీసుజుకీ వెబ్‌సైట్‌ను లాగిన్ చేయడం ద్వారా లేదా మీ సమీపంలోని మారుతీ సుజుకి షోరూమ్‌ని సందర్శించడం ద్వారా ఈ బుకింగ్ చేసుకోవచ్చు. డిజైర్ బ్రాండ్ విశేషమైన వారసత్వం ఆధారంగా, ఈ కొత్త తరం మోడల్ భారతీయ మార్కెట్‌కు అసాధారణమైన వాహనాలను అందించాలనే మారుతి సుజుకి నిబద్ధతను సూచిస్తుందని మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు.

బిగ్ బ్యాంగ్ ఎడ్జ్ పరీక్ష ఫిట్‌జీ సన్నద్ధం

న్యూఢిల్లీ: విద్యా రంగంలో తమ సహకారం, ఆవిష్కరణల దిశగా గణనీయమైన పురోగతిలో, దేశంలోని జెఈఈ, ఇతర పోటీ, స్కాలస్టిక్ పరీక్షల కోసం ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ అయిన ఫిట్‌జీ తమ ఐకానిక్ బిగ్ బ్యాంగ్ ఎడ్జ్ (బీబీఈ) పరీక్ష 2024ని 5 నుండి 11వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థుల సమగ్ర విద్యా సామర్థ్యాన్ని బిగ్ బ్యాంగ్ ఎడ్జ్ టెస్ట్ అంచనా వేస్తుంది. తద్వారా వారు తమ విద్యా నైపుణ్యాలు, అభిరుచులపై సమగ్ర పరిజ్ఞానం పొందవచ్చు. బిగ్ బ్యాంగ్ ఎడ్జ్ (బీబీఈ) పరీక్ష అనేది ప్రతి సంవత్సరం ఫిట్‌జీ ద్వారా నిర్వహించబడే ప్రత్యేకమైన డయాగ్నోస్టిక్ పరీక్ష. బీబీఈ ద్వారా, విద్యార్థులు తమ ఆప్టిట్యూడ్, ఎనలిటికల్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్, సమస్య-పరిష్కార నైపుణ్యాల గురించి చక్కటి అవగాహన పొందుతారు. ఈ పరీక్షతో విద్యార్థులు తమ బలాలు, బలహీనతలను విశ్లేషించగలరు. వారి విద్యాసంబంధమైన అభిరుచిని గుర్తించగలరు, తద్వారా వారు సరైన కెరీర్ మార్గాన్ని ఎంచుకోవచ్చు.

నెల్లూరులో అసుస్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్ ప్రారంభం

నెల్లూరు: దేశవ్యాప్తంగా బ్రాండ్ రిటైల్ కార్యకలాపాలను విస్తరింపజేసే దిశగా తైవాన్ టెక్ దిగ్గజం అసుస్ ఇండియా సోమవారంనాడు నెల్లూరులో తమ ప్రత్యేకమైన స్టోర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. కొత్త ప్రత్యేకమైన స్టోర్ 213 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది, ఇది వివోబుక్, జెన్‌బుక్, రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్ఓజీ) ల్యాప్‌టాప్‌లు, గేమింగ్ డెస్క్‌టాప్‌లు, ఆల్-ఇన్ వన్ డెస్క్‌టాప్‌లు, ఉపకరణాలు వంటి అసుస్ ఫ్లాగ్‌షిప్ ఉత్పత్తులతో సహా విస్తృతమైన ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్‌లను ప్రదర్శించటానికి ప్రత్యేక ఏర్పాట్లను కలిగి ఉంది. ఇది నెల్లూరులో ఉన్న బ్రాండ్ మొదట స్టోర్ కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం స్టోర్‌ల సంఖ్యను 10 ఏఈఎస్ స్టోర్‌లకు తీసుకువెళ్లింది. అసుస్ ఇండియా నేషనల్ సేల్స్ మేనేజర్-పిసి అండ్ గేమింగ్ బిజినెస్ జిగ్నేష్భావ్‌సర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మాకు అత్యంత కీలకమైన మార్కెట్‌లలో ఒకటిగా ఉందన్నారు. ఈ స్టోర్ నెల్లూరులోని సోమశేఖర పురం, షాప్ నెం:1, సుందర్ లాడ్జ్ కాంప్లెక్స్, ఆర్ టి సి బస్టాండ్ దగ్గర, అరవింద నగర్ రోడ్ అనే చిరునామాలో ప్రారంభించినట్లు తెలిపారు.

'ఐ అండ్ బి సీడ్స్' ఇప్పుడు క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సొంతం

న్యూఢిల్లీ: ప్రముఖ వ్యవసాయ సంబంధిత పరిష్కారాల సంస్థ అయిన క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ తమ 12వ కొనుగోలును ప్రకటించింది. ఇండస్, ఎస్‌పిఎస్ బ్రాండ్‌లతో బంతి పూల విత్తనాలలో నాయకత్వ స్థానాన్ని కలిగి ఉన్న, పూలు, కూరగాయల విత్తనాల మార్కెట్‌లో ప్రముఖ సంస్థ అయిన ఐ,బి సీడ్స్‌ను కొనుగోలు చేసింది. ఈ వ్యూహాత్మక చర్య, క్రిస్టల్ తన విత్తనాల వ్యాపారాన్ని వైవిధ్యపరచడానికి, అధిక-విలువైన కూరగాయలు, పూల విభాగాలలో తమ కార్యకలాపాలను విస్తరించటానికి, పరిశ్రమలో కంపెనీని బలీయమైన సంస్థగా ఉంచడానికి అనుమతిస్తుంది. ఈ విభాగాల్లోకి విస్తరించడం ద్వారా, దిగుబడి, లాభదాయకతను పెంచే అధిక-నాణ్యత గల కూరగాయలు, పూల విత్తనాలను రైతులకు అందించడం క్రిస్టల్ లక్ష్యంగా చేసుకుంది. ఈ కొనుగోలు, విత్తన సాంకేతికతలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడం, పంట వైవిధ్యాన్ని పెంచడం ద్వారా విస్తృత వ్యవసాయ భూభాగానికి ప్రయోజనం చేకూరుస్తుంది.

చిన్న వ్యాపార యజమానుల రిటైర్మెంట్ ప్లానింగ్‌కు 4 రూల్స్

హైదరాబాద్: చిన్న వ్యాపారం నిర్వహిస్తున్న యజమానులు సాధారణ వృత్తి నిపుణుల కంటే ఆలస్యంగా రిటైర్ అయ్యే అనుకూలత ఉన్నప్పటికీ, రిటైర్మెంట్ ప్లానింగ్ అనేది తీవ్రంగా పరిగణించవలసిన ఒక అంశం. చిన్న వ్యాపార యజమానులు తరచూ ప్రత్యేకమైన సవాళ్ళను ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా నగదు కొరత, రిటైర్మెంట్ ప్రొవిజన్ లేకపోవడం, వ్యాపార పెట్టుబడులు, వ్యక్తిగత పొదుపులను బ్యాలెన్స్ చేయడం వంటి సమస్యలతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కోవచ్చు. క్యాష్ ఫ్లో సందిగ్ధతను నావిగేట్ చేస్తే, రిటైర్మెంట్ అనేది అనివార్య వాస్తవం అవుతుంది. 20:20 నియమాన్ని నేర్చుకోవాలి. ఆలస్యంగా రిటైర్ అయ్యే అవకాశం ఉన్నప్పుడు మీరు రిటైర్మెంట్ ప్లానింగ్‌ను మీ 50వ దశకంలో ప్రారంభించవచ్చు (అప్పటికి మీ వ్యాపారం నిలదొక్కుకొని ఉంటుంది). మీరు 70వ సంవత్సరంలో రిటైర్ అవుతారని అనుకుంటే, మీ పెట్టుబడులను విస్తరించుటకు మీకు కనీసం 20 సంవత్సరాలు ఉంటాయి. మీ తదుపరి 2 దశాబ్దాల కొరకు 2 దశాబ్దాల సమయం. అలాగే, థంబ్ రూల్‌ను అలవరచుకోవాలి. అంటే వార్షిక ఖర్చులలో రిటైర్మెంట్ కొరకు 30% పొదుపు చేసుకోవాలి. అలాగే, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో, పెరుగుతున్న బాధ్యతలను సరి చేసుకోవచ్చు. ఆర్థిక సుస్థిరతను నిలిపి ఉంచేందుకు ఆస్తులను అనేక విధాలుగా ఉంచాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. చివరిగా, ఒక ఎగ్జిట్ స్ట్రాటజీ కొరకు ప్లాన్ చేయడం అనేది చిన్న వ్యాపార యజమానులకు చాలా కీలకమైనది.

34 శాతం వృద్ధిని నివేదించిన జేఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా

ముంబయి: అక్టోబర్ 2024లో 7,045 యూనిట్లు విక్రయించినట్లు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సోమవారం ప్రకటించింది. ఇది గత ఏడాది (అక్టోబర్ 2023)లో ఇదే నెలతో పోలిస్తే 31% వృద్ధి సాధించింది. కంపెనీ న్యూ ఎనర్జీ వెహికిల్స్ (ఎన్ఈవీలు) దాని మొత్తం సేల్స్‌లో గణనీయమైన భాగంగా ఉన్నాయి. మొత్తం పరిమాణాల్లో 70%కి పైగా తోడ్పాడ్డాయి - దేశంలోనే ఏదైనా ప్యాసింజ్ కారు తయారీదారుచే ఒక నెలలో విక్రయించబడిన యూనిట్లలో అత్యధిక వాటా- తద్వారా ఎన్ఈవీలను ఉపయోగించడాన్ని ప్రోత్సహించడంలో తమ నిబద్ధతను ప్రదర్శిస్తోంది. విడుదలైన మొదటి నెలలో 3116 యూనిట్ సేల్స్‌తో ఎంజి విండ్సర్ ఈవి మార్కెట్‌ను విద్యుద్దీకరించింది. అక్టోబర్ 2024లో విక్రయించబడిన అన్ని ప్యాసింజర్ ఎలక్ట్రిక్ కార్స్‌లో అత్యధికం. మొత్తం విక్రయించబడిన యూనిట్లలో 70% భాగం కలిగిన కొత్త ఎనర్జీ వాహనాలే ఉన్నాయి. ఇది పరిశ్రమలోనే అత్యధికం కావడం విశేషం.

సంపాదకీయం

రచ్చకెక్కిన జగన్, షర్మిల గొడవ

ఈ దేశంలో కేవలం వ్యాపార రంగంలో ఉన్న వారి ఆస్తులే పెరగవు. రాజకీయ నాయకుల ఆస్తుల చిట్టా కూడా ఏయేటికి ఆయేడు పెరిగిపోతూనే ఉంటుంది. వ్యాపారాలు లేని రాజకీయ నాయకుల ఆస్తులూ వృద్ధి చెందుతూనే ఉంటాయి. ఎన్నికలలో పోటీచేసే నాయకులు దాఖలుచేసే ప్రమాణ పత్రాలలో క్రమంగా ఆస్తులు పెరిగిన వైనమే కనిపిస్తుంది. మన రాజకీయ నాయకులు ఏడు తరాలకు సరిపడా సంపాదిస్తారు అన్న నానుడి ఉంది. అధికారంలో ఉన్న వారిలో చాలా కొద్దిమంది నాయకుల ఆస్తుల్లో మాత్రమే అనూహ్యమైన పెరుగుదల కనిపించదు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఆ పదవిలోకి రాకముందు ఆయన ఆర్థిక పరిస్థితి బాగా సన్నగిల్లింది అని చెప్పుకునేవారు. చివరకు ఆయనకు హైదరాబాద్‌లో ఉన్న ఇల్లు సైతం అమ్మేయాలనుకున్నారంటారు. ఇప్పుడు రాజశేఖర్ రెడ్డి కుటుంబ ఆస్తులు ఏవి, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సొంతగా సంపాదించిన ఆస్తులు ఏవి అన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఆయనకు ఉన్న ఆస్తి అంతా కుటుంబ ఆస్తేనని జగన్ చెల్లెలు షర్మిల అంటున్నారు. తల్లి విజయమ్మ తన కొడుకుకు రాసిన లేఖలో కూడా అవన్నీ కుటుంబ ఉమ్మడి ఆస్తులేనంటున్నారు. ఆమె కూతురిని సమర్థిస్తున్నారన్న ప్రశ్న ఎటూ ఉంటుంది. కానీ షర్మిల మాత్రం కుటుంబ ఆస్తుల్లో తన వాటా కావాలని కోరుతున్నారు. రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయన కుమారుడు జగన్ మోహన్ రెడ్డి అపారమైన ఆస్తులు సంపాదించాడనేవారు. వనరులకు మించిన ఆస్తులు ఆయనకు ఉన్నాయన్న విషయంలో ఆయన మీద కోర్టు కేసులూ ఉన్నాయి. ఆ కేసులు ఇంకా తెమలలేదు. మొత్తం మీద ఆస్తుల పంపిణీ గొడవ అన్నా, చెల్లెళ్ల మధ్య తగువుగా మారింది. వీరిద్దరి జగడం కేవలం ఆస్తులకే పరిమితం కాలేదు. అది అన్నా చెల్లెళ్ల బంధాన్ని కూడా ప్రశ్నార్థకం చేస్తోంది. అలాగే వారి వంశ ప్రతిష్ఠ కూడా బజారుకెక్కింది. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత సంపాదించారు అన్నది ఎన్నటికీ తేలకపోవచ్చు. అయితే తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ అపారమైన ఆస్తి సంపాదించడన్న వాదన మాత్రం ఉంది. అక్టోబర్ 29న జగన్ మోహన్ రెడ్డికి విజయమ్మ రాసిన లేఖలో తండ్రికి ఇచ్చిన మాట నిలబెట్టుకుని చెల్లెలికి వాటా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు ఈ జగడం వారి కుటుంబ వ్యవహారానికే పరిమితమై ఉండేది. ఇప్పుడు అది రచ్చకెక్కింది. ఇది ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కూడా ప్రభావితం చేయవచ్చు. రాజకీయ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా ఆస్తులు సంపాదించే తీరు ఎలాగో ఆశ్చర్య పరుస్తూనే ఉంటుంది. షర్మిల రాజకీయాల్లోనూ అనేక మలుపులు ఉన్నాయి. రాజశేఖర్ రెడ్డి మరణం తరవాత ఆమె జగన్‌కు మద్దతుగా పాదయాత్రలు చేశారు. ఆమె తల్లి విజయమ్మ కూడా బైబిల్ చేతబూని ఈ పాదయాత్రల్లో పాల్గొన్నారు. ఆ తరవాత షర్మిల తెలంగాణలో వై.ఎస్.ఆర్.టి.పి. అని కొత్త పార్టీ కూడా పెట్టారు. అప్పుడు ఆమె రాజకీయాలు తెలంగాణాకే పరిమితం. ఆ సమయంలో షర్మిల అన్నను వ్యతిరేకిస్తున్నట్టు కనిపించేవారు. ఆ తరవాత అమాంతం తన పార్టీని విచిత్రంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌లో కలిపేశారు. ఆంధ్రప్రదేశ్ లో బలమైన నాయకుడు లేని కారణంగా కాంగ్రెస్ ఆమెను ఏకంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నియమించేసింది. ఆమె అధ్యక్షురాలైన తరవాత కాంగ్రెస్‌లో కొద్దిగానైనా కదలిక వచ్చిన మాట నిజం. తెలంగాణలో ఆమె పార్టీ నడిపిన రోజుల్లో లేని పట్టు షర్మిల ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలైన తరవాత స్పష్టంగానే కనిపిస్తోంది. ఇది ఆమె ప్రతిభకన్నా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌లో నాయకత్వ లోపాన్నే ప్రతిబింబిస్తోంది. తెలంగాణాలో ప్రత్యేక పార్టీ ఏర్పాటు చేసిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎలా అయిపోయారో మరింత ఆశ్చర్యకరమైన అంశం.

జగన్, షర్మిల ఆస్తుల గొడవ ప్రధానంగా బెంగళూరులోని ఎలహంక ప్రాంతంలో 20 ఎకరాల స్థలంలో ఉన్న సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ చుట్టూ తిరుగుతోంది. 2009లో రాజశేఖర్ రెడ్డి హఠాన్మరణం తరవాత ఐక్యంగా ఉన్న ఆ కుటుంబం ఇప్పుడు ఆస్తుల తగాదాల కారణంగా భిన్న రాగాలు ఆలపిస్తోంది. రాజకీయ వైరుధ్యాలూ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. జగన్ సంపాదించిన ఆస్తులు రాజకీయ పలుకుబడికి అతీతమైనవి కావు కనక రాజకీయ విభేదాలు సహజమే. వై.ఎస్.రాజశేఖర రెడ్డి రాజకీయ వారసత్వం ఎవరికి దక్కాలి అన్న గొడవకు జగన్ కాంగ్రెస్ నుంచి బయటికెళ్లి వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడంతో సమసి పోయింది. ఆ పార్టీకి షర్మిల కొంత కాలం అండగా ఉన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యేదాకా అన్నాచెల్లెళ్లు రాజకీయాలలో ఒకే బాటన నడిచారు. అప్పుడు వీరు రాజశేఖరరెడ్డి రాజకీయ పలుకుబడిని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారనిపించింది. 2019 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరిగినప్పుడు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ మొత్తం 175 స్థానాలలో 151 సాధించింది. ఆ సమయంలో అన్నా చెల్లెళ్ల మధ్య ఐక్యత చాలా పటిష్ఠంగా ఉండేది. కానీ ఆ తరవాత 2021లో షర్మిల సొంత అస్తిత్వం కోసం తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేశారు. ఇది జగన్ మద్దతుదార్లను కంగు తినిపించింది. షర్మిల ఉద్దేశాల మీద అనుమానాలు మొదలైనాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలంగాణాలో తన పార్టీని షర్మిల కాంగ్రెస్‌లో మిళితం చేశారు. సాంకేతికంగా ఇది ఎలా సాధ్యమో తెలియదు కానీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల మీద పట్టు సంపాదించడానికి ఆమె అడుగులు వేయడం మొదలుపెట్టారు. లోలోపలఉన్న విభేదాలు బహిరంగ మైనాయి. తన తండ్రి రాజశేఖర రెడ్డి మొత్తం ఆస్తిని తన నలుగురు మనవలకు, మనవరాండ్రకు సమానంగా పంచాలని చెప్పేవారని షర్మిల అంటున్నారు. ఈ ఆస్తి అంతా తన తండ్రి ఉండగానే కుటుంబ వనరుల ద్వారా సమకూరిందేనని ఆమె చెప్తున్నారు. అందువల్ల రాజశేఖర్ రెడ్డి వారసులకు దక్కాలన్నది షర్మిల వాదన. సంప్రదాయం ప్రకారం తాత ఆస్తిలో మనవలకు, మనవరాండ్రకు హక్కు ఉంటుంది. విజయమ్మ రాసిన లేఖలోని అంశాలు ఈ అభిప్రాయానికి అనుకూలంగానే ఉన్నాయి. జగన్ కుటుంబ పద్ధతులను ఉల్లంగిస్తున్నారని ఆమె భావిస్తున్నట్టున్నారు. సరస్వతి పవర్, భారతి సిమెంట్సు, సాక్షి మీడియా, క్లాసిక్ రియాల్టీ, బెంగళూరు, హైదరాబాద్ లోని ఆస్తుల్లో మనవలకు, మనవరాండ్రకు సమాన వాటా ఉండాలని విజయమ్మ కోరుకుంటున్నారు. మొదట జగన్ దీనికి అంగీకరించారని, ఆ తరవాత మాట మార్చారని అంటున్నారు. ఈ ఆస్తులన్నీ రాజశేఖర రెడ్డి హయాంలో సంపాదించినవేనా అన్నది మొత్తం తగాదాలో కీలకం.

మహారాష్ట్ర పోరునుంచి మాయమైన పార్టీలు

ఆర్వీ రామారావ్

మహారాష్ట్రలో రెండు ఐక్య సంఘటనలు ఉన్నా నాయకులు మాత్రం ఆరుగురు ఉన్నారు. శివసేన ఒక వర్గం నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఒక వర్గం నాయకుడు శరద్ పవార్, కాంగ్రెస్ పి.సి.సి. అధ్యక్షుడు నానా పటోలే ఒక వైపు ఉన్నారు. ఈ మూడు పార్టీల ఐక్య సంఘటనను మహారాష్ట్ర వికాస్ అగాఢీ (ఎం.వి.ఎ.) అంటున్నారు. రెండో వేపున శివసేన నుంచి విడిపోయిన ఏక్ నాథ్ షిండే, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్.సి.పి. చీలిక వర్గం నాయకుడు అజిత్ పవార్ ఉన్నారు. దీనిని మహాయుతి అంటున్నారు. ఏకంగా ఆరుగురు నాయకులు రెండు కూటములను నడపడం విశేషమే. కానీ వచ్చే శాసనసభ ఎన్నికలలో ఈ ఆరుగురిలో ఒక్కరు కూడా ప్రధాన భూమిక పోషించే స్థితిలో కనిపించడం లేదు. మహారాష్ట్రలో విజయం సాధించడం బీజేపీకి అత్యవసరం. అలాగే "ఇండియా" ఐక్య సంఘటన కొనసాగడానికి మహారాష్ట్రలో మహా వికాస్ అగాఢీ గెలుపే ఆధారం. లేకపోతే "ఇండియా" ఐక్య సంఘటన అస్తిత్వమే ప్రశ్నార్థకం కావచ్చు. మహారాష్ట్రలో మహాయుతి కూటమిని గెలిపించే బాధ్యతను దేవేంద్ర ఫడ్నవీస్ కు వదిలేయకుండా నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రంగంలోకి దిగారు. మహారాష్ట్రలో తిరుగులేని నాయకుడైన శరద్ పవార్ చేతిలోనూ ఇప్పుడు చక్రం ఉన్నట్టు లేదు. బీజేపీ పెద్ద ఊపు మీద ఏమీలేదు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నానా పటోలేను ఎం.వి.ఎ. ఐక్య సంఘటన కానీ, అటు ప్రతిపక్షం కానీ గుర్తిస్తున్న దాఖలాలే కనిపించడం లేదు. ఈ రెండు ప్రధాన కూటములకు తోడు మరో రెండు మూడు ఐక్య సంఘటనలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి మహారాష్ట్రలో కనిపించడం అరుదు. 1995లో ఇదే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు శరద్ పవార్, సుధాకర్ రావ్ నాయక్ శిబిరాలు కాంగ్రెస్‌లో బలంగా ఉండేవి. సుధాకర్ రావ్ నాయక్ కొంత కాలం ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారు. ఇప్పటి లాగే అప్పుడూ ప్రధాన రాజకీయ పార్టీల తరపున పోటీ చేయడానికి టికెట్ దక్కకపోతే చాలా మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేశారు. రికార్డు స్థాయిలో 3000 మంది తిరుగుబాటుదార్లు ఇండిపెండెంట్లుగా పోటీకి దిగారు. అదే స్థాయిలో 46 మంది ఇండిపెండెంట్లు గెలిచారు. కాంగ్రెస్‌లో చీలికలు ఉండేవి కనక కేవలం 80 సీట్లలో మాత్రమే గెలిచింది. అప్పుడు శివసేన, బీజేపీ ఉమ్మడిగా పోటీ చేశాయి. కానీ ఆ సంఘటనకూ మెజారిటీ దక్కలేదు. ఇండిపెండెంట్లుగా గెలిచినవారు నెమ్మదిగా ఏదో ఒక రాజకీయ పార్టీలో సర్దుకున్నారు.

ప్రస్తుతం మహా వికాస్ అగాఢీ, మహాయుతి ప్రధాన పోటీదార్లుగా కనిపిస్తున్నప్పటికీ రాజ్ ఠాక్రే నాయకత్వంలో మహారాష్ట్ర నవ నిర్మాణ సమితి, ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని పార్టీనీ కొట్టిపారేయడానికి వీలులేదు. సంబాజి రాజే ఛత్రపతి, బచ్చూ కడూ, రాజు శెట్టిని కూడా తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. ఇంకో వేపు మరాఠాలకు రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న మనోజ్ జరంగే కూడా ఉన్నారు. కానీ, ఆయన పోటీలో లేరు. 1995లో లాగే ఇప్పుడూ అన్ని రాజకీయ పార్టీలు తిరుగుబాటు అభ్యర్థులను ఎదుర్కోవాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 145 మంది మద్దతు ఉండాలి. కానీ రెండు ప్రధాన ఐక్య సంఘటనల్లో ఏ పక్షంలోనూ ఈ సామర్థ్యం కనిపించడంలేదు. అవసరాన్నిబట్టి అజిత్ పవార్ గోడ దూకినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

ఎందుకంటే శివసేన చీలిక వర్గం నాయకుడు ఏక్‌నాథ్ షిండే వర్గం, బీజేపీ మతతత్వ రాజకీయాలను అనుసరిస్తాయి. అజిత్ పవార్‌కు మతతత్వ మూలాలు లేవు. అందువల్ల ఆయన కింగ్ మేకర్ స్థాయిలో ఉన్నా ఆస్కారం లేదు. పైగా అజిత్ పవార్ 10 మంది ముస్లిం అభ్యర్థులకు తమ పార్టీ తరఫున టికెట్లు ఇచ్చేశారు.

పోటీ రాజకీయ పార్టీల సిద్ధాంతం ఆధారంగా కాకుండా కులం, ప్రాంతం, స్థానికత; ఎవరు ఏ పక్షం ఓట్లు సంపాదించగలరు అన్న అంశం మీదే ప్రధానంగా ఆధారపడి ఉంది. ఓటర్లను గందరగోళంలో పడేయడానికా అన్నట్టు ఒకే పేరు ఉన్నవారు. చాలా నియోజకవర్గాలలో పోటీలో ఉన్నారు. అన్ని పక్షాలకూ తిరుగుబాటుదార్ల బెడద ఉంది.

> "ఇండియా" ఐక్య సంఘటన కొనసాగడానికి మహారాష్ట్రలో మహా వికాస్ అగాఢీ గెలుపే ఆధారం. లేకపోతే "ఇండియా" ఐక్య సంఘటన అస్తిత్వమే ప్రశ్నార్థకం కావచ్చు. మహారాష్ట్రలో మహాయుతి కూటమిని గెలిపించే బాధ్యతను దేవేంద్ర ఫడ్నవీస్‌కు వదిలేయకుండా నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రంగంలోకి దిగారు. మహారాష్ట్రలో తిరుగులేని నాయకుడైన శరద్ పవార్ చేతిలోనూ ఇప్పుడు చక్రం ఉన్నట్టు లేదు. బీజేపీ పెద్ద ఊపు మీద ఏమీలేదు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నానా పటోలేను ఎం.వి.ఎ. ఐక్య సంఘటన కానీ, అటు ప్రతిపక్షం కానీ గుర్తిస్తున్న దాఖలాలే కనిపించడం లేదు.

కనీసం 50 మంది తిరుగుబాటుదార్లు ఫలితాలను తారుమారు చేయగలిగే స్థితిలో ఉన్నారు. చేసిన పనులు, చేసే వాగ్దానాలు గెలిపించే అవకాశం లేదు. లాడ్లీ బహనా, నిరుద్యోగ భృతి, నాగపూరు-ముంబై మధ్య రహదారి నిర్మాణం, వివిధ అభివృద్ధి పథకాలూ గెలిపించే అవకాశం లేదు. ఏ అభ్యర్థికైనా సొంత పలుకుబడి మీద విజయం సాధించే అవకాశం ఉన్నా, ఆ అభ్యర్థికి తన రాజకీయ పార్టీ టికెట్ ఇవ్వకపోతే, తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేస్తూ ఉంటే, ఆ అభ్యర్థి గెలిస్తే ఆయనను తమ వేపు తిప్పుకోవడం అధికారానికి పెద్ద నిచ్చెనగా ఉపకరిస్తుంది.

తిరుగుబాటు అభ్యర్థుల వ్యవహారం చాలా ఆసక్తికరంగా ఉంది. మహాయుతిలో భాగమైన బీజేపీలో టికెట్లు రాని 19 మంది తిరుగుబాటుదార్లు నేరుగా ఆ ఐక్య సంఘటనలోని పార్టీల అభ్యర్థులనే ఢీకొంటున్నారు. బీజేపీలోని 10 మంది తిరుగుబాటుదార్లలో ఆరుగురు షిండే అభ్యర్థులను ఢీకొంటున్నారు. కొంత మంది సొంత పార్టీనే సవాలు చేస్తున్నారు. ఏక్‌నాథ్ షిండే పార్టీలోని 16 మంది తిరుగుబాటు అభ్యర్థుల్లో తొమ్మిది మంది బీజేపీని సవాలు చేస్తున్నారు. కొంత మంది సొంత పార్టీనే సవాలు చేస్తున్నారు. మహాయుతిలోని 36 మంది తిరుగుబాటుదార్లు మంచి పలుకుబడి ఉన్నవారే. మహా వికాస్ అఘాడీ కూడా దీనికి భిన్నంగా లేదు. కాంగ్రెస్, పవార్ నాయకత్వంలోని తిరుగుబాటు అభర్థులు పరస్పరం అధికార అభ్యర్థులను ఎదిరించడమే కాక ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేననూ ఇబ్బందిలో పడవేసే అవకాశం ఉంది.

పశ్చిమ మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు కత్తులు దూసుకుంటున్నాయి. విదర్భలోని మొత్తం 76 సీట్లలో బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య 36 స్థానాల్లో ముఖాముఖి పోరు సాగుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ గెలిచిన 44 సీట్లలు ఈ 62 స్థానాలు భాగమే. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ ఈ ప్రాంతంలో 29 స్థానాలకు పరిమితం కావలసి వచ్చింది. విదర్భలోని అసెంబ్లీ నియోజక వర్గాలలో లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ ఆధిక్యం సాధించింది కేవలం 18 చోట్లే. ఒక్కోసారి అగ్ర నేతల పరువు కాపాడడం కోసం ఇండిపెండెంట్లు రంగంలోకి దిగొచ్చు.

మహారాష్ట్రలో ప్రస్తుతం 150 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు రంగంలో ఉన్నారు. వీరిలో కొందరు ఉపసంహరించు కోనూవచ్చు. గెలిచిన ఇండెపెండెంట్ల మద్దతు అన్ని రాజకీయ పార్టీలకూ అవసరమే. ఫలానా పార్టీలో ఫలానా నాయకుడు చాలా పలుకుబడిగల వారు అని చెప్పే పరిస్థితి ఇప్పుడు బొత్తిగా కనిపించడం లేదు. శరద్ పవార్‌కు ఇది ఆఖరి ఎన్నికల పోరు కావొచ్చు. 1995లో బాహుబలుల డబ్బు నిర్ణాయక పాత్ర పోషించింది. ఇండిపెండెంట్లకు అయ్యే ఖర్చు ఎలా భరిస్తారు అన్నది రహస్యమేమీ కాదు. తిరుగుబాటుదార్లు, ఇండిపెండెంట్లు పోటీ నుంచి ఉపసంహరించుకోకపోతే ప్రభుత్వం ఏర్పాటులో వీరిదే ప్రధాన పాత్ర అవుతుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, పడగొట్టడానికి ఎంతగా రాజ్యాంగ వ్యతిరేక, అప్రజాస్వామిక పద్ధతులను వినియోగించ వచ్చో మహారాష్ట్రకు దీర్ఘానుభవమే ఉంది.

ఓ అన్న ఓ చెల్లి ఒక తల్లి

చింతపట్ల సుదర్శన్

తూర్పుకొండల మీదికి సూర్యుడు ఎక్కుతుండగానే నిద్రలేచి డాంకీ సంగీతసాధన ఆరంభించక ముందే, అరుగు దిగి మైదానంలో వాకింగ్‌కు బయలు దేరుతుంది డాగీ. అలవాటుగా నిద్రలేచి డాంకీ వైపుచూసింది కదలిక లేదు. హమ్మయ ఇంకా లేవలేదు 'శీఘ్ర బుద్ధే పలాయన:' అనుకుంటూ, అరుగు మీదినుంచి దూకి మైనంలో 'డాగ్ వాక్' చేయసాగింది డాగీ.

పూర్తిగా, తెల్లగా, తెల్లవారాక తిరిగివచ్చిన డాగీ ఆశ్చర్యపడింది. డాగీ ఇంకా లేవలేదు. 'క్యా బాత్ హై' అనుకుని కేకేసింది. 'డాంకీ బ్రో ఇవాళ సంగీతం ప్రాక్టీసు లేదా అని' నీరసంగా కళ్లు తెరిచింది డాగీ 'మనస్సేం బాగులేదు డాగీ. ఆలోచించీ, చించీ 'హార్ట్ అటాక్' వస్తుందేమోననిపిస్తున్నది. అదేంటి బ్రో ఉప్పు ఎక్కువై 'బీపీ' పంచదార తడిసి మోపెడయ్యి 'షుగరూ' మందెక్కువై చివర డామేజీ ఆపైన కొట్టుకోలేక 'హార్ట్ అటాక్‌లూ' మనుషులకు కాని మనకూ వస్తాయా అంది డాగా. మనుషులకైనా, జంతువులకైనా చావడానికి ఏదో ఒక 'రీజను' చూపిస్తాడు. మనమేకర్, మనమేం మినహాయింపు కాదు. ఆలాగా! నీ లాజిక్కుకు ఎదురుచెప్పను కానీ గుండె పగిలేంత గుండెకోత నీకెందుకు

వచ్చెనో చెప్పరాదూ. అయినా అడ్డమైన న్యూసుపేపర్లు వాటిల్లోని చేదు వార్తలు, చెడువార్తలు చదవడం మానెయ్యరాదూ అంది డాగీ. అప్పుడు నాది 'స్టార్వేషన్ డెత్' అనగా 'ఆకలిచావు' అవుతుంది. నువ్వన్నది నిజమే. నిన్న పేపర్లో చదివిన ఓ తల్లి ఆవేదన, ఓ తల్లి గుండెకోత నా గుండెను బరువెక్కించింది. ఎవరా తల్లి ఏమా వేదన, ఏమా గుండెకోత అనడిగింది డాగీ.

ఏమని చెప్పను కన్నబిడ్డల కోసం ఒక తల్లి ఆవేదని అది. ఓ అన్నా...ఓ చెల్లి మధ్యన నలిగిపోయిన ఓ మహాతల్లి కన్నీటి వేదన. అదేంటి బ్రో అన్నా చెల్లి అంటున్నావు. వాళ్లేమీ బద్ధ శత్రువులు కాదు గదా. అన్నా చెల్లెళ్ల బంధం, అనుబంధం ఈనాటిది కాదుగదా. 'ఓ అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం' 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి' అనే పాటలు వినలేదూ అంది డాగీ. అవ్వన్నీ పాత పాటలు, ఈ రోజుల్లో ఒక్క సినిమాలోనన్నా అన్నా చెల్లెళ్ల డ్యూయెట్ విన్నావా? 'సూసేకీ అగ్గి రవ్వలాగే ఉంటాడే నా సామీ, 'ఊ అంటావా ఉఊ అంటావా' లాంటి పాటలుతప్ప. ఆ రోజులు పోయేయి ఆస్తి పంపకాలకు వచ్చేసరికి ఏ మానవ సంబంధాలూ నిటారుగా నిలబడలేవులే అంది డాంకీ.

అస్తులు తప్ప ఆస్తులు లేని మనకు ఇవేం అర్థమవుతాయి, పైగా అబద్ధపు ప్రేమలూ, బంధాల పేరిట సొంతలాభం చూసుకోడాలూ మనకు తెలీవుకదా. రెక్కలొచ్చిం తర్వాత ఎవరి దారి వారిదే ఎవరి పొట్ట తిప్పలు వారివే అంది డాగీ. అవును, మనకు తండ్రీ, తల్లీ, అన్నా, చెల్లీ ఏవీ గుర్తుండవు. ఎమోషన్లు ఎమోషన్లపేరిట బ్లాక్ మెయిల్లూ ఉండవు. ఇంతకీ అన్నా చెల్లీ మధ్యన తల్లీ గొడవేంటో అనడిగింది డాగీ. ఏముంది డాగీ బ్రో మనుషుల లోకం ఇంత దుర్మార్గంగా ఇంత ఛండాలంగా మారడానికి కారణం డబ్బేకదా. మనుషులు, ముఖ్యంగా రాజకీయ నాయకులు 'క్విడ్‌ప్రోకో' అనీ, ఎలక్షన్ ఫండులని, కాంట్రాక్టులనీ ఒకటా రెండా నాలుగు చేతులా ఆస్తులు సంపాదిస్తారు కదా వాటిని అనుభవించేలోపు, ఏ విమాన ప్రమాదంలోనో, ఏ మాయదారి జబ్బుతోనే పరలోక ప్రయాణమై పోతే ఇక వారసుల మధ్య జరిగే కుట్రలూ, కుయుక్తులూ, కమ్ములాటలు ఎన్నో. ఓ అన్నా, ఓ చెల్లి, ఓతల్లి కథయిదే.

ఆస్తికోసం ఆ తల్లి న్యూస్‌పేపర్లో బహిరంగ లేఖ రాసింది. అన్న కుటుంబ ఆస్తులను చెల్లెలుకూ ఇవ్వాలని, అదీ గిఫ్టుగా కాదు బాధ్యతగా ఇవ్వాలని అని డాంకీ అంటుండంగానే అరుగు ఎక్కాడు అబ్బాయి. అవునవును నేనూ చదివాను ఆ అమ్మ ఆవేదనను. తల్లి దండ్రులకు కొడుకులూ, కూతుర్లూ సమానమే అయినా తాము కొంచెం ఎక్కువ సమానం అనుకుంటారు కొడుకులు, తామే తల్లిదండ్రుల ఆస్తులకు సర్వాధికారులం అనుకుంటారు. వెనుకటికి రాజు జ్యేష్ఠకుమారుడే కాదన్న సూత్రం వర్తించేది. ఇప్పుడలాకాదు అందరూ సమానమే. ఆడపిల్లకి ఆస్తి పంచకుండా పాతికో పరకో పడేస్తేసరి అనుకుంటున్నారు మొగరాయుళ్లు అన్నాడు అబ్బాయి.

ఆస్తులు ఇది వరకే పంచేశా ఇక ఇచ్చేదేమీ లేదు అని అన్న, అన్న నేస్తాలు అవాస్తవాలు ప్రకటిస్తుంటే జరగకూడనివన్నీ నా కళ్లముందే జరుగుతున్నాయని ఆ తల్లి బాధ పడుతుండటం వార్తా పత్రికల్లో నవిలిన నాకు రాత్రంతా నిద్రపట్టలేదు. అందుకే ఈ వేళ ఎప్పటిలా నిద్రలేచి సంగీత సాధన చెయ్యలేక పోయాను అంది డాంకీ. మానవ సంబంధాలన్నీ ఆర్థికపరమైనవే అన్న 'కార్ల్‌మార్క్స్' మాట ఇప్పటికీ ఎప్పటికీ నిత్యసత్యమే మరి అన్నాడు అబ్బాయి.

ఆస్తులూ, పంపకాలు, అన్నా చెల్లెళ్ల సంబంధాలు ఇవన్నీ మనకు అవసరమా? నిలువు గాడిద ల్లాంటి మనుషులకు లేని బుద్ధీ, జ్ఞానమూ, చీకూ, చింతా మనకు అవసరమా డాంకీ, బుర్రలోంచి బూజు దులిపెయ్యి అంది డాగీ.

ప్రజామోద తీర్పులిచ్చిన ఖన్నా

కె. రవీంద్రన్

సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్ పదవీ విరమణ తర్వాత ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న సంజీవ్‌ఖన్నా అతి తక్కువకాలం ఆ పదవిలో ఉండనున్నారు. కేవలం ఆరు నెలలు మాత్రమే కొనసాగనున్నందున కొత్తదనాన్ని సృష్టించే అవకాశాలు తక్కువ. అయితే న్యాయసూత్రాలకు, వ్యక్తిగత హక్కులకు, పారదర్శకతకు, రాజ్యాంగ సూత్రాలకు అంకితమై పనిచేయగలరని ఆశించవచ్చు. న్యాయమూర్తిగా ఖన్నా పదవీకాలంలో ముఖ్య ఘట్టాలు ఉన్నాయి. అనేక క్లిష్టతరమైన తీర్పులు ఇచ్చారు. వ్యక్తి గోప్యతాహక్కులు, ఆర్థికస్వేచ్ఛలు, పాలనా పారదర్శకతలాంటి క్లిష్టతరమైన అంశాలపై ప్రజామోద తీర్పులిచ్చారు. ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించాక సమతుల్యమైన తీర్పులనిచ్చి వారసత్వాన్ని కొనసాగించగలరని ఆశిస్తున్నారు. వ్యక్తిగత హక్కులపై గాఢమైన గౌరవం, రాజ్యాంగ స్వేచ్ఛలపైన నిర్వచనాలిచ్చారు. వ్యక్తిగోప్యతపై ఖన్నా ఇచ్చిన తీర్పుఅత్యంత ప్రముఖమైనది. తొమ్మిదిమంది కలిసిన ధర్మాసనం వ్యక్తి గోప్యత హక్కులపై తీర్పు ఇచ్చారు. ఇందులో ఖన్నా ఉన్నారు. ఇందులో మానవాళికి గౌరవం, స్వయంప్రతిపత్తి అనేవి అంతర్గతంగా ఉన్నాయి. వ్యక్తిగత స్వేచ్ఛలు, ప్రభుత్వ జోక్యంపై ప్రస్తావన ఉంది.

డిజిటల్ హక్కులు, పర్యవేక్షణ విధానాలు, డేటా పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ, డిజిటల్ విజ్ఞానం ముఖ్యమైనవి. వ్యక్తి గోప్యతగాకుండా, సామాజిక పురోగతి, ఆర్థిక స్వేచ్ఛలపై ఇచ్చిన తీర్పులలో ఖన్నా అత్యంత ప్రధానమైన న్యాయమూర్తి.

ఆర్థిక విధానాలకు సంబంధించిన కేసుల్లో ఆయన సమతుల్యమైన వైఖరిని అవలంబించారు. వ్యక్తిగత ఏజన్సీకి గౌరవాన్నిచ్చారు. క్రమబద్ధీకరణలో ప్రభుత్వ పాత్రకు ప్రాధాన్యతనిచ్చారు. ఆర్థిక వాస్తవాలపై లోతైన అవగాహన, న్యాయబద్ధత, పారదర్శకతకు అంకితంకావడం లాంటి విషయాలపై ఖన్నా తీర్పునిచ్చారు. వ్యక్తిగత స్వేచ్ఛలను దిగజార్చకుండా సమానమైన అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి ప్రాధాన్యతనిచ్చారు. దేశ ఆర్థిక విధానం రూపకల్పనలో న్యాయవ్యవస్థ పాత్రను మోడరేటర్‌గా ఆయన ప్రాధాన్యాన్ని సమకూర్చారు.

పాలనాపరమైన పారదర్శకతను కొనసాగించడానికి అంకితభావాన్ని కొనసాగించడం ఖన్నా న్యాయసిద్ధాంతాన్ని పాటించడం కీలకమైనది. ప్రభుత్వ అధికారుల, ప్రభుత్వ సంస్థల అంకితభావానికి సంబంధించిన కేసులకు ప్రాధాన్యతనిచ్చారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన తీర్పులో ఆయనది ముఖ్యమైన పాత్ర. ప్రభుత్వ వ్యాపారాలలో పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉందని ఖన్నా నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత కొనసాగించడానికి హామీ ఇవ్వడం పారదర్శకతపై ఆయన నొక్కిచెప్పడం ఆయా సంస్థలపై విశ్వసనీయతకు దోహదం చేస్తుంది. అలాగే ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న అంశాన్ని కూడా ఆయన నొక్కిచెప్పారు. నిష్పాక్షిత, కట్టుబాటు సాక్ష్యంలో తగిన క్రమాన్ని విస్తృతంగా గుర్తించారు. వెలుపలి ప్రభావితాలకు న్యాయమూర్తులు దూరంగా ఉండాలని ఖన్నా తరచుగా చెప్పేవారు. రాజకీయ అంశాలను పరిగణించకుండా న్యాయసూత్రాలపై మాత్రమే ఆధారపడి న్యాయనిర్ణయాలు చేయాలని ఆయన అనేకసార్లు చెప్పేవారు. ఆయన తీసుకున్న ఇలాంటి నిర్ణయాలు ఆయనకు ఎంతగానో గౌరవాన్ని కల్పించాయి.

జస్టిస్ ఖన్నా అణగారిన వర్గాల ప్రజల హక్కుల రక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. భూసేకరణ, న్యాయపరమైన రక్షణలు, సామాజిక, ఆర్థిక హక్కులు, కార్మిక హక్కులు తదితర అంశాలపై తీర్పులు ఇవ్వడానికి ప్రాధాన్యతనిచ్చారు. పరిపాలనకు సంబంధించి ప్రతి అంశంలోనూ పారదర్శకత ఉండాలని ఖన్నా చెప్పారు. ప్రధాన న్యాయమూర్తిగా పదవీస్వీకారం చేయనున్న ఖన్నా ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవించేందుకు ప్రాధాన్యత నివ్వగలరని ఆశించవచ్చు. రాజకీయ పరిస్థితులు అత్యంత వేగంగా మారిపోతున్నాయి. అందువల్ల ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవించేందుకు ఖన్నా కీలకపాత్ర వహించగలరని ఆశిస్తున్నారు. ప్రభుత్వం వ్యక్తిమధ్య మధ్యవర్తిత్వం వహించడంలో న్యాయవ్యవస్థపాత్ర కీలకమైనదని జస్టిస్ ఖన్నా తన పదవీకాలంలో పరిగణించారు.

ఉప ఎన్నికల తేదీలో మార్పు

న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం ఉప ఎన్నికలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 13న కేరళ, పంజాబ్, యూపీలో జరగాల్సిన అసెంబ్లీ ఉప ఎన్నికలను ఈనెల 20వ తేదీకి వాయిదావేసింది. వివిధ రాజకీయ పార్టీలు, కొన్ని సామాజిక సంస్థలు ఎన్నికల తేదీని మార్చాలని కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ తెలిపింది. మారిన షెడ్యూల్ ప్రకారం ఆయా నియోజకవర్గాల్లో నవంబరు 20న పోలింగ్ జరగనుంది. నవంబర్ 13న జరగాల్సిన ఓటింగ్‌ను వాయిదా వేయాలని కాంగ్రెస్, బీజేపీ సహా వివిధ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ పండుగల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని ఆయా పార్టీలు ఈసీకి తెలిపాయి. స్పందించిన ఈసీ తాజాగా సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న అసెంబ్లీ ఉప ఎన్నికల తేదీలను మార్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎన్నికల సంఘానికి ఇటీవల మెమోరాండం ఇచ్చింది. నవంబర్ 15న కార్తీక పూర్ణిమ కారణంగా కుందర్కి, మీరాపూర్, ఘజియాబాద్, ప్రయాగ్‌రాజ్‌లలో మూడు నాలుగు రోజుల ముందుగానే ప్రజలు సంబరాల్లో నిమగ్నమవుతారని పేర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం తేదీలను మార్చాలని కోరింది. నవంబర్ 13న కాకుండా నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించాలన్న బీజేపీ డిమాండ్ నెరవేరింది.

గెలుపుపై ధీమా ఉంది

- చివర్లో బీజేపీ కుట్రలు చేస్తుంది
- అప్రమత్తంగా ఉన్నాం
- జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న విశ్వాసం ఉందని... అయితే హర్యానాలో మాదిరిగా చివరి నిమిషంలో బీజేపీ చేసే కుట్రలు సాగనీయకుండా అప్రమత్తంగా ఉన్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) తరపున ముఖ్యమంత్రి ఎవరన్నది నవంబర్ 23 ఫలితాల తర్వాత నిర్ణయం తీసుకుంటామని రమేశ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. కూటమి నుంచి ముఖ్యమంత్రి ఎంపిక సజావుగానే ఉంటుందని తెలిపారు. హర్యానాలో కాంగ్రెస్ ఓటమి తర్వాత ఇండియా ఐక్య సంఘటన నుంచి గాలి ఎన్డీఏ వైపుకు మళ్లిందన్న వాదనలను జైరామ్ త్రోసిపుచ్చారు. రెండు రాష్ట్రాల్లో ఇండియా ఐక్యసంఘటన మెజారిటీ స్థానాలు సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. 'కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు హర్యానాలో ఫలితం ఊహించని విధంగా ఉంది. మాకు బలమైన కూటమి ఉన్న మహారాష్ట్రలో మేము నమ్మకంగా ఉన్నాము . జార్ఖండ్‌లో కూడా మేము కూటమిగా పోరాడుతున్నాము" అని జైరామ్ తెలిపారు. జార్ఖండ్‌లో కాంగ్రెస్‌కు సానుకూల ఎజెండా ఉందని, జార్ఖండ్ ముక్తి మోర్చా-కాంగ్రెస్ ప్రభుత్వ ఐదేళ్ల విజయాల ఆధారంగా కూటమి నడుస్తోందని ఆయన చెప్పారు. మహారాష్ట్రలో సుమారు రెండేళ్ల తర్వాత ఎంవీఏ ప్రభుత్వాన్ని బీజేపీ అస్థిరపరిచిందని, మహాయుతి ప్రభుత్వం మూడేళ్లు పాలించిందని చెప్పారు. మహారాష్ట్రలో షిండే నేతృత్వంలోని శివసేన, బీజేపీ, అజిత్ పవార్‌కు చెందిన ఎన్సీపీల మహాయుతి ప్రభుత్వం మహారాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా రైతులు, బలహీన వర్గాలకు ద్రోహం చేసిందని జైరామ్ పేర్కొన్నారు. కాబట్టి తాము విజయంపై నమ్మకంగా ఉన్నామని... అదే సమయంలో అప్రమత్తంగానూ ఉన్నామని చెప్పారు. ఎంవీఏ మెజారిటీ గెలిస్తే ముఖ్యమంత్రి ఎవరనే దానిపై జైరామ్ మాట్లాడుతూ... "మేము 'కౌన్ బనేగా ముఖ్యమంత్రి' తో పోరాడటం లేదు, మేము ఎంవీఏ, మహాయుతిలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేయాలనే దాని కోసం పోరాడుతున్నాము. ఎంవీఏకి మెజారిటీ స్థానాల కోసం పోరాడుతున్నాం. ముఖ్యమంత్రి ఎంపిక సజావుగా సాగుతుందనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు" అని జైరామ్ స్పష్టం చేశారు. తొలుత తాము మెజారిటీ సాధించాలని... అదే ముఖ్యమని తెలిపారు. భారతదేశంలో ఎన్నికలు వ్యక్తుల మధ్య అందాల పోటీ కాదని, రాజకీయ పార్టీలు, రాజకీయ పొత్తులు, వారి ఎజెండాలు, వారి మేనిఫెస్టోలు, వారి పనితీరు మధ్య ఎంపిక అని రమేశ్ స్పష్టం చేశారు. జార్ఖండ్, మహారాష్ట్రలో ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకాల పేచీపై స్పందిస్తూ... చాలా మంది ఆశావహులు ఉన్నందున ఇది 'సహజమే' అని అన్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర రెండు చోట్లా కాంగ్రెస్ నుండి టికెట్లు పొందేందుకు చాలా ఉత్సాహంగా ఉన్నారనే వాస్తవాన్ని ఇది ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. మహాయుతి కూటమిల పక్షాల మధ్య కూడా విభేదాలున్నాయన్నారు. నవంబర్ 6 న ముంబైలో ఎంవీఏ భారీ ర్యాలీ నిర్వహించనుందని రమేశ్ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సహా ఎంవీఏ నాయకులంతా హాజరవుతారని... ఆ సభలో ఎంవీఏ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తామని జైరామ్ ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికల్లో పోటీ చేయకపోవడంపై అడిగిన ప్రశ్నకు జైరామ్ స్పందిస్తూ... "ఉత్తరప్రదేశ్‌లో ఇండియా ఐక్యసంఘటన బలంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. మేము ఐక్యంగా పని చేశాం. సమన్వయంతో ప్రచారం చేశాం. ఇది మా కూటమిని బలోపేతం చేయడానికి, భాగస్వామ్య పక్షాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందే కానీ ఉత్తరప్రదేశ్‌లో మా రాజకీయ పట్టును వదులుకుంటున్నాం అని అనుకోరాదు' అని జైరామ్ స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి మాట్లాడలేకనే బీజేపీ బెదిరింపు రాజకీయాలు చేస్తోందని, ప్రచారంలో కుల మతాలను రెచ్చగొడుతోందని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో పెట్టుబడులను మోదీ హైజాక్ చేసి గుజరాత్‌కు తీసుకెళ్లారని రమేశ్ చెప్పారు. ఏది ఏమైనా మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదని అన్నారు. జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా, మహారాష్ట్రలో ఒకే దశలో నవంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు నవంబర్ 23న వెల్లడికానున్నాయి.

మాఫియా బానిస జేఎంఎం సర్కార్

ప్రధాని మోదీ తీవ్ర ఆరోపణ

రాంచి: బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మద్దతు ఇస్తుందని ఆరోపిస్తూ జార్ఖండ్‌లోని జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిని 'ఘుస్పైథియా బంధన్' (చొరబాటుదారుల కూటమి), 'మాఫియా కా గులాం' (మాఫియా బానిస) అని విమర్శించారు. జార్ఖండ్‌లో సంకీర్ణ నేతల కుంభకోణాలు పరిశ్రమగా మారాయని, అవినీతి రాష్ట్రాన్ని చెదపురుగుల్లా కబళించిందని అన్నారు. 'జార్ఖండ్‌లో బుజ్జగింపు రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇక్కడ జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణం బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మద్దతు ఇవ్వడంలో బిజీగా ఉంది. ఇది ఇలాగే కొనసాగితే, జార్ఖండ్‌లో గిరిజన జనాభా తగ్గిపోతుంది. ఇది గిరిజన సమాజానికి, దేశానికి ముప్పు' అని గర్వాలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మోదీ అన్నారు. షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 13, 20 తేదీల్లో నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు నవంబరు 23న జరుగుతుంది. కాగా జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటన తర్వాత ప్రధాన మంత్రి జార్ఖండ్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీ బంగ్లాదేశ్ చొరబాటుదారులను 'ఓటు బ్యాంకు రాజకీయాల' కోసం ఉపయోగించుకుంటున్నాయని, చొరబాటుదారులు స్థిరపడేందుకు వారిని సులభతరం చేస్తున్నాయని, జార్ఖండ్‌లో పరిస్థితి తీవ్రంగా ఉందని మోదీ తెలిపారు. 'పాఠశాలల్లో సరస్వతి వందనాన్ని అడ్డుకున్నారంటే ముప్పు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పండుగల సమయంలో కర్ఫ్యూ విధించడమనేది దుర్గాపూజ, అన్ని ప్రధాన పండుగలపై ప్రభావం పడుతోంది' అని అన్నారు. వివిధ పథకాల కోసం కేంద్రం పంపిన వేల కోట్ల రూపాయలను జార్ఖండ్‌లోని జేఎంఎం నేతృత్వంలోని కూటమి అవినీతి నేతలు మింగేస్తున్నారని ఆయన అన్నారు.

వయనాడ్ విపత్తునూ రాజకీయం చేస్తారా?

బీజేపీపై ప్రియాంక ధ్వజం

వయనాడ్ (కేరళ): కాంగ్రెస్ నాయకురాలు, వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలకు యూడీఎఫ్ అభ్యర్థి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం బీజేపీ విమర్శల దాడిని పెంచారు. ఈ పర్వత ప్రాంత జిల్లాలో జులైలో కొండచరియలు విరిగిపడి వందలాది మంది మరణించగా, అనేక మంది నిర్వాసితులు కావడాన్ని బీజేపీ రాజకీయం చేసిందని విమర్శించారు. రెండో రోజు ప్రచారాన్ని ప్రారంభించిన ఆమె సుల్తాన్ బతేరి అసెంబ్లీ నియోజకవర్గంలోని కెనిచిరలో జరిగిన కూడలి సమావేశంలో ఆమె ప్రసంగించారు. 'ప్రజలకు తీవ్ర బాధ కలిగించే విపత్తును కూడా బీజేపీ రాజకీయం చేసింది. ఈ రోజు ఇక్కడే మనం ప్రారంభిస్తాం. మీరు మీ దేశం, మీ స్వంత అవసరాల గురించి ఆలోచించాల్సిన ప్రదేశంలో మేము నిలబడి ఉన్నాం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. కాషాయ పార్టీపై విరుచుకుపడిన ప్రియాంక, 'దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న బీజేపీ రాజకీయాలు ద్వేషం, కోపం, విభజన, విధ్వంసంతో కూడుకున్నవి' అని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను విస్మరిస్తున్నారని, వారి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగం ముందెన్నడూ లేనంతగా గరిష్ఠ స్థాయికి చేరిందని, ధరలు నిరంతరం పెరుగుతున్నాయని, ఆగిపోయే సూచనలు లేవని చెప్పారు. 'ఈ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా, బీజేపీ రాజకీయాలు మీ సమస్యల నుంచి మిమ్మల్ని మరల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఎందుకంటే దాని ఏకైక లక్ష్యం అధికారంలో కొనసాగడమే' అని ప్రియాంక అన్నారు. భారీ కొండచరియలు విరిగిపడిన కుటుంబాలకు అవసరమైన ఆర్థిక సహాయం పంపిణీ చేయడంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'విఫలమైందని' ఆమె ఆరోపించారు. 'పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇస్తే... మీ కోసం అందరికంటే ఎక్కువగా కష్టపడి పనిచేసి చూపిస్తా. మీ సమస్యలపై అన్ని చోట్లా గళం విప్పి... మీ కోసం పోరాడి... రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తాను. మీరు ఆపదలో ఉన్నప్పుడు వెనక్కి తగ్గని గట్టి పోరాట యోధునిగా మీ పక్కన ఉంటాను' అని ప్రియాంక చెప్పారు. వయనాడ్‌లో నవంబరు 13న పోలింగ్ జరగనుంది.

ప్రజా సమస్యలు పట్టవా?

కాంగ్రెస్, బీజేపీపై మాయావతి ధ్వజం

లక్నో: ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో కోట్లాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ, ఉచితాలు ప్రకటించడంలో బిజీగా ఉన్నారని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) అధినేత్రి మాయావతి సోమవారం అన్నారు. ఈ పార్టీలు ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, ఎన్నికల ముందు తమ తప్పుడు ప్రచారాలు, తప్పుడు వాగ్దానాలతో 'ప్రతికూల రాజకీయాలలో' బిజీగా ఉన్నాయని విమర్శించారు. 'ఈ రెండు పార్టీలు ప్రజలకు చేసిన వాగ్దానాలు నిజాయితీగా నెరవేర్చడం లేదు. ఎందుకంటే అవి (వాగ్దానాలు) ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చేసినవే. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత అవి మరచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు, ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో వాగ్దానాల ఉల్లంఘన ఆరోపణలను ఎదుర్కొంటున్నాయి. ఉత్తర ప్రదేశ్ సహా వివిధ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత సమస్యల నుంచి దృష్టిని మళ్లించడానికి 'జుగాడ్ రాజకీయాలు' చేస్తున్నాయి' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీఎస్పీ ఎలాంటి మ్యానిఫెస్టోను విడుదల చేయదని, అయితే కోట్లాది మంది పేదలు, అణగారిన, నిరుద్యోగుల కోసం తన రాజ్యాంగ బాధ్యత, 'రాజకీయ మతాన్ని' అనుసరించి నిజాయితీగా పని చేయాలని భావిస్తుంది' అని మాయావతి అన్నారు. 'తీవ్రమైన పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రోడ్లు, విద్యుత్, స్వచ్ఛమైన నీరు, శాంతి భద్రతల వంటి కనీస అవసరాల కొరత కారణంగా కోట్లాది ప్రజల జీవితాలు అతలాకుతలం అవుతున్న తరుణంలో బీజేపీ, కాంగ్రెస్ మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వారి ప్రభుత్వాలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేయడం, ఉచితాలు, వాగ్దానాలు ప్రకటించడంలో బిజీగా ఉన్నాయి' అని తెలిపారు. ప్రజలు తమ ఇబ్బందులను తొలగించుకోవడానికి 'ఉపాధి' అవసరమని అన్నారు. రాష్ట్రంలో ఆ తర్వాత వచ్చిన సమాజ్‌వాది పార్టీ, బీజేపీ ప్రభుత్వాల ఉమ్మడి ఉద్యోగాల కంటే తమ ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాల సంఖ్య ఎక్కువని బీఎస్‌పీ అధ్యక్షురాలు చెప్పారు.

భారీగా నగదు, బంగారం, మద్యం పట్టివేత

అడుగడుగునా తనిఖీలు... అయినా ఆగని డబ్బు రవాణా

ముంబై: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అక్రమ డబ్బు రవాణాపై వివిధ శాఖల అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాయి. అక్టోబరు 20వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ముంబై సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర పోలీసులు, ఎక్సైజ్‌శాఖ, ఆదాయ పన్ను శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు సంయుక్తంగా తనిఖీలు, నాకా బందీ నిర్వహించారు. ఇందులో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అక్రమంగా తరలిస్తున్న భారీ నగదు, విదేశీ డాలర్లు, బంగారు, వెండి ఆభరణాలు, మద్యం పట్టుకున్నారు. అయితే ఈ సొత్తు ఎవరిది? ఎవరికి అందజేయడానికి వెళుతున్నారనే సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.

ఎన్నికలు సమీపించడంతో వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి అక్రమంగా డబ్బు, మద్యం రవాణా కావడం పరిపాటిగా మారింది. నాకాబందీలు, తనిఖీలు నిర్వహించినప్పటికీ పోలీసుల కళ్లు గప్పి అక్రమంగా డబ్బు, మద్యం రవాణా అవుతూనే ఉంది. పోలీసులు, వివిధ శాఖల అధికారులు డేగ కళ్లతో కాపుకాస్తూ కోట్లలో అక్రమ డబ్బు, డ్రగ్స్, మద్యాన్ని పట్టుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత చేపట్టిన తనిఖీల్లో ఇప్పటి వరకు ఏకంగా రూ.187.88 కోట్లు విలువచేసే సొత్తు హస్తగతం చేసుకున్నారు. ఇందులో రాష్ట్ర పోలీసు శాఖ ద్వారా రూ.75 కోట్లు, ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.60 కోట్లు, ఆదాయ పన్ను శాఖ ద్వారా రూ.11 కోట్లు, మిగతా ఎన్నికల అధికారుల ద్వారా పట్టుకున్న సొత్తు ఉంది. అక్రమంగా మద్యం తరలిస్తున్న, విక్రయిస్తున్న వారిపై 2,637 కేసులు నమోదు చేశారు. అందుకు బాధ్యులైన 2,460 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు. రూ.9.61 కోట్లు విలువచేసే మద్యం నిల్వలను జప్తు చేశారు. జప్తు చేసిన మద్యంలో విదేశీ, దేశీ, నాటుసారా, తెల్లకల్లు ఉన్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు తాము ప్రయతిస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ ప్రసాద్ సుర్వే అన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ కార్యకర్తలను, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు భారీగా మద్యం వినియోగించే అవకాశాలుంటాయి. దీంతో అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు దాడులు, తనఖీలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అన్ని పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు ప్రయత్నిస్తున్నారు. అందుకు ఎంతైనా ఖర్చు చేయడానికి వెనకాడటం లేదు. కార్యకర్తలు సహా ఓటర్లను సంతోష పెట్టేందుకు రహస్యంగా మద్యం పార్టీలు ఇస్తున్నారు. ఇంటింటికి వెళ్లి మద్యం బాటిళ్లు, డబ్బులు, బిర్యానీ ప్యాకెట్లు పంచుతున్నారు. దీంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు ఇలాంటి రహస్య పార్టీలపై నిఘా వేస్తున్నారు. అందుకు 56 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నియమించారు. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న 164 మంది కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణాకు చెక్ పేట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో 25 శాశ్వత చెక్ పోస్టులు, 26 తాత్కాలిక చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. టోల్ నాకాల వద్ద కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అహిల్యనగర్-పుణే జాతీయ రహదారిపై పార్నేర్ తాలూకా హద్దులో ఎన్నికల అధికారులు, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలో ఓ వాహనంలో సుమారు రూ.25 కోట్లు విలువచేసే బంగారం పట్టుకున్నారు. కార్టన్ బాక్స్‌లో ప్యాకింగ్ చేసిన ఈ బంగారం ఎవరిచ్చారు..? ఎవరికిచ్చేందుకు తీసుకెళుతున్నారనే వివరాలు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. వాహనంలో డ్రైవర్, మరో ఇద్దరు వ్యక్తులున్నారు. అనుమానం వచ్చి వాహనాన్ని మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేయగా 45 కేజీల వెండి కడ్డీలు లభించాయి. దర్యాప్తు పూర్తయితే తప్ప పూర్తి వివరాలు బయటపడవని పోలీసులు చెబుతున్నారు. రాష్ట్రంలో 160 చెరుకు క్రషింగ్ ఫ్యాక్టరీలు, 36 దేశీ మద్యం తయారీ ఫ్యాక్టరీలు, 45 బీరు తయారు ఫ్యాక్టరీలు, 65 వైనరీ, 48 విదేశీ మద్యం తయారీ ఫ్యాక్టరీలు, 216 నాటుసారా విక్రయించే షాపులు, 262 విదేశీ మద్యం విక్రయించే షాపులు, 1,734 వైన్ షాపులు, 4,155 దేశీ మద్యం విక్రయించే షాపులున్నాయి. దీంతో ఓటింగ్, కౌంటింగ్ తంతు పూర్తయ్యేంత వరకు హోల్‌సేల్, రిటైల్ మద్యం షాపులపై సీసీ టీవీ కెమరాల ద్వారా నిఘా వేయనున్నారు. మరోవైపు, ప్రభుత్వ వాహనాలనూ వదలొద్దని ఎన్నికల సంఘం ఆదేశించింది. డబ్బు రవాణా కు సొంత, అద్దె వాహనాలతోపాటు పోలీసు వ్యాన్లను కూడా వినియోగించే ప్రమాదం కనిపిస్తోంది. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కొందరు నేతలు పోలీసు జీపులు, వ్యాన్లలో డబ్బు రవాణా చేసే ఆస్కారముంది. దీంతో రాష్ట్ర సరిహద్దుల్లో, నగరాలు, పట్టణాల్లో నాకాబందీలు, తనిఖీలు చేసే సమయంలో పోలీసు వాహనాలతోపాటు ప్రభుత్వ వాహనాలను కూడా తనిఖీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

పోటీ నుంచి తప్పకున్న జరంగే

ముంబై: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం మొదలైంది. వివిధ పార్టీలు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో పోటీ విషయమై మరాఠా రిజర్వేషన్ కోసం పోరాడుతున్న మనోజ్ జరంగే పాటిల్ యూటర్న్ తీసుకున్నారు. 'మహా' ఎన్నికల నుంచి వైదొలిగారు. ఈ నెల 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారని మనోజ్ జరంగే ఆదివారం ప్రకటించారు. తన పార్టీ తరఫున ఏడుగురు అభ్యర్థులను పోటీకిదించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మరో ఆరు నియోజకవర్గాల్లో అధికార పార్టీ కూటమి అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. మరో రెండు నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు మద్దతు ప్రకటించారు. కాగా, గంటల వ్యవధిలోనే యూటర్న్ తీసుకున్నారు. ఎన్నికల నుంచి వైదొలిగారు. 'ఒకే కులం బలంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం అసాధ్యం. మనం రాజకీయాల్లోకి కొత్త. అభ్యర్థిని నిలబెట్టి ఓడిపోతే ఆ కులానికి అవమానం. అందుకే మరాఠా అభ్యర్థులందరినీ అభ్యర్థిస్తున్నాను.. తమ నామినేషన్లను ఉపసంహరించుకోండి' అని అన్నారు. మరాఠాలకు న్యాయం చేయని వారిపై మాత్రమే పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కాగా, విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతంగా సాగిన విషయం తెలిసిందే. ఆందోళనలకు సామాజిక కార్యకర్త మనోజ్ జరంగే నేతృత్వం వహించారు. ఆరుసార్లు నిరాహార దీక్షకు దిగారు. అప్పటి నుంచి ఆయన పేరు నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోంది. ఈ దీక్షతో దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనతో చర్చలు కూడా జరిపింది. జరంగే ఉద్యమం కారణంగా ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 'మహాయతి' కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో తాజా అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన మద్దతు కోసం వివిధ పార్టీలు క్యూ కట్టాయి. ఈ క్రమంలో ఆయన అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకే విడతలో ఈ నెల 20న ఎన్నికలు జరగనుండగా... 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

కుప్పకూలిన 'మిగ్ 29'

ప్రాణాలతో బయటపడ్డ పైలట్, కో పైలట్

ఆగ్రా: భారత వైమానిక దళానికి చెందిన మిగ్ 29 విమానం ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాలో కూలిపోయింది. విమానం కూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదం నుంచి పైలట్, కోపైలట్ ప్రాణాలతో బయటపడ్డారు. వీరిద్దరూ ప్రమాదం సమయంలో విమానం నుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. సోమవారం పంజాబ్ అదంపూర్ నుంచి ఆగ్రా వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మిగ్-29 విమానం కూలడానికి కారణాలు తెలియరాలేదు. విమానం ల్యాండింగ్ పాయింట్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో కూలిపోయిందని అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు దీనిపై వైమానిక దళం అధికారికంగా స్పందించలేదు. కాగరౌల్‌లోని సోనిగా గ్రామ సమీపంలోని ఖాళీ పొలాల్లో పైలట్ విమానం కూలిపోయిందని.. జనావాస ప్రాంతంలో కూలిపోయి ఉంటే భారీ నష్టం జరిగేదని చెబుతున్నారు.

బాణసంచా నిషేధం అమలుపై చర్యలేవి?

ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ: వాయు కాలుష్యం పెరగడంతో ఢిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో వార్తలను చూస్తే... ఢిల్లీలో బాణసంచా నిషేధం అమలు కాలేదని తెలుస్తోందని పేర్కొంది. దీనికి సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీపావళి నుంచి ఢిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, కళ్లు ఎర్రబారడం తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం వివిద ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచి 400 పైబడి దాటింది. కాగా, బాణసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. నిషేధం ఉంటే టపాసులు ఎలా పేల్చారో వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ మూడు రోజుల క్రితం వ్యాఖ్యానించారు. శ్వాసకోశ వ్యాధులను నివారించడానికి ఇంట్లోనే ఉండటమే మంచిదని, ఉదయాన్నే బయటకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ సలహా ఇచ్చారన్న ఆయన.. వాయుకాలుష్యం పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 2016లో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. దీంతో ఢిల్లీలో గ్రాప్ పాలసీని అమలులోకి తీసుకువచ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో నిబంధనలు ఉన్నాయి. బాణసంచాపై నిషేధం సైతం ఉంది.

డీఎంకే పతనంపైనే అందరి దృష్టి

విజయ్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ మండిపాటు

చెన్నై: తమిళ నటుడు విజయ్ దళపతి 'తమిళగ వెట్రి కళగం' పేరుతో రాజకీయ పార్టీని ప్రకటించారు. గత నెల భారీ బహిరంగ సభను కూడా నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆదివారం పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో 26 తీర్మానాలను ఆమోదించారు. ముఖ్యంగా 'వన్ నేషన్, వన్ ఎలక్షన్', నీట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంపై విజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. స్టాలిన్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. అయితే, విజయ్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ తాజాగా స్పందించారు. ఎన్నికల హామీలను చాలా వరకూ నెరవేర్చినట్లు స్పష్టం చేశారు. 'మా ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని కొందరు వాదిస్తున్నారు. మేము చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చాం. మిగిలిని ఒకటి లేదా రెండు త్వరలోనే అమలు చేస్తాం' అని స్పష్టం చేశారు. 'కొత్త పార్టీలను ప్రారంభించే వారంతా డీఎంకే పతనం గురించి మాట్లాడుతున్నారు. దాని గురించి మాకు ఆందోళన లేదు. విమర్శలను మేం పట్టించుకోం. వారికి మాధానాలిచ్చి మా సమయాన్ని వృథా చేసుకోవాలనుకోవడం లేదు. ప్రజల ప్రయోజనం కోసం పనిచేయడమే తమ విధి. నాలుగేళ్ల ప్రభుత్వ విజయాల గురించి ఆలోచించాలని వారికి నేను వినమ్రంగా చెప్పాలనుకుంటున్నాను' అని స్టాలిన్ పేర్కొన్నారు.

కోటాలో విద్యార్థి మృతి

కొనసాగుతున్న ఆత్మహత్యల పరంపర

జైపూర్: ఉన్నత చదువులు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఒత్తిడి కారణంగా ఇప్పటికే చాలామంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తాజాగా మరో విద్యార్థి తనువు చాలించాడు. బీహార్‌కు చెందిన విద్యార్థి (16) జేఈఈ పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. ఏడాది కాలంగా తన తల్లితో పాటు కోటాలోని తలవండి ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. అయితే, ఆదివారం రాత్రి డిన్నర్ చేసిన తర్వాత తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు కోట డిప్యూటీ సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ యోగేశ్ శర్మ తెలిపారు. విద్యార్థిది ఆత్మ హత్యా... లేక సహజ మరణమా... అనేది ఇంకా నిర్ధారించలేదు. అతడి గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని.. శవపరీక్ష తర్వాతే విద్యార్థి మరణానికి గల కారణాలు తెలుస్తాయని ఆయన తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఏడాది కోటాలో 16 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడగా, గతేడాది 30 మంది చనిపోయారు.

సర్పంచులకు ప్రభుత్వం అండ

మార్చి నెలాఖరులోగా బిల్లులు చెల్లిస్తాం : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సర్పంచుల బకాయిలకు ప్రభుత్వం గ్యారెంటీ పొలిటికల్ పార్టీల ట్రాప్ లో పడకండని, రాష్ట్రంలో సర్పంచులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్పంచ్‌లకు మా ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం నాడు మంత్రి పొన్నం ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరి బిఆరెస్ నేతలు రాష్ట్రంలో సర్పంచుల గురించి మాట్లాడుతున్నారని, బిఆర్ఎస్ టైంలో సర్పంచుల ఆత్మహత్యలకు కారణం అయినవారే మద్దతుగా ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందరికి తెలుసు ఓపిక పట్టండి మార్చ్ నెలాఖరులోగా బకాయిలు చెల్లిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలని, కిషన్‌రెడ్డి మమ్ముల్ని ప్రశ్నించే ముందు గత పదేండ్ల నుండి చేసింది ఏంటో చెప్పాలని నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పర్యాటక మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వం పది ఏళ్ల నుండి చేసింది ఏంటో బండి సంజయ్ చెప్పాలని పేర్కొన్నారు. అమర వీరుల స్థూపం దగ్గర చర్చకు రావాలని, కిషన్ రెడ్డికి తెలంగాణ డీఎన్ ఏ లేదని, డీఎన్ ఏ ఉంటే తెలంగాణకు ఏమైనా చేసేవారన్నారు. వరద నష్టం నివేదిక కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్‌కు నివేదించామని చెప్పారు. పది వేల కోట్ల నష్టానికి 400 వందల కోట్లు ఇచ్చారని, మూసీ పరివాహక ప్రాంతాలను బిఆరెస్ రెచ్చకొట్టే కార్యక్రమం ముగిశాక న్యాయం చేయడానికి మేము వెళతామన్నారు.

సర్పంచ్‌ల భాధలు మాకు తెలుసు...

సర్పంచ్‌ల బాధలు మాకు తెలుసని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని అన్నారు. కావున్న ఎవ్వరు తొందర పడొద్దని, వచ్చే మార్చ్ 31 వరకు బకాయిలు క్లేయర్ చేస్తామన్నారు. ఇది బీఆరెస్ నేతలు చేసిన పాపమే, సర్పంచ్‌ల ప్రస్తుత పరిస్థితి అని, సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణం ఎవరు..? బీఆరెస్ ముసలి కన్నీరు కరుస్తుతుందన్నారు. విడుతల వారీగా సర్పంచ్‌ల బకాయిలు చెల్లిస్తామని, కావున ప్రతిపక్షాల ఉచ్చులో మీరు పడకండని సూచించారు. కిషన్ రెడ్డికి కాంగ్రెస్ హామీల మీద మాట్లాడే అర్హత లేదని, బీజేపీ ఇచ్చిన హామీలు ఎంత వరకు అమలు చేశారని తెలిపారు. దీని పై చర్చకు సిద్ధమా మీరు సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్దకు వస్తారా అన్నారు. రాష్ట్రానికి అదనపు నిధుల కోసం కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు ఇచ్చాం స్పందన లేదని, కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. వరదలు వచ్చి తీవ్రనష్టం జరిగితే, 400 కోట్లు ఇవ్వడం అంటే, కేంద్రం వద్ద కిషన్ రెడ్డి బలం అర్థం అవుతుందని, తెలంగాణ బిడ్డవూ అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్తితి మెరుగు చేయాలని సవాల్ చేశారు. కేసిఆర్ సలహాతో బీజేపీ అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి నియామకం అయ్యారని, అలాంటి కిషన్ రెడ్డి విమర్శలు చేస్తే ఊరుకోవాలా అని ఎదురు ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పార్టీ కాంగ్రెస్ అయితే శవాల మీద పేలాలు ఏరుకునే పార్టీ బీఆరెస్ అని అసలు రెండింటికీ పొంతన ఎంటని నిలదీశారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్బి) రాధికా గుప్తా స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (59) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్, చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దిశ సమావేశానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ నెల నవంబర్ 8న నిర్వహించు దిశ సమావేశానికి జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పలు కార్యక్రమాలకు సంబందించిన నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా డెవలప్మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశా) సమావేశం బేగంపేట్ హోటల్ ది ప్లాజా (తెలంగాణ టూరిజం) గ్రీన్ ల్యాండ్స్‌లో నవంబర్ 8న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి: మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి మేయర్ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆయా అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత ఆర్జీదారులకు తెలియజేయాలన్నారు. పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు తెలుపుతూ లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా ఐదు విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికై పంపించడం జరిగింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 35 విన్నపాలు రాగా అందులో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 19 ఫిర్యాదులు రాగా, ఈ.ఎన్.సి విభాగానికి 3, ట్యాక్స్ సెక్షన్, యు.బి.డి, శానిటేషన్ విభాగాలకు 2 చొప్పున, సి.ఎం అండ్ హెచ్.ఓ, ఎలక్ట్రికల్, ఎల్.డబ్ల్యు.ఎస్, వెటర్నరీ, హెచ్.ఎం.డబ్ల్యు. ఎస్.ఎస్.బి, ఎల్.ఏ.ఓ, ఐటీ విభాగాలకు ఒకొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో

మొత్తం 80 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 42, శేరిలింగంపల్లి జోన్‌లో 13, సికింద్రాబాద్ జోన్‌లో 9, ఎల్బీనగర్ జోన్ లో 11, చార్మినార్ జోన్‌లో 5 ఫిర్యాదులు అందగా ఖైరతాబాద్ జోన్ లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, రఘు ప్రసాద్, నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరి రావు, గీత రాధిక, పంకజ, సరోజ, యు బి డి డైరెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ సి సి పి గంగాధర్, ఏ సి పి సుదర్శన్, సి ఈ భాస్కర్ రెడ్డి, వాటర్ వర్క్స్ డి జి ఎం సాయి రమణ, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ ఎస్ఈ కృష్ణరావు, ఈ ఈ పి వి రమణ, రాజేశ్వర్ రావు, డిప్యూటీ సి ఈ పనస రెడ్డి, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, జేసి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆటో కార్మికుల ఛలో హైదరాబాద్

ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు మోటర్ రంగా కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ 12వేల రూపాయల చెల్లిం పు సాధనకై రేపు 5వ తేదీన హైదరాబా దులోని ఇందిరాపార్క్‌లో ఆటో కార్మికుల జేఏసీ నేతృత్వంలో మహాధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సురేష్ తెలిపారు. రేపు నిర్వహించ తలపెట్టిన ఆటో కార్మికుల చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తూ సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆటో అడ్డాలలో ఎఐటియూసి నాయకులు ఆటో కార్మికులను కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ మోటారు రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల దీనస్థితిని చూసి ప్రతి సంవత్సరం రూ.12000లు ఆటో కార్మికులకు అందిస్తామని హామీ ఇచ్చారని కానీ ఆచరణలు మాత్రం అధికారంలోకి వచ్చే పది నెలలు గడుస్తున్న అమలు కావడంలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మహిళల ఉచిత బస్సు పథకం అమలు చేసిన తర్వాత ఆటో కార్మికుల జీవనం మరింత దుర్భరంగా తయారయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలతో సతమతమవుతున్నారని దానికి అనుగుణంగా ప్రయాణ ధరలు పెంచాల్సి ఉన్నా మానవత దృక్పథంతో పెంచలేకపోతున్నారన్నారు. ఫైనాన్స్ సంస్థలలో ఆటో వాహనం కొనుగోలు చేసి ఆటోలు నడవక ఫైనాన్స్ ఈఎంఐ లు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని అన్నారు. అద్దె ఆటోల కార్మికుల జీవన పరిస్థితి మరీ దారుణంగా ఉందని అన్నారు. కనుక ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిచో పోరుబాట పట్టాల్సి వస్తుందని అన్నారు. నేడు జరగబోయే ఆటో కార్మికుల ఆందోళనలకు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు శ్రీరామ్, గోవర్ధన్, యాదయ్య, హజీమ్, ప్రవీణ్, హరీష్, భాస్కర్, సూరి, అంజి, శ్రీనివాస్, తిరుమలేష్, భీమయ్య, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఖచ్చితత్వంతో సమగ్ర సర్వే చేపట్టాలి

డిప్యూటీ కమిషనర్ మారుతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వంద శాతం ఖచ్చితత్వంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా చేపట్టాలని అంబర్ పేట్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ సూచించారు. అంబర్‌పేట్ సర్కిల్‌లో ఈనెల 6వ తేదీ నుండి చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సోమవారం సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు అంబర్ పేటలోని మహా రాణి ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ మాట్లాడుతూ నవంబర్ 6 నుండి ప్రారంభమయ్యే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నమోదు చేయాలని సూచించారు. అంబర్ పేట్ పరిధిలో 90 వేల ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్యుమరేటర్లను, సూపర్ వైజర్లను నియమించామని తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్ 150 ఇళ్లు సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏదేని సందేహాలు ఉన్నట్లైతే ఎప్పటికప్పుడు సంబంధిత సూపర్ వైజర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్యుమరేటర్లు మార్గదర్శకాల మేరకు సర్వే నిర్వహించాలని తెలిపారు. సర్వే చేసిన ప్రతి ఇంటికి స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. సూపర్ వైజర్లు ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించడంతో పాటు సర్వే ప్రక్రియలో అవసరమైన సహాయం అందించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు శంకర్ రెడ్డి, రామ్మోహన్, రజితలు హౌస్ హోల్డ్ షెడ్యూల్ సర్వే ఫారం, హౌస్ లిస్టింగ్ ఫారం, ఎన్యుమరేటర్ మార్గదర్శకాలు, స్టిక్కర్‌ల గురించి వివరించారు. సర్వే విషయమై పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 500 మందికి పైగా హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్లు శంకర్, రామ్మోహన్, రజిత, ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంబర్ పేట్ సర్కిల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రెమ్యునరేషన్ ఇవ్వాలని వినతి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లా ఆశా వర్కర్లు సమగ్ర కుటుంబ సర్వేలో పని చేస్తే వారికి రెన్యుమురేషన్ ఉందా లేదా ఈ సర్వేలో ఉన్న సాధకబాధకాల గురించి అధికారులకు తెలియ చెప్పడానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ని, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.టి.రఘునాథ స్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై అధికారులు అనుకూలంగా స్పందించారని, అధికారులు సమగ్ర కుటుంబ సర్వేకు పదివేల రూపాయలు రెన్యుమురేషన్ ఉందని వివరించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తాము పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారులు సానుకూలంగా స్పందించడంతో ఆశా వర్కర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా నాయకుడు ఉన్నీకృష్ణన్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి, కళ్యాణి, జిల్లా నాయకులు వాసంతి, హేమలత, అనురాధ, ప్రవీణతో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు సిద్ధం చేయండి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలోని రెండు పడకల గదుల ఇండ్లతో పాటు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను, రెవెన్యూ అంశాల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ల వారీగా రెవెన్యూ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడకల ఇండ్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే సికింద్రాబాద్ పరిధిలోని జామున నగర్, తార్నాకలలో అర్హులైన పేదలకు ఇండ్లు అందించే దిశగా రెండు పడకల ఇండ్ల పట్టాలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ప్రజలు

కార్యాలయాల చుట్టూ తిరగకుండా చేసుకున్న దరఖాస్తుల మేరకు పరిశీలించి నివాస,మరణ ధ్రువీకరణ పత్రాలు సత్వరమే అందించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదనీ అట్టి వారిపై చర్యలు తప్పవని నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలనీ హెచ్చరించారు. అనంతరం మండలాల వారీగా సంబంధిత తహసీల్దార్‌లతో పెండింగ్ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ ముకుంద రెడ్డి డిఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరామ్, తాసీల్దార్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై బాలికల హాస్టళ్లలో సంబరాలు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: గత ప్రభుత్వ%శీ% హయాంలో విద్యారంగంలో ఎన్నో వైఫల్యాలతో నాణ్యమైన విద్య. మంచి భోజనం లభించలేదని, మెస్ చార్జీలు సరిపోక అవస్థల పాలయ్యారని, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్,రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల వసతిగృహంలో విద్యార్థినీలకు పెరిగిన డైట్, కాస్మోటిక్ చార్జీలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి రాత్రి పూట భోజనం చేశారు. రుచికరమైన వంటకాలు ఆరగించిన విద్యార్థులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.... గత కొన్ని సంవత్సరాల తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సంక్షేమ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని తెలిపారు. డైట్ చార్జీలు 2017లో ఏడు

సంవత్సరాల తర్వాత పెంచితే కాస్మోటిక్ చార్జీల విష యంలో 2008 తర్వాత అంటే 17 సంవత్సరాల తర్వాత పెంచడం జరిగిందని గుర్తుచేశారు. 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు 950 చార్జీలు ఉండగా ప్రస్తుతం 1330 రూపాయలు అంటే 40 శాతం పెరిగిందని విద్యార్థులకు వివరించారు. 8 నుండి 10వ తరగతి వరకు రూ.1100 ఉన్న చార్జీలు రూ.1540 కి పెంచామని, ఇంటర్ ఆపైన రూ.1500 ఉన్న చార్జీ రూ.2100 లకు పెరిగిందని అన్నారు. కాస్మోటిక్ చార్జీల్లో కూడా 3 నుండి 7వ తరగతి వరకు 175 రూపాయలు పెంచామని అన్నారు. 8 నుండి 10వ తరగతి వరకు 275 రూపాయలు పెంచినట్లు తెలిపారు. బాలికలకే కాకుండా బాలురకు కూడా కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు వివరించారు. 3వ తరగతి నుండి 7వ తరగతి విద్యార్థులకు 62 రూపాయలు ఉన్న కాస్మోటిక్ చార్జీలు 150 వరకు పెంచామని, 8 నుండి 10వ తరగతి వరకు 62 రూపాయలు ఉన్న చార్జీలను 200 రూపాయలకు పెంచదు. జరిగిందన్నారు. యూనివర్సిటీల్లో 60 శాతం పోస్టులు ఖాళీగా పెట్టారని, నియామక ప్రక్రియ చేపట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నియామకాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, నాయకులు బాబర్ అలీ ఖాన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, చెంది తిరుపతిరెడ్డి, బాలరాజ్ గౌడ్, ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, మాధవులు, పురుషోత్తం రెడ్డి, జాంగారి రవి, అశోక్, ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHPATNAM
E.A.132/2023 in E.P. 87/2021 in O.S. 1425/2015

Between:
Smt. Kondapalli Padma Leelavathi ...Petitioner/Claimant
And:
Smt. Boddeda Manikyalu & 4 others ...Respondents

NOTICE

To
R-2: Sri Kaligetla Prasada Rao, S/o. Late Venkata Swamy, Plot Nos 68 & 69, Flat No 401, Kranti Prabha Apartments, Pragati Nagar Colony, Hyder Nagar, Hyderabad-72
R-3: Smt. Kaligetla Kanaka Lakshmi, W/o. Prasada Rao, Rest-do-
R-4: Sri Kaligetla Sai Gopi, S/o. Prasada Rao, Rest -do-
R-5: Sri Kaligetla Vinod Kumar, S/o. Prasada Rao, Rest -do-.

Please take notice that the above E.A., which is filed by the petitioner/ Claimant against you for the Adjudication of her claim over the petition schedule property, stands posted to **20-11-2024** for your notice. If you have any objection, you may attend either personally or through an advocate before the above said Court at **10:30 A.M** on **20-11-2024**, failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Court)
A.N. SATYANARAYANA & A. BHAGYA LAKSHMI, Advocates
NAD Post, Visakhapatnam-9.
Cell: 9849834051, 9949541363

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHPATNAM
E.A.133/2023 in E.P. 87/2021 in O.S. 1425/2015

Between:
Smt Kondapalli Padma Leelavathi ...Petitioner/Claimant
And:
Smt Boddeda Manikyalu & 4 others ...Respondents

NOTICE

To
R-2: Sri Kaligetla Prasada Rao, S/o. Late Venkata Swamy, Plot Nos 68 & 69, Flat No 401, Kranti Prabha Apartments, Pragati Nagar Colony, Hyder Nagar, Hyderabad-72
R-3: Smt. Kaligetla Kanaka Lakshmi, W/o. Prasada Rao, Rest-do-
R-4: Sri Kaligetla Sai Gopi, S/o. Prasada Rao, Rest -do-
R-5: Sri Kaligetla Vinod Kumar, S/o. Prasada Rao, Rest -do-.

Please take notice that the above E.A., which is filed by the petitioner/ Claimant against you for the Adjudication of her claim over the petition schedule property, stands posted to **20-11-2024** for your notice. If you have any objection, you may attend either personally or through an advocate before the above said Court at **10:30 A.M** on **20-11-2024**, failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Court)
A.N. SATYANARAYANA & A. BHAGYA LAKSHMI, Advocates
NAD Post, Visakhapatnam-9.
Cell: 9849834051, 9949541363

విశాలాంధ్ర హైదరాబాద్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ మాత్యులు కొండా సురేఖ కీసర గుట్టలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీసరలో సామూహిక దీపోత్సవ కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. మంత్రి ధ్వజస్తంభంపై ఆకాశ దీపాన్ని వెలిగించి, అనంతరం దీపాలను నీటిలో వదిలారు. ఈ కార్యక్రమాలను మాధవానంద సరస్వతి స్వామి దగ్గరుండి మంత్రితో పూజ కార్యక్రమాలను నిర్వహింపజేసారు. మంత్రితో పాటు దేవాదాయ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమీషనర్ ఈ పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్రెడ్డి, కీసర ఆర్డిఓ సైదులు, తహసీల్దారు, ఆలయ ఛైర్మన్ నాగలింగం, ఆలయఈఓ సుధాకర్ రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో ఉంచకుండ సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, ముకుందరెడ్డిలతో కలసి పాల్గొని ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ దిశగా జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో 255 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణ శాఖకు 208, పెన్షన్లు15, జిల్లా ఉపాధి కల్పనాధికారి 5, డిఇఓ 4,జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ 2, జిల్లా బీసీ వెల్ఫేర్ 2, ఇతరములు 19 దరఖాస్తులు వచ్చినవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటచారి, ఆర్డిఓ రామకృష్ణ, జిల్లా అధికారులు జి ఆశన్న, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్,ఇలియాజ్ అహ్మద్, ఒడ్డెన్న, ఆర్. రోహిణి, షఫీమియా పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరింగంపల్లి నియోజకవర్గంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేసుకుంటే ఏదైనా ప్రమాదవశాత్తు జరగరాని అనర్థాలు జరిగితే 5 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. పార్టీ నమ్మకొని పనిచేస్తున్నటువంటి కార్యకర్తలకు విద్యా దానం, రక్తదానం, బసవతారకం హాస్పిటల్ ద్వారా అనేకమైన సేవా కార్యక్రమాలు అందిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. శేరిలిగంపల్లి నియోజకవర్గంలో ప్రతి గడప తట్టి సభ్యత నమోదు కార్యక్రమం చేయించి తెలంగాణలోనే శేరిలింగంపల్లి నియోజక వర్గాన్ని సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలుపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెపు రాఘవులు, నాయకులు సుభాషిని, కిషోర్ కుమార్ యాదవ్, స్వప్న చౌదరి, ఏరువా సాంబశివ గౌడ్ వెంకటసుబ్బయ్య, శ్రీహరి యాదవ్, రవి శంకర్, అట్లూరి చిట్టిబాబు, నరేందర్ ముదిరాజ్, రంగారెడ్డి, రామారావు, శ్రీనివాస్ రెడ్డి, గౌతమ్, పోలిని సుబ్బారావు, శ్రవణ్, శేఖర్ గౌడ్, శేఖర్, దయానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన స్పైసీ టేబుల్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం తోట శ్రీనివాసరావు, సుస్మిత దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన స్పైసి టేబుల్ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ శాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై ఆమె చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం రెస్టారెంట్ యాజమాన్యం కొలను శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సత్కరించారు.

మూసీ బాధితులను రోడ్డున పడేస్తే ప్రతిఘటన తప్పదు

ఆప్ అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మూసి నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో మూసి బాధితులను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని అఖిల పక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూసి నది బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ హైదరాబాద్, సోమాజి గూడ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా దాసోజు శ్రవణ్, రాగిడి లక్ష్మ రెడ్డి (బిఆర్ఎస్), కె.గోవర్ధన్ (సిపిఐ, ఎంఎల్, న్యూ డెమోక్రసీ), కావ్య (జనసేన), కృష్ణ యాదవ్ (ఫార్వర్డ్ బ్లాక్), సయ్యిద్ మతీన్ అహ్మద్ (టిడిపి), సంజయ (మూసి జాన్ అందోళన్), ఆఫస సలాం (మూసి విక్టిమ్ రైట్స్), సిల్వేరి శ్రీశైలం, వర్గీస్ (సంఘసేవకులు) లతోపాటు పర్యావరణ శాస్త్రవేత్తలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో అందరికి దడ పుట్టించి, మూసి సుందరీకరణ పేరుతొ చడీ చప్పుడు లేకుండా పరీవాహక ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 300 పేదల ఇళ్లను కూల్చి, వెలది ఇళ్లకు ఎరుపు రంగుగుర్తులు వేసి మూసి బాధిత కుటుంబాలకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని మండిపడ్డారు. మూసి నది ప్రక్షాళన, సుదరీకరణకు ఎవరు వ్యతరేకం కాదని, ఈ ప్రాజెక్టు చేపట్టేముందు అన్ని రాజకీయ పార్టీలతో, అఖిల పక్ష కమిటీ ఏర్పాటు, పర్యావరణ శాస్త్ర వేత్తలు, మేధావుల సలహాలు, సూచనలతోపాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రకటన, అనుమతులు, పునరావాస విధానం రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయాలన్నారు. మూసి బాధిత కుటుంబాల్లో ఎక్కువగా కూలి పనులు చేసేవాళ్లు, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలకు చెందిన వాళ్ళు ఉన్నారని వారిని రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదన్నారు. మూసి నివాసతులని తొలగించే అన్ని ప్రయత్నాలను వెంటనే ఆపాలని, డీపీఆర్ నీ తక్షణమే ప్రకటించాలని, బాధితులకు పునరావాసం కల్పించాకే మూసీ నది పునరుద్ధరణ చేపట్టాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేసారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇండ్లు కూల్చుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పేదల ఇళ్లపై బుల్ డోజర్ల ఉపయోగాన్ని రాహుల్ గాంధీ వ్యతరేకిస్తే, తెలంగాణ లోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల ఇళ్లను లక్ష్యంగా చేసుకొని బుల్ డోజర్లలతో కూల్చడం దారుణమన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉంటున్న పేదల ఇండ్లను కూల్చివేస్తామంటే, వారు ఎక్కడికి పోవాలని, రాష్ట్ర ప్రభుత్వమే వారికీ శాశ్వత పునరావాసం కల్పించి పనులు చేపట్టాలని, మూసీ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని, వారి తరపున పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. అన్సారీ, ఎంఏ. మజీద్, మహిళా విభాగం అధ్యక్షులు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, ఖలీమ్ బాబా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ కాలనీకి చెందిన రూబీనా బేగంకి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా మంజూరైన రూ.60 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని పేర్కొన్నారు. మారబోయిన రాజు యాదవ్, చింత కింది రవీందర్ గౌడ్, ప్రసాద్, కాశినాథ్ యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్, రాజు యాదవ్, శశాంక్, పవన్, శ్రావణి రెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: దేశం మొత్తం రైతుపై ఆధార పడిందని, అలాంటి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండల పరిధిలోని చిలకమర్రి గ్రామ శివారులో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా పత్తి సాగు కాస్త ఇబ్బందికరంగా మారిందన్నారు. పత్తి కొనుగోలు కోసం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ముందుకు పోతున్నట్లు తెలిపారు. సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం మీదుగా పత్తి కొనుగోలు ఉంటుందని, రైతులు ఈ విషయాన్నీ అర్థం చేసుకోవాలని కోరారు. సీసీఐ కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా పత్తి కొనుగోళ్లు జరగాలని, పత్తి లో తేమ శాతం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తెలంగాణాలో రైతు ప్రభుత్వం నడుస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు తాను ఒక రైతునని ఈ సంధర్భంగా గుర్తు చేశారు. రైతుల నుండి పత్తి కొనుగోలు పారదర్శకంగా జరగాలని, చిన్న చిన్న టెక్నికల్ సమస్యలు ఉన్నా రైతులను ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ 9వ వార్డులో మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ, 10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ ప్రతాప్ రెడ్డి (చింటు), కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంకళ్ళ చెన్నయ్య, బాబర్ అలీ ఖాన్, బాలరాజు గౌడ్, చెంది తిరుపతి రెడ్డి, బస్వం అప్ప, ముబారల్ అలీ ఖాన్, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, చెన్నప్ప, సందీప్, రాము, వార్డు ఇంఛార్జి మధవులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హాజీపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం హాజీపల్లి గ్రామానికి బీటీ రోడ్ సౌకర్యాన్ని జనవరి వరకు కల్పిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. హాజీ పల్లి గ్రామ శివారులో టీ వరల్డ్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా టీ వరల్డ్ యజమాని వెంకటేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కాంగ్రెస్ నాయకుడు మాజీ ఉపసర్పంచ్ సింగారం సుదర్శన్ ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ సింగారం సుదర్శన్ గ్రామ రోడ్డు సమస్యపై ఎమ్మెల్యేతో మాట్లాడగా ఆయన స్పందిస్తూ జనవరి వరకు పనులు ప్రారంభమవుతాయన అన్నారు. శ్రీకాంత్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి భార్గవ్ కుమార్ రెడ్డి, అందమోహన్, మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్, ముబారక్, అశోక్ పాల్గొన్నారు.

బాలుర చిల్డ్రన్స్ హోమ్‌లో డి-అడిక్షన్ సెంటర్‌కు స్థల పరిశీలన

విశాలాంధ్ర - హైదరాబాద్ : పిల్లలు నేరాలకు, వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకు సత్ప్రవర్తనతో, సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదిగేలా వారి ఉజ్వల భవిష్యత్ కోసం సైదాబాద్ ప్రభుత్వ బాలుర చిల్డ్రన్స్ హోమ్‌లో డి-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించేందు కోసం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి చిల్డ్రన్స్ హోమ్ పరిసరాలను పరిశీలించారు. సోమవారం హైదరాబాద్‌లోని సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర చిల్డ్రన్స్ హోంను సందర్శించి డి అడిక్షన్ కేంద్రంను ప్రారంభించేందు కు పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి వాటివలన కలిగే నష్టాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ నివారణకై జిల్లాలో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డి- అడిక్షన్ సెంటర్‌లో కావలసిన డాక్టర్, కౌన్సిలర్, ఇతర సిబ్బంది గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలుర హోంను, బాలుర పర్యవేక్షణ కేంద్రాన్ని సందర్శించి అందులో ఉన్న పిల్లల స్థితిగతుల వివరాలతో పాటు, పిల్లల వసతి, వారికి అందించే ఆహారం, ప్రైమరి పాఠశాల, వంటగది అలాగే కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనాధ, ఆపదలో ఉన్న పిల్లల భద్రత మనందరి బాధ్యత అని పిల్లల మెరుగైన విద్యనందించాలని అలాగే వ్యాధుల బారిన పడకుండా నిరంతరం మంచి ట్రీట్మెంట్ అందించాలని సూచించారు. ప్రైమరి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందించే బోధన తీరును పరిశీలించారు. అనంతరం అర్చరీ క్రీడా మైదానం పరిశీలించి అర్చరిలో రాష్ట్ర స్థాయికి ఎదిగిన పిల్లలతో మాట్లాడి అర్చరీ ఆట తీరును పరిశీలించి దేశ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ క్రీడాసామాగ్రికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రభుత్వ చిల్డ్రన్ హోమ్‌లోని, వంటశాలను, డార్మెట్ హాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిడి మీర్జా రాజ అలీ బేగ్, ఏడి అబ్జల్, ఎడి రాజేందర్, ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ జయశ్రీ, పర్యవేక్షకులు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 6న స్పాట్ అడ్మిషన్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ : 2024-25 విద్యా సంవత్సరానికి గాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని వివిధ ప్రొగ్రాంలకు ప్రవేశ ప్రక్రియ చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో దిగువ పేర్కొన్న ప్రొగ్రాంలకు కొన్ని సీట్లు మిగిలి ఉన్నందున వీటి భర్తి నిమిత్తం తేది:06-11-2024న ఉదయం 11.00 గం.ల నుండి మధ్యాహ్నం 3.00 గం.ల వరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లి క్యాంపస్ లో స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ప్రవేశాలు నిర్వహించబడతాయి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు ఎస్‌సి, ఎస్‌టి , బి, ఇడబ్ల్యుఎస్, స్పోర్ట్స్, పిహెచ్‌సి వారి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తనిఖీ చేయించుకొని నిర్ణీత ఫీజును చెల్లించి ప్రవేశం పొందవచ్చు. www.teluguuniversity.ac.in పొందుపరచడం జరిగింది.

సీట్లు మిగిలిన కోర్సుల వివరాలు:

1.ఎం.ఏ.అనువర్తిత భాషాశాస్త్రం, 2. బి.ఎఫ్.ఏ., 3. ఎం.ఎఫ్.ఏ., 4. ఎం.ఏ.కర్ణాటక సంగీతం, 5. ఎం.పి.ఏ. నృత్యం, 6. ఎం.పి.ఏ.రంగస్థల కళలు, 7. ఎం.పి.ఏ జానపద కళలు, 8. పి.జి.డిప్లొమా ఇన్ జ్యోతిర్వాస్తు, 9. డిప్లొమా ఇన్ జ్యోతిష్యం, 10.సర్టిఫికెట్ ఇన్ జ్యోతిష్యం, 11. పి.జి.డిప్లొమా ఇన్ యోగా, 12. పి.జి.డిప్లొమా ఇన్ డిక్షనరీ మేకింగ్, 13.పి.జి.డిప్లొమా ఇన్, తెలుగు లాంగ్వేజ్ టీచింగ్, 14. డిప్లొమా ఇన్ లలిత సంగీతం, 15. పి.జి. డిప్లొమా ఇన్ ఫిలిం డైరెక్షన్, 16. డిప్లొమా ఇన్-పద్య నాటకం, 17. డిప్లొమా ఇన్-మిమిక్రీ, 18. డిప్లొమా ఇన్ ఇంద్రజాలం, 19. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ఇన్ విజువల్ కమ్యునికేషన్, 20. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ఇన్ ఇంటీరియర్ డిజైన్, 21.సర్టిఫికెట్ ఇన్ అనిమేషన్, వి.ఎఫ్.ఎక్స్, 22. సర్టిఫికెట్ ఇన్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, పూర్తి వివరాలకు నెం.8520866582 లో సంప్రదించవచ్చు.

ఫిక్కీ కెమికల్స్, పెట్రోకెమికల్స్ అవార్డ్‌ను గెలుచుకున్న లానెక్స్ ఇండియా

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : లానెక్స్ ఇండియా ఇండియా రసాయన రంగంలో 'డిజిటెక్ ఫ్రంట్ రన్నర్ ఆఫ్ ది ఇయర్' కేటగిరీకి సంబంధించి ఫిక్కీ కెమికల్స్, పెట్రోకెమికల్స్ అవార్డు 2024ను గెలుచుకుంది. ఈ కార్యక్రమానికి అనుప్రియ పటేల్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల సహాయ మంత్రి, భారత ప్రభుత్వం, నివేదిత శుక్లా వర్మ, సెక్రటరీ, రసాయనాలు పెట్రోకెమికల్స్ డిపార్ట్మెంట్, రసాయనాలు ఎరువుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, పలువురు ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డును లానెక్స్ ఇండియాకి అందించారు. కార్యక్రమంలో సంస్థ తరపున డిజిటెక్ ఫ్రంట్ రన్నర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును మిస్టర్ నమితేష్ రాయ్ చౌదరి, వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్, లానెక్స్ ఇండియా మిస్టర్ బలరామ్ ఖోట్,హెూల్‌టైమ్ డైరెక్టర్, పిటిఎస్ఇ హెడ్ తో కలిసి అందుకున్నారు. ప్రక్రియ మెరుగుదల, ఆస్తి విశ్వసనీయత, భద్రత, స్థిరత్వం వ్యయ పొదుపులను పెంచే మా సామర్థ్యాలు, పరిష్కారాలను హైలైట్ చేయడం ద్వారా, డిజిటలైజేషన్ పట్ల సంస్థ యొక్క నిబద్ధత ఈ అవార్డు ద్వారా గుర్తించబడింది. మా విలువ గొలుసు అంతటా డిజిటల్ పరిష్కారాలను వ్యూహాత్మకంగా అమలు చేయడం ద్వారా, స్థిరమైన వృద్ధిని, కార్యాచరణ శ్రేష్ఠతను ప్రోత్సహించడం కొనసాగిస్తూనే ఉంటాము. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసిసిఐ) కెమికల్ పెట్రోకెమికల్ పరిశ్రమ అభివృద్ధిలో కంపెనీలను గుర్తించి, సత్కరించడం కోసం ఇండియా కెమ్ సిరీస్ ఈవెంట్‌లలో భాగంగా కెమికల్, పెట్రోకెమికల్ అవార్డుల వేడుకను నిర్వహిస్తుంది.

ఈ విజయంపై వ్యాఖ్యానిస్తూ, మిస్టర్ నమితేష్ రాయ్ చౌదరి, వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్, లానెక్స్ ఇండియా ఇండియా ఇలా అన్నారు. ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకోవడం మాకు నిజమైన గౌరవం, కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడం, సామర్థ్యం, కనెక్టివిటీని మెరుగుపరచడం కొత్త సాంకేతికతలు డిజిటల్ మైండ్‌సెట్ ద్వారా మొత్తం పనితీరును మెరుగుపరచడం ద్వారా మా క్లయింట్లు, ఉద్యోగులు వాటాదారులకు మరింత మెరుగుదలను జోడించడానికి మేము ప్రయత్నిస్తున్నాము అని అన్నారు.

హామీల అమలుకై ఉద్యమిద్దాం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై ఉద్యమిద్దామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ యూనియన్ కార్యదర్శి కే చందు యాదవ్ పిలుపు నిచ్చారు. హామీల అమలుకై చలో ఇంద్ర పార్క్ హైదరాబాద్ మహా ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈనెల 5న జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఆటో మోటార్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డును వెంటనే అమలు చేయాలని, ఆటో డ్రైవర్లకు 12000 రూపాయలు ఇస్తానని ఇచ్చిన హామీలు నెరవేర్చాలి, నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి పలు సందర్భాల్లో చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అయినా ఆదుకున్న దాఖలు లేవన్నారు. హైదరాబాదు నగరంలో గత 11 సంవత్సరాల నుండి పెరిగిన పెట్రోల్ డీజిల్ ఆయిల్ గ్యాస్ నిత్యవసర ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ఈ మీటర్ చార్జీలు పెంచకపోవడం వలన డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటోమేటర్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

మాజీ సర్పంచ్ల ముందస్తు అరెస్ట్

విశాలాంధ్ర - అమనగల్లు : తెలంగాణ రాష్ట్రంలో పల్లెల ప్రగతి పథంలో తమ వంతు సేవలందిస్తూనే గ్రామంలోని అభివృద్ధి పనులైన పలు నిర్మాణాలు చేపట్టి బిల్లులు రాక సర్పంచులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతు న్నారని రాష్ట్ర సర్పంచుల ఫోరం పిలుపు మేరకు సోమవారం సీఎం ఇంటి ముట్టడిని భగ్నం చేసేందుకు పోలీసులు ముందస్తు అరెస్టుల పర్వాన్ని కొనసాగించారు. సీఎం ఇంటి ముట్టడికి వెళ్లకుండా మాజీ సర్పంచ్లను అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషనులకు తరలించారు. సర్పంచ్లను ముందస్తుగానే అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు లక్ష్మి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా ఉన్న ఆస్తులు అమ్మి, అప్పులు తెచ్చి గ్రామంలోని అభివృద్ధి పనులు చేశామని, తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం హేయమైన చర్య అన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన 1500 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సర్పంచుల పెండింగ్ బిల్లుల సాధనకై చలో హైదరాబాద్ ప్రత్యేక సమావేశానికి పిలుపునిచ్చిన రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలను ఆయా సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించినట్లు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తెలిపారు. అరెస్టు చేసిన సర్పంచులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

దర్గాలో కూన ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: నియోజకవర్గం హెచ్ఎంటి ప్రధాన రహదారిలో దర్గా నందు సయ్యద్ ఖాజా భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గంధం మహెూత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇబ్రహీం, కాజా బాయ్, ఇబ్రహీం, ఇస్మాయిల్, ఖాజా మియా షాకీర్, షరీఫ్ లక్ష్మీనారాయణ, సయ్యద్ ఇమ్రాన్, అలీ నవాజ్, ముంతాజ్ గౌస్ ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి : మేయర్

విశాలాంధ్ర- మేడిపల్లి: పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ సోమవారం ఉదయం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటిని సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఈ సాయినాథ్ గౌడ్, రెవిన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పోలియో దినోత్సవ అవగాహన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకోలేని పక్షవాతం, కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుంది. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయింది. ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలి. హైదరాబాద్‌లోని కిడ్స్ కేర్ క్లినిక్‌లోని కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, "పోలియో అనేది సుదూర జ్ఞాపకంగా అనిపించవచ్చు, కానీ అనుసంధానిత ప్రపంచంలో ముప్పు మిగిలే ఉంది. ఇన్‌యాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ (ఐపివి) ఇప్పటికీ మన అత్యంత శక్తివంతమైన రక్షణగా ఉంది, పిల్లల భవిష్యత్తును నాశనం చేసే వైరస్‌కు వ్యతిరేకంగా క్లిష్టమైన రక్షణను అందిస్తుంది..." అని అన్నారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ "పోలియోకు వ్యతిరేకంగా టీకా ప్రయత్నాలు విశేషమైనవి, అయినప్పటికీ మనం శ్రద్ధగా ఉండాలి. రోగనిరోధక శక్తిని కాపాడుకోవడానికి ఈ ప్రమాదకరమైన వైరస్ నుండి పిల్లలను రక్షించడానికి ఆరు వారాల నుండి ప్రారంభమయ్యే సాధారణ రోగనిరోధకత అవసరం.." అని అన్నారు.

ఆదిభట్లలో అక్రమ నిర్మాణాల జోరు ?

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ప్రభుత్వ అనుమతులు లేకుండానే రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు జోరుగా చేపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారులతో బేరాలు కుదుర్చుకొని వారికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. మంగళ్ పల్లి, ఆదిభట్లలో జీ +2 నిర్మాణాలకు అనుమతులు తీసుకొని ఎలాంటి నిబంధనలు లేకుండా 5,6 ఫ్లోర్ల వరకు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాల వల్ల మున్సిపల్ కు రావాల్సిన ఆదాయం పక్క దారి పడుతుందని స్థానికులు వాపోతున్నారు. కొద్దిరోజుల క్రితం అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదంటూ కమిషనర్ అక్రమ నిర్మాణాలు కూల్చివేసి ఆక్రమ నిర్మాణదారులను హెచ్చరించి తదుపరి పనులు జరగకుండా సిబ్బందితో పర్యవేక్షించారు. అదేం విచిత్రమో గాని గతంలో అక్రమ నిర్మాణాలు ఇప్పుడు సక్రమమై అధికారులకు కాసులు కురిపిస్తున్నాయని ప్రజలు బాహటంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై విచారణ చేపట్టి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

విద్యకు పేదరికం అడ్డు కాదు: ఎస్ఐ

విశాలాంధ్ర - అమనగల్లు : ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వికిల్ ఎంబీబీఎస్ సీటు సాధించారు. హయతనగర్ ట్రైబల్ వెల్ఫేర్ ప్రభుత్వ పాఠశాలలో చదివి సీటు సాధించిన వికిల్‌ను సోమవారం ఆమనగల్లు ఎస్సై వెంకటేష్ పోలీస్ స్టేషన్‌లో సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డు కాదని నిరూపించాడని ఆయనను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గదర్శకత్వంలో త్యాగాల తెలంగాణ స్పూర్తితో తెలంగాణ రాష్ట్ర నూతన పద్మశాలి సంఘం ఏర్పడిందని నూతన అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ తెలిపారు. పద్మశాలీల, చేనేత, మరమగ్గాల సంరక్షణకు తమ సంఘం పోరాడుతుందని ప్రకటించారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నూతన కమిటీని ప్రకటించారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా బూర మల్లేశం, వేముల బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మచ్చ సుధాకర్, వేముల వెంకన్న సలహాదారులుగా గోశిక యాదగిరి, గుంటి నగేష్, ప్రధాన కార్యదర్శులుగా అప్పం శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, కోశాధికారిగా బింగి నవీన్ కుమార్, మహిళా చైర్మన్ కొండ పద్మ, యువజన విభాగం చైర్మన్ గంధ మల్ల రాజులతో కూడిన రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పద్మశాలీల ప్రాథమిక అవసరాలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు రాష్ట్ర జనాభాలో తాము ఆరు శాతం ఉన్న అవకాశాలలో వెనకబడే ఉన్నామన్నారు చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీని రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర కమిటీలో మొత్తం 75 మంది సభ్యులు ఉన్నట్లుగా తెలిపారు. వీరంతా ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిలో ఎన్నిక అయ్యారని ఆయన స్పష్టం చేశారు.

రైతాంగానికి పెట్టుబడి సాయమందించాలి

- పెండింగ్ ప్రాజెక్టులకు నిధులివ్వాలి
- ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం డిమాండ్
- గ్రామ సచివాలయాల ఎదుట ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతాంగానికి పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల వద్ద ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నేతలు చేపట్టిన ఆందోళనలు విజయవంతంగా ముగిశాయి. సోమవారం 26 జిల్లాల్లో గ్రామ సచివాలయాల వద్ద రైతు సంఘం నేతలు ఆందోళనలు నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సచివాలయ గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం, మేడిపి గ్రామ సచివాలయం ఎదుట ఆందోళనలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం ముక్తాపురంలో గ్రామ సచివాలయం వద్ద రైతు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ.కాటమయ్య, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరు గ్రామం సచివాలయం వద్ద ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పాల్గొన్నారు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతాంగానికి పంట రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి... నిర్మాణాలు చేపట్టాలని, తద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని నేతలు నినదించారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా పెట్టుబడి సాయం అందించలేదని, కూటమి హామీని వెంటనే అమలు చేయాలన్నారు. భారీ వరదల వల్ల లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయినప్పటికీ నామ మాత్రపు పరిహారమే అందించారని తెలిపారు. అత్యధిక మండలాల్లో కరవు ఉన్నప్పటికీ కేవలం 54 మండలాలనే కరవు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలంటూ సచివాలయాల ఎదుట నినదించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

విజయవంతంగా ఆందోళనలు : కేవీవీ ప్రసాద్

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయం వద్ద చేపట్టిన ఆందోళనలు విజయవంతమయ్యాయని కేవీవీ ప్రసాద్ తెలిపారు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతాంగానికి పంట రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి నిర్మించాలన్నారు. ఎ.కాటమయ్య మాట్లాడుతూ కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమ జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పి.జమలయ్య మాట్లాడుతూ ఆర్‌బీఐ నిబంధన ప్రకారం ష్యూరిటీ లేని పంట రుణాలు కౌలు రైతులకు అందించాలని, ఈనెల 11వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రమైన కౌలు రైతుల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లాలో జరిగిన ఆందోళనలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేసి వెంటనే నిర్మించాలని, తద్వారా సాగునీటి రంగాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కర్నూలు జిల్లాలోని కర్నూలు రూరల్ మండలం పెద్దటేకూరు గ్రామంలో నిర్వహించిన ఆందోళనలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలన్నారు. విజయనగరం జిల్లాలోని సీతానగరం మండలం కామంద్ర వలస గ్రామంలో రైతు సంఘం కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో రైతు సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్ ఉలవపూడి రాము రైతులతో గ్రామ సచివాలయం ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. తిరుపతి జిల్లా అమ్మపాలెం వద్ద ఆందోళనలో రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎ.రామానాయుడు మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో రైతాంగం సాగు చేస్తున్న పంటలన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించాలన్నారు. ప్రకాశం జిల్లా కరవది గ్రామంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు వి.హనుమారెడ్డి తదితరులు ఆందోళనలకు నాయకత్వం వహించారు.

ఇసుక... ఏజెన్సీలకు అప్పగించడం మోసగించడమే

11న రాష్ట్రవ్యాప్త ధర్నా జయప్రదం చేయండి: ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: ఇసుక ఉచితమంటూనే... రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన పాలసీ మేరకు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం ప్రజలను మోసగించడమేనని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు విమర్శించారు. ఇసుక సమస్యపై ఈ నెల 11వ తేదీ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘ వర్కింగ్ కమిటీ సమావేశం సోమవారం గొల్లపూడి ఏఐటీయూసీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాలు సంయుక్తంగా ఈ నెల 26న అన్నిరకాల సమస్యలపై కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, వివిధ రూపాలలో కార్యాచరణ రూపొందించాలని, అన్ని జిల్లాలలో ఉద్యమం కొనసాగించాలని కోరారు. ఉచితం పేరుతో తమ్మిలేరు మొత్తం టీడీపీ నాయకులు తవ్వుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయని చెప్పారు. ఈ నెల 10న ఏలూరులో జరిగే ప్రభుత్వ పాఠశాలల ఆయమ్మల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని అన్నారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మిక సంఘాల కేంద్ర పరిశీలనకు అన్ని యూనియన్లు సిద్ధపడాలని, 2023 వరకు రిటర్న్ అప్లికేషన్ ఫీజులు చెల్లించాలని కోరారు. తొలుత ఇటీవల మరణించిన పలువురి సంతాప తీర్మానాన్ని ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య ప్రవేశపెట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగు రాధాకృష్ణమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, కోశాధికారి బీవీ కొండలరావు, సుబ్బారెడ్డి, లలితమ్మ, రాజారెడ్డి, సుబ్బరాయుడు, రమేష్ బాబు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలైతే వైదొలుగుతాం

వక్ఫ్ ప్యానెల్ చైర్‌పర్సన్ తీరుపై విపక్ష ఎంపీల మండిపాటు

నేడు స్పీకర్ ఓం బిర్లాతో భేటీ

న్యూఢిల్లీ: వక్ఫ్ బిల్లు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును విపక్ష ఎంపీలు దుయ్యబట్టారు. వక్ఫ్ (సవరణ) బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీలోని ప్రతిపక్ష ఎంపీలు మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశం కానున్నారు. ప్యానెల్ చైర్‌పర్సన్ జగదాంబికా పాల్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, వాటిని సిద్ధం చేయడానికి సహేతుకమైన సమయం ఇవ్వకుండా విచారణలను 'బుల్డోజ్' చేయడానికి ప్రయత్నించారని ఆరోపిస్తూ... ఇలాగైతే ప్యానెల్ నుంచి తాము వైదొలుగుతామని హెచ్చరించారు. సోమవారం స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో... కమిటీ కార్యకలాపాల సమయంలో తమను అడ్డుకున్నారని పేర్కొంటూ, ప్రతిపాదిత చట్టంపై అభ్యంతరాలతో సహా తమ మనోవేదనలను వివరించారు. కాంగ్రెస్‌కు చెందిన మహ్మద్ జావేద్, ఇమ్రాన్ మసూద్, డీఎంకేకు చెందిన రాజా, ఎఐఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, ఆప్‌కి చెందిన సంజయ్ సింగ్, టీఎంసీకి చెందిన కల్యాణ్ బెనర్జీ సహా అనేక మంది ఎంపీలు సంతకం చేసిన ఉమ్మడి లేఖను మంగళవారం స్పీకర్‌కు సమర్పించనున్నట్లు ప్రతిపక్ష వర్గాలు తెలిపాయి. బీజేపీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నాలుగు పర్యాయాలు ఎంపీ అయిన వక్ఫ్ ప్యానెల్ చైర్‌పర్సన్ జగదాంబికా పాల్... సమావేశాల తేదీలను నిర్ణయించడంలో 'ఏకపక్ష నిర్ణయాలు' తీసుకున్నారని, అవి ఒక్కోసారి వరుసగా నాలుగు రోజులు ఉండేవని వారు ఆరోపించారు. ఎంపీలు తగిన సన్నద్ధతతో సాక్షులతో సంభాషించడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని వారు చెప్పారు. అనేక సమస్యలపై ప్రతిపక్ష సభ్యుల నుంచి తరచూ నిరసనలతో కమిటీ కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. అయితే ఉద్దేశపూర్వకంగా దాని పనిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీ సభ్యులు ఎదురుదాడి చేశారు. ఇదిలాఉండగా, ఈ బిల్లు రాజకీయ రంగులను సంతరించుకోవడంతో పాటు అధికార బీజేపీ, ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన రెండూ వరుసగా అనుకూలంగా, వ్యతిరేకంగా తమ వైఖరిని కలిగి ఉండటంతో ప్యానెల్ సమావేశాలు తరచుగా రాజకీయ యుద్ధభూమిని తలపించాయి. విపక్ష ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాకు రాసిన తమ ఉమ్మడి లేఖలో, ఏ విధమైన పక్షపాతం, పార్లమెంటరీ విధానాల నుంచి నిష్క్రమణ లేకుండా, స్వేచ్ఛగా, న్యాయమైన పద్ధతిలో పనిచేస్తుందని దేశానికి భరోసా ఇవ్వడానికి ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు కమిటీ సభ్యులతో అధికారిక సంప్రదింపులు జరపాలని చైర్‌పర్సన్ జగదాంబికా పాల్‌ను ఆదేశించాలని కోరారు. 'లేకపోతే, మేము ప్యానెల్ నుంచి వైదొలుగుతామని వినయంగా సమర్పిస్తున్నాం' అని తెలిపారు. బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటు ఉమ్మడి కమిటీ మినీ పార్లమెంటు లాంటిదని, సరైన ప్రక్రియను విస్మరించి, ప్రభుత్వం కోరిన విధంగా ప్రతిపాదిత చట్టాన్ని ఆమోదించడానికి ప్యానెల్‌ను కేవలం 'వెంటిలేటింగ్ చాంబర్' గా పరిగణించరాదని వారు పేర్కొన్నారు. కమిటీ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా సహేతుకమైన సమయం ఇవ్వకపోవడం 'రాజ్యాంగం, పార్లమెంటుపై దారుణమైన దాడి తప్ప మరొకటి కాదు' అని వెల్లడించారు.

విపక్ష ఎంపీలు కూడా బిల్లుకు వ్యతిరేకంగా తమ బలమైన అభ్యంతరాలను లేవనెత్తారు. రాజ్యాంగం లౌకిక ఆధారాలను నిర్ధారిస్తూ తగిన జాగ్రత్తతో పార్లమెంటు చేసిన 1995, 2013కు చెందిన మునుపటి చట్టాలను తగ్గించడానికి ప్రభుత్వం వేస్తున్న అడుగు ఒక రహస్య ప్రయత్నమే తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం కేవలం 44 మార్పులకు వ్యతిరేకంగా ప్రస్తుత చట్టానికి 100 సవరణలను బిల్లు ప్రతిపాదిస్తున్నదని వారు ఆరోపించారు. బిల్లులోని ప్రతి నిబంధనను చర్చించడానికి తగిన సమయాన్ని అనుమతించే విధంగా కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్ణయించాలన్నారు. ప్యానెల్ పనితీరులో 'నిబంధనల ఉల్లంఘన' ను ఎత్తిచూపుతూ ప్రతిపక్ష సభ్యులు గత నెలలో స్పీకర్‌కు లేఖలు రాశారు. ఇదిలాఉండగా, బిల్లుపై అభిప్రాయాలను నమోదు చేసేందుకు జమాతే ఇస్లామీ హింద్‌తో సహా అనేక ముస్లిం సంఘాలు సోమవారం కమిటీ ముందు హాజరయ్యారు. జమాతే ఇస్లామీ హింద్ సవరణలను వ్యతిరేకించగా, షాలినీ అలీ నేతృత్వంలోని ముస్లిం మహిళా మేధావుల బృందం, ఫైజ్ అహ్మద్ ఫైజ్ నేతృత్వంలోని విశ్వ శాంతి పరిషత్‌తో సహా అనేక ఇతర సంఘాలు ఈ మార్పులకు మద్దతు ఇచ్చాయి.

'టెట్' నం.1 క్రాంతికుమార్

విశాలాంధ్ర - అవుకు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టెట్ ఫలితాలలో నంద్యాల జిల్లా అవుకు మండలం నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన తలారి క్రాంతి కుమార్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులు వెల్లడించారు. గత నెల మూడో తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించిన టెట్ పరీక్ష ఫలితాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సోమవారం విడుదల చేశారు. తలారి క్రాంతి కుమార్ 150 మార్కులకు 150 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అతడి తండ్రి కృష్ణయ్య, తల్లి భూలక్ష్మి వ్యవసాయ కూలీలు. అన్న మనోజ్ పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్నారు.

రూ.500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ధరల స్థిరీకరణ కోసం రూ.500 కోట్లతో నిధి ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సోమవారం సచివాలయంలో మంత్రి మనోహర్ అధ్యక్షతన ధరల పర్యవేక్షణపై మంత్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. బియ్యం, కందిపప్పు, టమాటా, ఉల్లి ధరల నియంత్రణపై చర్చించారు. టమాటా, ఉల్లి నిల్వ చేసుకునే పద్ధతులపై మంత్రుల కమిటీ ఆరా తీసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ధరల పరిస్థితిని మంత్రులు, అధికారులు సమీక్షించారు. ప్రత్యేక కౌంటర్లలో అమ్మకాల ద్వారా బియ్యం ధరల స్థిరీకరణ జరిగిందని, కంది పప్పు ధర తగ్గినట్లు, కేంద్రం దిగుమతి సుంకం పెంపుతో వంట నూనె ధరలు పెరిగినట్లు అధికారులు వివరించారు. పెరిగిన వంటనూనె ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ప్రత్యేక కౌంటర్ల ద్వారా లీటర్ పామాయిల్ రూ.110కు ప్రభుత్వం విక్రయిస్తోందని మంత్రి మనోహర్ తెలిపారు. దిగుమతి దారులు, హోల్‌సేల్ నిర్వాహకులు, రిటైల్ దారులతో ప్రభుత్వం చర్చించిన అనంతరం రాయితీ ధరలపై వంట నూనెను క్యూ ఆర్ కోడ్ ద్వారా అమ్మకాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బియ్యం, కందిపప్పు, పంచదారను సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. కందిపప్పు కిలో67, పంచదార అర కిలో రూ.16, పామాయిల్ లీటర్ రూ.110 చొప్పున రైతు బజార్‌తో పాటు రాష్ట్రంలోని 2,200 రిటైల్ అవుట్ల ద్వారా సబ్సిడీ ధరలకు విక్రయిస్తున్నట్లు వివరించారు. 154 మండల కేంద్రాల్లో సీపీ యాప్ ద్వారా ప్రతీరోజూ ధరలు సేకరిస్తున్నామని అన్నారు.

సూపర్-6 హామీల అమలేది?

- తల్లికి వందనం రూ.15 వేలు ఇవ్వాలి
- ప్రతి మహిళకు రూ.1500 ఎక్కడ?
- కలెక్టర్లకు వ్యవసాయ కార్మిక సంఘం వినతులు
- ఎన్నికల హామీలు అమలు చేయాలి: కోటేశ్వరరావు, శేఖర్, వెంకట్రావ్

(విశాలాంధ్ర బ్యూరో-న్యూస్ నెట్‌వర్క్)

ఎన్నికల ముందు చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ... రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు పోటెత్తాయి. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపులో భాగంగా కర్నూలు జిల్లా కలెక్టర్‌కు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారికి రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు, ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావ్ అధ్వర్యంలో నేతలు వినతిపత్రాలు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు బి.కృష్ణ, సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్, ఈశ్వర్ తదితరులు జిల్లా కలెక్టర్ రంజిత్‌భాషకు వినతిపత్రాలు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతులు ఇచ్చిన వారిలో చిలుకూరి వెంకటేశ్వరరావు, ఉప్పెన నరసింహారావు, నాగుల్ మీరా ఉన్నారు. ప్రకాశం జిల్లాలో సంఘం నాయకులు విజయ, రవి, లక్ష్మీ హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావ్ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సహాయం రూ.20 వేలు అందించాలని, తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు ప్రస్తావనే లేదని విమర్శించారు. ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఇస్తానని వాగ్దానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం... కొంత మేరకు నిధులు విడుదల చేసిందని, అయితే ఇందులో అనేక నిబంధనలు పెట్టి పేదలకు గ్యాస్ అందకుండా చేస్తున్నారన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.6,072 కోట్ల భారాన్ని పేద ప్రజానీకంపై వేసిందని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారని, ఈ హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో వేస్తున్న సీసీ రోడ్లు, ఇతర సిమెంట్ పనులను పూర్తిగా కూలీలతోనే చేయించాలని కోరారు. తెల్ల రేషన్ కార్డు ఉంటేనే పేదలకు సంక్షేమ పథకాలు లభిస్తాయని, అందువల్ల అర్హులైన పేదలకు సత్వరమే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

అనంతపురం జిల్లా కలెక్టర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు బి.కేశవరెడ్డి, రంగయ్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కేఎల్ రామాంజనేయులు, తిరుపాల్ వినతిపత్రాలు అందజేశారు. కడప జిల్లా కలెక్టర్‌కు జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పగడిపూల మల్లికార్జున, నెల్లూరు జిల్లాలో జిల్లా అధ్యక్షులు దరగా బాబు, రమణయ్య, అన్నమయ్య జిల్లాలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పందు గోలమని, టి.కృష్ణప్ప, గుంటూరు జిల్లాలో కాబోతు ఈశ్వరరావు, కోటేశ్వరమ్మ, సత్యానంద్, దేవునిదయ, ఏలూరు జిల్లాలో బండి వెంకటేశ్వరరావు, కుంచె వసంతరావు, గొలిమి ఏసు, రాజమండ్రిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు, అనకాపల్లి జిల్లాలో సంఘం నాయకులు కొండలరావు, రాము నాయుడు, పశ్చిమ గోదావరి జిల్లాలో కళింగ లక్ష్మణ్, వెంకట్రావు, సనపల శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లాలో చాపర సుందర్‌లాల్, లండా వెంకట్రావు, మన్యం జిల్లాలో గరుగుబిల్లి సూరయ్య, జీవ, కాకినాడలో అన్నవరం, రామకృష్ణ, అప్పలరాజు, కోనసీమ జిల్లాలో రామకృష్ణ, దేవా రాజేంద్ర ప్రసాద్, తిరుపతిలో జిల్లా అధ్యక్షుడు తులసి రాజన్, శివయ్య తదితరులు వినతిపత్రాలిచ్చారు.



హిందూ ఆలయంపై దాడిని ఖండించిన ప్రధాని మోదీ

ఢిల్లీ: కెనడాలోని హిందూ ఆలయం లక్ష్యంగా జరిగిన దాడి ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ విధ్వంసక ఘటనను తీవ్రంగా ఖండిస్తూ 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. కెనడాలో భారత దౌత్యవేత్తలను బెదిరింపులకు గురిచేసే పిరికిపంద యత్నాలు మరింత భయంకరమైనవిగా పేర్కొన్నారు. ఇలాంటి హింసాత్మక చర్యలు భారత్ స్థైర్యాన్ని ఏమాత్రం బలహీనపరచలేవన్నారు. కెనడా ప్రభుత్వం చట్టపరంగా వ్యవహరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కెనడాలో మరోసారి రెచ్చిపోయిన ఖలిస్థానీలు అక్కడి బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగడం తీవ్ర ఆందోళన కలిగించిన విషయం తెలిసిందే.

నేనే హోం మంత్రినైతే...

- అత్యాచార ఘటనలకు అనిత బాధ్యత వహించాలి
- నేరస్తుడికి కులం, మతం ఉండదు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-గొల్లప్రోలు: 'నేనుగానీ హోం మంత్రిని అయితే పరిస్థితులు వేరేలా ఉంటాయి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచార ఘటనలకు హోం మంత్రి వంగలపూడి అనిత బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్... కాకినాడ జిల్లా గొల్లప్రోలు జడ్పీ హైస్కూలులో సోమవారం సైన్స్ ల్యాబ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమపై విమర్శలు చేసే వారిని ఇలాగే వదిలేస్తే హోం మంత్రిగా బాధ్యతలు తీసుకోవాల్సి వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రిని చంపేస్తానని బెదిరించిన వ్యక్తిని ఎందుకు వదిలేస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. ఇళ్లలోకి వెళ్లి మహిళలపై అత్యాచారం చేస్తుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. గత ఐదేళ్లలో 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమైతే అప్పటి ముఖ్యమంత్రి మాట్లాడలేదని అన్నారు. అప్పులెలా వారసత్వంగా వచ్చాయో... గత ప్రభుత్వంలో చేసిన నేరాలు కూడా ఇప్పుడు వారసత్వంగా వచ్చాయని చెప్పారు. 'శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయాలని అనేకసార్లు చెప్పాను. గత ప్రభుత్వంలో పోలీసు అధికారులు నియంత్రణ లేకుండా వ్యవహరించారు. ఇవాళ ధర్మబద్ధంగా చేయండని ప్రాథేయ పడుతున్నా మీనమేషాలు లెక్కపెడుతున్నారు' అని అసహనం వ్యక్తం చేశారు. నేరస్తుడికి కులం, మతం ఉండవని స్పష్టం చేశారు. మూడేళ్ల ఆడబిడ్డను అత్యాచారం చేసి చంపేస్తే కులాన్ని వెనకేసుకొస్తారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి సహనం ఎంత ఉందో... తెగింపు కూడా అంతే ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. 'తప్పులు చేసిన వారిని నా బంధువు... నా రక్తమని ఎవరైనా చెబితే మడతపెట్టి కొట్టండి. నేను ఎవరినీ వెనుకేసుకు రావట్లేదు. హోం మంత్రి అనితకు కూడా చెబుతున్నా... మంత్రిగా మీరు బాధ్యత వహించండి. నేను హోం శాఖ తీసుకుంటే పరిస్థితులు వేరుగా ఉంటాయి' అని హెచ్చరించారు. నాయకులు ఉన్నది ఓట్లు అడగడానికేనా? బాధ్యత నిర్వర్తించడానికి కాదా అని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ చేసినట్లు నేరస్తులను చేయాలని పవన్ కల్యాణ్ అన్నారు. ఆడబిడ్డల మాన,ప్రాణ సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని తెలిపారు.

రూ.5.52 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండల పరిధిలో రూ.5.52 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. గొల్లప్రోలు బాలుర జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 28.5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న గొల్లప్రోలు తహసీల్దార్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.16 లక్షల అంచనా వ్యయంతో యూపీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణంతో పాటు ఎలక్ట్రికల్, పారిశుధ్య పనులకు శంకుస్థాపన చేశారు. రూ.4 కోట్ల అంచనా వ్యయంతో గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో సుద్దగడ్డ డ్రెయిన్‌పై 9.2 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో 2,200 కుటుంబాలకు ముంపు కష్టాలు తీరనున్నాయని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు రూ.3.2 లక్షల అంచనా వ్యయంతో మొగలి సూరీడు చెరువు సుందరీకరణ, రూ.24 లక్షల అంచనా వ్యయంతో సూరంపేట ఉత్తర, దక్షిణం వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణం, రూ.19 లక్షల అంచనా వ్యయంతో గొల్లప్రోలు జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల తరగతి గదుల ఆధునీకరణ చేయనున్నారు. రూ.62 లక్షల అంచనా వ్యయంతో మండల ప్రజాపరిషత్ పాఠశాల నంబర్ 2 గొల్లప్రోలు తరగతి గదుల నిర్మాణం, కాంపోనెంట్స్, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన పార్టీ ఇంఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్, బీజేపీ బుర్ర కృష్ణంరాజు, కలెక్టర్ షన్మోహన్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌ల వాట్సప్ గ్రూప్ ఏర్పాటుపై వివాదం

తిరువనంతపురం: ప్రత్యేక వర్గం పేరుతో ఐఏఎస్ అధికారులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయడం కేరళలో వివాదాస్పదమైంది. ఆ వాట్సప్ గ్రూప్‌నకు సంబంధించిన స్క్రీన్‌షాట్ వైరల్ కావడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై రాష్ట్రప్రభుత్వం స్పందించింది. ఒక వర్గం ఆధారంగా అధికారులు గ్రూపులు ఏర్పాటు చేసుకోవడం సరికాదని కేరళ మంత్రి పి.రాజీవ్ అన్నారు. 'ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరుపుతుంది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రవర్తనా నియమావళి ఉంటుంది. దాని ఆధారంగా విచారణ ఉంటుంది' అని మంత్రి మీడియాకు వెల్లడించారు. మరోవైపు ఈ గ్రూప్ అడ్మిన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి కె.గోపాలకృష్ణన్ పేరు ఉందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ గ్రూప్‌లో సీనియర్, జూనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నారని పేర్కొన్నాయి. విమర్శలు రావడంతో వెంటనే దానిని డిలీట్ చేశారు. మరోవైపు తన వాట్సప్ హ్యాక్ అయిందని గోపాలకృష్ణన్ సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా ఈ గ్రూప్ క్రియేట్ అయిందని సభ్యులకు మెసేజ్ పంపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.